ప్రజాశక్తి

Vol. 1, no. 232

(Jul. 28, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 232

(Jul. 28, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd No 4486

16 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 28—7—46 ఆదివారం [సంచిక 232

ఈ సంచికలో

బ్రిటిష్ ప్రణాళికను అక్షరశః అమలు జరపాలి

ముస్లింలీగు వర్కింగుకమిటీ చర్చల వైఖరి

బొంబాయి జులై 26

జిన్నా యింటిలో ఈ ఉదయం, ముస్లింలీగు వర్కింగుకమిటీ నాలుగు గంటల సేపు చర్చలు సాగించింది. తీర్మానమేదీ చేయ లేదు.

తొలుత జిన్నా, క్రిందటి సమావేశం తర్వాత జరిగిన సంఘటనలను వివరించాడు. తర్వాత చర్చ ప్రారంభమైంది.

చాలమంది సభ్యులు, వైస్రాయి తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించ పోయినందుకు విమర్శించారు. తాత్కాలిక ప్రభుత్వం నిర్మింపబడుతుందన్న దృక్పథంతోనే, లీగు రాజ్యాంగసభలో ప్రవేశించ నిశ్చయించిందనికూడ వారు వాదించినట్లు తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రతిపాదనల విషయంలో, లీగుదృక్పధాన్ని తిరిగీ సరికొత్తగా ఆలోచించాలని వీరు కోరారు.

బ్రిటిషు రాయబారుల మే 16 ప్రతిపాదనలకు, కాంగ్రెస్ నాయకులు తమ కిష్టం వచ్చిన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అలాంటి వ్యాఖ్యానాలను మెజారిటీ ఓటుతో రాజ్యాంగ నిర్మాణసభలో ఆమోదింప జేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తే, లీగు ప్రతినిధులు రాజ్యాంగసభనుండి వెళ్ళిపోవాలని, కొందరు సభ్యులు చర్చలో సూచించారు. బ్రిటిష్ ప్రతిపాదనలు ఉన్న వున్నట్లుగా అమలుజరిపితేనే, లీగు అంగీకరించాలన్నారు.

తాత్కాలిక ప్రభుత్వ విషయం

తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణంగూర్చి, కొత్త ప్రతిపాదనలు వైస్రాయి పంపుతాడని వాటికోసం ఎదురుచూస్తున్నానని జిన్నా చెప్పాడనికూడ తెలుస్తున్నది.

అఖరుకు, అధికార తీర్మానాన్ని దేనినీ, వర్కింగుకమిటీ లీగు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టకూడదనే, ఎక్కువమంది సభ్యులు సూచించారట. రేపు ఉదయం సమావేశం కానున్న లీగు కౌన్సిల్లో, సభ్యులే వ్యక్తిగతంగా కొన్ని తీర్మానాలు ప్రతిపాదిస్తారని తెలుస్తున్నది.

నవాబ్జాదా లియాకతాలీఖాన్ అన్నదేమంటే

"మేము కౌన్సిల్ సభ్యులకు తమ అభిప్రాయాలను ప్రకటించే అవకాశమివ్వదలచుకున్నాము" అని

కౌన్సిల్ చర్చల తర్వాత లీగు వర్కింగ్ కమిటీ, ఒక తీర్మానం తయారుచేయ వచ్చునని కూడ నవాబ్జాదా సూచించాడు.

తీర్మానాల ధోరణి

అనధికార తీర్మానాలు చాలా వచ్చాయి. అందులో, రాజ్యాంగ నిర్మాణసభను బహిష్కరించాలనేవి కొన్ని; రాజ్యాంగ సభలో హిందూ - ముస్లిం సమాన ప్రాతినిధ్యం ఉండాలనికోరే తీర్మానాలు కూడా ఆ వచ్చిన తీర్మానాల్లో ఉన్నట్లు తెలుస్తున్నది.

వర్కింగు కమిటీ ఎల్లుండి తిరిగి సమావేశమవుతుంది.

దక్షిణాఫ్రికా సత్యాగ్రహం

డర్బన్ జులై 25

మాలపల్లి చట్టాన్ని ధిక్కరిస్తూ 6 గురు భారతీయ సత్యాగ్రహులకు ఈ రోజు మేజస్ట్రేటు శిక్షలు వేశాడు. ఇరువురికి 5 పౌనుల జరిమానా లేక ఒక నెల కఠినశిక్ష వేయబడింది. మిగతాముగ్గురికి 3 పౌనులు జరిమానా లేక ఒక నెల కఠిన శిక్ష వేశాడు.

ఈ రోజు రాత్రి శ్రీధర్ రోడ్డు స్కూలు హెడ్‌మాస్టర్ పి. ఏ. విశ్వాను, మరి ఎనిమిదిమంది సత్యాగ్రహులను పోలీసులు అరెస్టుచేశారు.

అశ్విన్‌చౌదరి అమెరికాలో

న్యూయార్కు, జులై 25

దక్షిణాఫ్రికా సత్యాగ్రహ కౌన్సిల్ ప్రతినిధి అశ్విన్ చౌదరి ఇక్కడికి వచ్చాడు.

మిత్రరాజ్య సమితి సెప్టెంబరులో దక్షిణాఫ్రికా మాలపల్లి బిల్లు గూర్చి చర్చిస్తుంది. అప్పుడు భారతదేశ ప్రతినిధులకు ఈయన సలహాదారుగా ఉంటాడు.

రాజ్యాంగసభ స్వతంత్రమైంది కాదు

కాంగ్రెసు సోషలిస్టుల దృక్పథం

బెంగుళూరు, జులై 26

నిన్న ఇక్కడ జరిగిన కాంగ్రెసువర్కర్ల సభలో, శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ రాజ్యాంగసభ విషయంలో కాంగ్రెసు సోషలిస్టుల దృక్పథంగూర్చి ఇలాఉపన్యసించింది.

"ఇప్పుడు ఏర్పడుతున్న రాజ్యాంగ నిర్మాణ సభ, బ్రిటిష్‌వారి అవార్డు ద్వారా ఏర్పడింది. బ్రిటిష్ ప్రభుత్వం తన్ను తానే పరిష్కర్తగా నియమించుకొని ఈ అవార్డు ఇచ్చింది. కాబట్టి ఈ రాజ్యాంగసభ స్వతంత్ర ప్రజలు ఏర్పరచుకొన్నది కాదు. బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని అప్పగించిం తరవాత, కాంగ్రెస్ కాని, ముస్లింలీగ్ కాని ఏర్పరచగల ప్రజా పరిషత్తు ఇంతకు భిన్నంగా ఉంటుంది.

"ఇప్పుడున్న రాష్ట్ర శాసన సభల ఓటర్లు, భారత ప్రజల్లో కేవలం నూటికి ఇరవైపాళ్లమాత్రమే ఉన్నారు. అలా ఏర్పడిన శాసన సభనుండి ఎన్నుకొనబడిన రాజ్యాంగసభ ప్రతినిధులు ప్రజలందరికి ప్రతినిధులు కారు. అదీ కాక ఆ ఎన్నికలైనా స్వతంత్ర వాతావరణంలో జరగలేదు.

"కాబట్టే, రాజ్యాంగ సభను బహిష్కరించాలని కాంగ్రెస్ సోషలిస్టులు నిశ్చయించారు."

ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, సంస్థానాల ప్రతినిధిగా, కాంగ్రెస్ వర్కింగు కమిటీలో ఒకరుండడం అవసరమని ఆమె చెప్పింది.

గోవాకు యుద్ధనౌక

పోర్చుగీస్ ప్రభుత్వం పంపుతోంది

లిస్బన్, జులై 26

గోవాకు యుద్ధనౌక నొకదానిని, పోర్చుగీసు ప్రభుత్వం పంపుతున్నదని, గోవాలో సత్యాగ్రహోద్యమం సాగుతున్నదని, పోర్చుగీసు వలసల మంత్రి నిన్నరాత్రి ప్రకటించాడు.

సత్యాగ్రహాన్ని అణచడానికి, నీగ్రో సేనను గోవా అధికారులు ఉపయోగిస్తున్నారనడం, అతిశయోక్తి అని ఆయన అన్నాడు. 120 మంది నీగ్రోసేనలు కేవలం ఊరికే గోవాలో విడిసి ఉన్నాయట.

పోర్చుగీసు సేనలను, ఇప్పుడే గోవాకు పంపడంలేదని కూడ ఆ మంత్రి చెప్పాడు.

ప్రజాస్వామ్య పద్ధతికాదు

నిజాం సంస్కరణలపై డాక్టర్ పట్టాభి ప్రకటన

మచిలీపట్నం, జులై 26

నిజాం ప్రభుత్వం ప్రకటించిన రాజ్యాంగ సంస్కరణలగూర్చి, డాక్టర్ పట్టాభి గారిలా ప్రకటించారు.

"సంస్కరణలు ప్రజాస్వామ్య పద్ధతిలో లేవు. అలా ఉన్నట్టు కనిపించడానిక్కూడా ఇందులో ప్రయత్నించలేదు. స్పష్టంగా ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధంగా ఈసంస్కరణలు తయారుచేశారు. 1946 సంవత్సరంలో రావలసినవి కావివి.

"ఈసంస్కరణల్లో సంయుక్త నియోజక వర్గాలున్నవి. కాని ప్రతి అభ్యర్థి, తన మతం వారి ఓట్లు ఎక్కువ సంపాదించుకుంటే చాలునన్నారు. కాబట్టి ప్రత్యేక నియోజక వర్గాలుగానే అవి మారిపొయ్యాయి.

అసెంబ్లీ స్థానాల పంపకం

"సంస్థానంలో హిందువులు నూటికి 88 మందికి పైగా ఉన్నారు. కాని వారికి అసెంబ్లీలో 60 స్థానాలు మాత్రం ఇచ్చారు. జనాభాలో కేవలం నూటికి 11 కు కొంచెం ఎక్కువగా ఉన్న ముస్లిములకు 69 స్థానాలిచ్చారు.

అసెంబ్లీకి అధికారాల్లేవు

"ఇక శాసన సభకు ఏవైనా అధికారాలున్నాయాఅంటే అవీ లేవు. కాబట్టి ఏవిధంగానూ ఈ సంస్కరణలు ఆకర్షవంతంగా లేవు. పరిపూర్ణంగా ఎన్నుకొనబడిన శాసన సభ, ఎన్నుకొనబడిన అధ్యక్షుడు ఉండాలి. తీర్మానాలు చెయ్యడానికి, బడ్జెటుపై ఓట్లు తీసుకోవడానికీ శాసనసభకు అధికారముండాలి. నిజాం ప్రభువుకు వీటో అధికారమూ, మైనారిటీల హక్కుల రక్షించే హక్కు ఉండనే ఉంటాయి.

"ఇప్పటి హైద్రాబాదు సంస్కరణలు 1894 లో తయారయ ఉండవలసినవి కాని. ఇప్పటికాలానికి పనికిరావు. ఈకన్సర్వేటివ్-అభివృద్ధి నిరోధక పద్ధతి నెవ్వరూ సహించలేరు."

సంస్థానాలలో కాంగ్రెస్ జోక్యం

ప్రత్యక్షంగా కల్పించు కోదట

అలహాబాదు, జులై 26

కాంగ్రెసు, ప్రత్యక్షంగా సంస్థానాలలో జోక్యం కల్పించుకోదు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేస్కర్ ప్రకటించాడు.

ఈవిషయంలో వాదోప వాదాలు సాగుతున్నాయని త్వరలోనే కాంగ్రెసు వర్కింగు కమిటీ చర్చించి, ఏదో ఒక నిర్ణయం చేస్తుందనికూడ ఆయన తెలియదరచాడు.

సిలోన్ భారతీయులను పొమ్మనడం సరికాదు

కొలంబో, జులై 26

సిలో భారతీయ సమస్య విషయంతెలుసుకొనడానికివచ్చిన కాంగ్రెస్ ఉపసంఘ సభ్యులు జి. రామచంద్రన్ వై. యం. సి. ఎ. హాలులో ఇలా ఉపన్యసించాడు.

"నేవిస్మిర్పేస్టేటులోని భారత కార్మికులను సిలోన్‌ప్రభుత్వం వెళ్ళిపొమ్మనడం సరికాదు. అక్కడి భారత కార్మికులందరూ సిలోనే తమదేశంగా భావించు కొంటున్నారు. వారిని పంపివేయకండని సిలోన్ నాయకులకు చెప్పాము". మేము కేవలం పరిస్థితులు తెలుసుకొనేందుకు వచ్చామని. తర్వాత రాజాజీ నెహ్రూలు రానున్నారని రామచంద్రన్ చెప్పాడు.

సభకు అధ్యక్షతవహించిన లక్ష్మసాడిమేల్ అనేఅయన పరస్పర ద్వేషాలుపోయి, అన్యోన్యమైత్రి పెంపొందించే కాలంకోసం ఎదురు చూస్తున్నామని చెప్పాడు.

అనధికార మాధ్యస్థ్యానికి ప్రభుత్వం ఒప్పుకోలేదు

బొంబాయి, జూలై 26

సమ్మెదారుల కోర్కెలపై స్వతంత్రమైన అనధికారి తీర్పుకి ఉభయ పక్షాలూ కట్టుబడాలని, దానికి ప్రభుత్వం అంగీకరిస్తే, సమ్మె వెంటనే నిలుపు చేయబడుతుందనీ సమ్మె కమిటీ పోస్టలు డైరెక్టరు జనరల్‌కు తెలిపేరు. ఆ మధ్యవర్తిగా బొంబాయి లెజిస్లేటివు కౌన్సిలు అధ్యక్షులు శ్రీ మంగళదాస్ పాక్వాసాగారు అయితే తమకి అభ్యంతరం లేదని కమిటీ తెలిపింది. సమ్మె విరిచే ముందు, ప్రభుత్వం ఈ దిగువ షరతులకి ఒప్పుకోవాలి.

1. సమ్మెచేస్తూన్న ఎవ్వరినీ వుద్యోగాల నుంచి తొలగించకూడదు.

2. సమ్మె కారణంగా, ఇవ్వబడిన సస్పెన్షన్, డిస్మిసల్ ఆర్డర్లు రద్దుచెయ్యబడాలి. ఖర్ఖాస్తుచేయమని యిచ్చిన నోటీసులు ఉపసంహరించబడాలి.

3. సమ్మెలో అరెస్టయిన వారందరూ విడుదల చేయబడాలి. అన్ని కేసులూ తీసేసుకోవాలి.

4. సమ్మె కాలంలో సమ్మెదారులకి జీతాలూ, అలవెన్సులూ కోతకొయ్యకూడదు.

కాని, ప్రభుత్వం అనధికార మాధ్యస్థానికి ఒప్పుకోలేదు. అందుకు ఫలితంగా సంభాషణలు చెడిపోయినాయి.

ఫెడరేషన్ సమ్మె ప్రారంభిస్తుందేమో అనే భయంతో రాయబారాలకు దిగిన ప్రభుత్వము, ఫెడరేషన్ రాజీ ధోరణికి బిర్రబిగిసింది. సమ్మెకేదీ పొడిగించబడడంతోనే భయంలేదని పనివారి న్యాయమైన కోరికను

సంపదింపులు చెడిపోడానికి కారణం ప్రభుత్వమే

పోస్టల్ సమ్మె పరిస్థితి

త్రోసిపుచ్చి, మధ్యవర్తిత్వానికి కట్టుబడడానికి నిరాకరించేరు.

ప్రభుత్వం తన మామూలు మొండి ధోరణిలో పనివారి కోర్కెలన్నీ నిరసిస్తూ ప్రవర్తించింది.

ఫెడరేషన్ మీద అవిశ్వాసం

న్యూఢిల్లీ, జూలై 26

పోస్టు అండ్ టెలిగ్రాఫ్ వుద్యోగులు ఫెడరేషన్‌కి అనుబంధంగావున్న టెలిగ్రాపు యూనియను (ఢిల్లీశాఖ) కార్యదర్శి నిజాముల్ హక్ అధ్యక్షతను సమావేశమై ఫెడరేషన్ కాలయాపన చేస్తూందని నిరసిస్తూ, ఫెడరేషన్ నాయకులయెడ విశ్వాసరాహిత్య తీర్మానంచేశారు. "ఏవిధమయిన సహాయం చేయమని అచ్చితంగా ప్రభుత్వం చెప్పినా, తన ఏర్పాట్లని మానుకున్నందుకు" ఫెడరేషను వారిలో తీవ్రంగా ఖండించారు.

ట్రంక్ టెలిఫోను పనివారి సమ్మె

బొంబాయి, జూలై 27

ట్రంక్ టెలిఫోన్ ఎక్స్ఛేంజి ఆఫీసులోని పనివారంతా రాత్రినుండి సమ్మెలోచేరేరు. టెలిఫోను నిస్సం స్తంభించిపోయింది.

బెంగుళూరు సమ్మెలో చేరలేదు

బెంగుళూరు, జూలై 26

ఫెడరేషన్‌వారి నిర్ణయాన్ననుసరించి బెంగుళూరు పోస్టు, తంతి శాఖలయూనియన్లు సమ్మె చేయకుండా నిలిచిపోయినాయి.

పోస్టాఫీసులవద్ద పికెటింగ్

కలకత్తా, జూలై 26

కలకత్తా టెలిఫోన్ ఎక్ఛేంజి, పోస్టుమాస్టరు జనరల్ ఆఫీసులవద్ద తీవ్రమైన పికెటింగ్ జరుగుతూంది. ఇండియను, ఆంగ్లో - ఇండియను యువతులు పట్టుదలతో పికెటింగ్ సాగిస్తూన్నారు.

ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక యూనియన్ కావాలి

గుంటూరు, జూలై 26

గుంటూరుజిల్లా పోస్టలు పనివారి యూనియను నిన్న సమావేశంలో సమ్మె సాగించడానికే నిశ్చయించింది. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకంగా పోస్టలు పనివారి యూనియను ఏర్పరచమని దాల్వీని కోరుతూ తీర్మానించబడింది.

ఉప్పుగుండూరు (గుంటూరుజిల్లా) గ్రామంలో సమ్మె వ్యాపించింది. పోస్టలు పనివారి కోరికలను తీర్చవలసిందని గ్రామ రైతు సంఘం, కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించాయి.

రాజమండ్రి

జూలై 25 న రాజమండ్రిలోని కార్మిక సంఘాలన్నీ పోస్టలు పనివారి సమ్మెయెడ సానుభూతి చూపుతూ ఒకరోజు సమ్మె చేసేయి.

అంబేద్కరుకు కజ్రోల్కర్ విజ్ఞప్తి

పూనా జూలై 26

విలేఖరుల సభలో, బొంబాయి శాసనసభలోని హరిజన సభ్యుడు యస్. యస్. కజ్రోల్కర్ మాట్లాడారు. సభకు హరిజన శాసన సభ్యులు, హరిజన మంత్రికూడ హాజరయ్యారు.

"మహాత్మాగాంధీ తర్వాత హరిజనులకు మహత్తరసేవ చేసినవారు అంబేద్కర్. ఆయన కాంగ్రెస్‌లో చేరితే మరింత సేవ చేయగలరు. ఆయన కాంగ్రెస్‌లో చేరితే నా శాసనసభ స్థానం ఆయనకు సంతోషపూర్వకంగా వదులుతాను."

"ముస్లిం లు నిమ్నజాతుల హక్కులు రక్షిస్తామని చెప్పారని అంబేద్కర్ ప్రకటించారు. మరి కేంద్ర ప్రభుత్వంలో రెండుస్థానాలు ఇవ్వాలంటే జిన్నా అక్షేపించడమెందుకు? అలాంటి ముస్లింలను పొగుడుతూ మనకు సేవచేసిన కాంగ్రెస్‌ను అంబేద్కర్ దూషించడం న్యాయం కాదు"

తర్వాత పూనా ఒడంబడిక చాల ప్రయోజనకారి అని, నిమ్నజాతులకు 'స్వతంత్ర ప్రజాశక్తి' అని ఆయన అన్నాడు.

యస్. యస్. యల్. సి. వాతాలు తగ్గించాలి

గుంటూరు, జూలై 23

కృష్ణాజిల్లా విద్యార్థిసంఘ కార్యవర్గ సభ్యుడు వి. ఎస్. ఎస్. ప్రసాద్‌గారిలా వ్రాస్తున్నారు:

ఆంధ్రరాష్ట్రములో అన్ని విద్యాలయములు తెరచి మాసము రోజు లయినవి. ఆంధ్ర విశ్వ విద్యాలయము వారు గత సంవత్సరము వలెనే, ఈ సంవత్సరము ఇప్పటివరకు యస్. యస్. యల్. సి. పుస్తకములను అన్ని కేంద్రములకు కావలసినన్ని పంపి యుండలేదు.

గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు పుస్తకముల రవాణాయే సరిగాలేక ఇప్పటివరకు పుస్తకములు విద్యార్థుల కందరికి చేరనేలేదు. పుస్తకములు ఈ సంవత్సరము చాలా కఠినముగా నున్నవని అధిక సంఖ్యాకులైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తలంచుచున్నారు

మరో 4, 5 మాసములలో "డిటెన్షన్"ను అమలు జరుపుదురు.

కాబట్టి ఈ సమస్యనుగూర్చి పాఠాలు తగ్గించవలసినదిగా ఆంధ్ర విశ్వ విద్యాలయము వారిని ప్రార్థించుచున్నాము.

మద్రాస్ బడ్జటు

నామమాత్రపు మిగులు

మద్రాస్ జూలై 26

జూలై 31 అసెంబ్లీలో ప్రవేశపెట్టబడే మద్రాసు ప్రభుత్వపు కొత్త సంవత్సరపు బడ్జటులో నామమాత్రపు మిగులు (15 వేల రూపాయలు)వుంటుందని అంచనా వేస్తూనారు

మద్రాసు రాజధాని మొత్తంమీద రివెన్యూ 4,848,82000 రూపాయలు మద్యపాన నిషేధం, హరిజనోద్ధరణ, గ్రామపునర్నిర్మాణం, కార్యక్రమాలు సాగించేటందుకూ, విదేశాలనుంచివచ్చే ఆహారధాన్యాలను చవకగా ప్రజల కిచ్చేటందుకై ధనసహాయాలుకొంతు రిజర్వ్వునుంచి 8,94,00,000 రూ॥ తీస్తారు.

మద్యపాన నిషేధం ప్రవేశ పెడితే 2½ కోట్ల రూపాయలు నష్టంవస్తుందని అంచనా; రాష్ట్రంలోని ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు మాష్టర్ల జీతాలు పెంచడానికి బడ్జెటులో ఏర్పాట్లున్నాయని తెలుస్తుంది

రాష్ట్రంలో ఖాదీ బోర్డు

ప్రకాశంగారు అధ్యక్షులు

మద్రాసు, జూలై 26

రాష్ట్రంలో ఖద్దరు వుత్పత్తిని ఎక్కువ చేసేటందుకై, 6 గురు అధికార్లు 9 గురు అనధికార్లతో కూడిన ఖాదీబోర్డు నిర్మించబడుతుందట. ప్రధానమంత్రి దానికధ్యక్షులు. గ్రామపరిశ్రమలమంత్రి, వ్యవసాయమంత్రి, పరిశ్రమలమంత్రి, పరిశ్రమల డైరెక్టరు, డెవలప్‌మెంటు శక్రటరీ, రాష్ట్రటెక్స్టయిల్ కమీషనరు అధికార సభ్యులు. కమిషనరు బోర్డుకి కార్యదర్శిగా వుంటారు. కేరళ, తమిళ దేశాల స్పిన్నర్సు అసోసియేషన్ కార్యకర్తలూ, ముఖ్యులయిన ఖాదీ ప్రచారకులూ అనధికార సభ్యులుగావుంటారట.

బహుభార్యాత్వం కూడదు

బొంబాయి అసెంబ్లీలో బిల్లు

పూనా, జూలై 26

హిందువులలో బహుభార్యాత్వాన్ని నిషేధిస్తూ బొంబాయి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టబడింది. "బిల్లు చిన్నదేగాని చాలా విప్లవాత్మకమైనది" అని శ్రీ మొహరార్జీ దేశాయి బిల్లు ప్రవేశపెడుతూ చెప్పారు.

త్వరలోనే విడాకుల చట్టంకూడా ప్రవేశపెట్టబడుతుందని అన్నారు.

"హిందూ న్యాయ శాస్త్రంలో ఈ బిల్లు గొప్ప మార్పు తెస్తుంది. ఎంతో కాలంగా ప్రజలు ఇటువంటి బిల్లుకోసం తహతహలాడిపోతున్నారు. సమాజం యొక్క వృద్ధి కోరేవారెవ్వరూ స్త్రీ - పురుషుల మధ్య హెచ్చు తగ్గులుండడానికి అంగీకరించరు. విడాకుల చట్టం లేకుండా, బహుభార్యాత్వాన్ని నిషేధిస్తూ చట్టంమాత్రం చేస్తే ఇబ్బందు లున్నాయి. కాని త్వరలోనే విడాకుల చట్టం కూడా ప్రవేశ పెడతాం.

"దీనిమీద ప్రజాభిప్రాయం తీసుకోవలసిన అగత్యం లేదు. ఎన్నో ఏళ్ళనుంచి ఈమాదిరి బిల్లుకోసం ఆందోళన జరుగుతూ వుంది. అలాగని తొందరపడి బిల్లు ప్యాసు చేయదోవడంలేదు. దీనిని ఒకసెలక్టు కమిటీకి పంపుతాం"

లీలావతి మున్షీ మొదలగువారు చర్చల్లో పాల్గొన్నారు.

అస్సాంకి బెంగాలీల వలస

కలకత్తా ఎసెంబ్లీలో చర్చ

కలకత్తా, జూలై 26

బెంగాల్‌నుంచి అస్సాం వలస పోయిన ప్రజల్ని గెంటివేయడంమీద ఒక ముస్లిం లీగ్ సభ్యుడు తీసుకువచ్చిన అనధికార తీర్మానం నేడు బెంగాల్ అసెంబ్లీలో చర్చకి వచ్చింది.

"నిరాధారులయి వలసపోయిన బెంగాలీలను తరముకుండా, ఆపేటట్లు చేయడానికి కొంపాగోడీ పోగొట్టుకున్నవారికి మళ్ళీ ఆదరువు చూపించేటట్లు చేయడానికి, అస్సాం ప్రభుత్వంమీద ఒత్తిడి తెమ్మని భారత ప్రభుత్వానికి బెంగాల్ గవర్నరు ద్వారా తెలియపరచాలి" అని తీర్మానంలో వుంది.

తౌఫాజల్‌అలీ అనే ఆయన ఈగెంటివేయడానికి దక్షిణాఫ్రికాలోని పెగ్గింగ్ బిల్లుకి తేడాయేమీ లేదన్నారు. "బెంగాలులో జనాభా హెచ్చు. చ॥ మైలుకి 779 గురు వున్నారు. అస్సాంలో చ॥ మై॥కి వున్నది 190 మందే. అందుచేత బెంగాల్ ప్రజ అక్కడికి వెళ్ళాలనుకోవడం సహజం" అంటూ చెప్పారు.

జ్యోతిబాసు వ్యతిరేకత

వలసపోయిన ప్రజలు కష్టాలపడుతూన్న మాట వాస్తవమే. అయినా ఈ విషయంలో వైస్రాయిని జోక్యం పుచ్చుకోమనడానికి అంగీకరించను" అన్నారు కమ్యూనిస్టు ఎమ్. ఎల్. ఏ. జ్యోతిబాసు "ఒక కమిటీ ఏర్పరచండి దానిద్వారా అస్సాం ప్రభుత్వంతో సంప్రదింపులు నడపండి.

జమీందారీ విధానం రద్దవాలి

నిస్సహాయులయిన ఈ బెంగాలీ ప్రజలకి వసతి చూపలేనందుకు బెంగాల్ ప్రభుత్వము సిగ్గుపడాలి. తాము చేయవలసినది చేయక ఇతరుల భూమి ఆక్రమించాలని చెప్పటం మరీ సిగ్గుచేటు. బెంగాలులో వున్న జమీందారీ విధానమూ, పెర్మనెంటు సెటిల్మెంటూ ఇవి రద్దుకావాలి. ఇవే నేటి దుస్థితికి కారణాలు.

అస్సాం ప్రజల భయం

"ఇక్కడి సమస్య ఒక్క భూమిసమస్యే కాదు. పాకిస్థాన్ సమస్య కూడా ఉంది. అస్సాంలో హిందువులు అధిక సంఖ్యాకులు. వలసవస్తూన్న మహమ్మదీయులు అస్సాంని పాకిస్థాన్‌లో చేర్చమంటారని వారి భయం. ఈ దశలో లీగ్, — కాంగ్రెసుల ఐక్యత, హిందూ — ముస్లిముల మైత్రి మాత్రమే రెండు రాష్ట్రాల మధ్య సద్భావాన్ని కలిగించగలవు. అని జ్యోతిబాసు చెప్పారు.

ఆ నాటి సభ ముగిసింది.

ఈ నాడు ఆంధ్రోత్సవాలు జరుపుదాం

> **నేడు**
> • ఊరూరా ఊరేగింపులు జరపాలి!
> • బహిరంగ సభలు జరవాలి!
> • ఆంధరాష్ట్ర వాంఛను ప్రకటిద్దాం!

"తెలుగుతేజము దీప్తివెందగ, తెలుగువెలుగులు దిశల నిండగ తెలుగుతల్లిని కొలువదీతనో, తరలిరావోయ్ తమ్ముడా!"—

ఈదినం 28 న ఆంధ్ర రాష్ట్రోత్సవం జరుపవలసినదిగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులు ఆంధ్రులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగపరిషత్తు ఏర్పడబోతున్న సందర్భంలో ఆంధ్రులంతా తమ స్వీయరాష్ట్ర వాంఛను ఏకకంఠంతో తెలుపవలసినుంది.

భాషాప్రయుక్తంగా రాష్ట్రాలువిభజనకావలెనని ఆందోళన బయలుదేరదీసిన వారాంధ్రులు. బెంగాలు విభజన ప్రతీకారంలో బయలుదేరిన ఉద్యమంగులో ఆంధ్రులు స్వీయరాష్ట్ర వాంఛతో ముందుకువచ్చారు. ఆంధ్రులు తమ రాష్ట్రం కావలెనన్నారు. 1906 లో బయలుదేరిన ఆంధ్రరాష్ట్ర వాంఛ 1910 లో "దేశాభిమాని"లో ఒక వ్యాసరూపంగా శ్రీ కే. శే. ఒల్లా శేషగిరిరావుగారు ప్రకటించారు. 1913 లో ప్రథమాంధ్ర మహాసభ బాపట్లలో జరిగింది.

ఆంధ్రుల ఆందోళన ఫలితంగా లోకమాన్య బాలగంగాధరతిలక్ ప్రోత్సాహంతో 1917 కలకత్తా కాంగ్రెస్‌లో ఆంధ్రులు ప్రాంతీయ కాంగ్రెస్ సంఘాన్ని సంపాదించుకో గలిగారు. 1918 లో సి. వి. యస్. శర్మగారు సామ్రాజ్య శాసనసభలో ఆంధ్ర రాష్ట్ర వాంఛను తెలియజేశారు. ఇండియాకు వచ్చిన మాంటాగ్యుకు తమ రాష్ట్ర వాంఛను ఆంధ్రులు తెలిపారు.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ నిర్మాణం

1919 లో రాజ్యాంగచట్టం నిర్మాణం అయింది. అందులో రాష్ట్ర విభజనకు 52 (ఎ) సెక్షను ప్రకారం అవకాశం కల్పించారు. 1920 లో భారతదేశాన్ని గాంధీజీ నాయకత్వాన ఉజ్వలితంచేసిన సహాయనిరాకరణ ఉద్యమంలో ఆంధ్రలోకం ముందుండి పోరాడింది. ఈ చైతన్యం, పోరాటంఫలితంగా 1921 లో అహమ్మదాబాదు కాంగ్రెస్‌లో ఆంధ్రులు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాన్ని నిర్మించుకోగలిగారు.

1922 లో మరల ఇంపీరియల్ కౌన్సిలులో రాష్ట్రవాంఛను బలపరుస్తూ తీర్మానించారు 1919 శాసనంప్రకారం ఏర్పడిన ద్వంద్వ పరిపాలనలో పానగల్‌రాజా మద్రాసు ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయినారు. 1924 లో స్వరాజ్యపార్టీపేర జస్టిస్‌పార్టీతో పార్టీ సిద్ధాంతాలపై ప్రధమతః రాజకీయ పార్టీల ఎన్నికలు ప్రారంభింపబడెను.

1925 లో రాష్ట్రాలకు యూనిటరీ ప్రభుత్వంలో అధికారాలు ఎక్కువ కావలెనని సెంట్రల్ సెషను నివేదికతయారయింది. రాష్ట్రాలకు అధికారాలు ఎక్కువ ఉండాలనే సిద్ధాంతం అంగీకరింపబడింది.

శాసనసభలో తీర్మానాలు

1926 ఏప్రిల్ 26 న ఆంధ్రుల వాంఛలలో ఒకటగు ఆంధ్ర విశ్వ విద్యాలయం బెజవాడలో యేర్పడింది. 1927 లో వేమవరపు రామదాసుగారు స్టేటు కౌన్సిలులోనూ, వరహాగిరి జోగయ్యగారు కేంద్ర శాసనసభలోనూ ఆంధ్రరాష్ట్రతీర్మానం ఉపపాదించారు. మద్రాసు శాసనసభలో శ్రీ పిల్లమర్రి ఆంజనేయులు గారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణ తీర్మానం తెచ్చారు. గెలిచింది. శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఆంధ్రంలో ప్రభుత్వ పరిపాలన జరిగిననే అది నిజమగు ఆంధ్ర రాష్ట్రం అవుతుందని చెప్పుతూ జిల్లాలలో పరిపాలన ఆయా భాషలలో జరగవలెనని తీర్మానం తెచ్చిరి. కాని నెగ్గలేదు.

దాంతో దేశానికి శిక్షపడగిన రాజకీయ సంస్కరణలను నివేదిక సమర్పించుటకు సైమన్ కమీషను భారతదేశం వచ్చింది. దేశం బహిష్కరించింది. ఆంధ్రులూ బహిష్కరించిరి. 1928 లో మద్రాస్ శాసనసభలో మరల ఆంధ్రరాష్ట్ర తీర్మానం నెగ్గింది 1928 లో అఖిలపక్ష మహాసభ యేర్పడింది. నెహ్రూ కమిటీని వేసింది. నెహ్రూ కమిటీ నివేదికలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అవసరం అని చెప్పింది. 1929 జనవరిలో జరిగిన అన్నిపార్టీల కన్వెన్షనులో రాష్ట్రాలకు భాషాధారాల ఉండాలని జిన్నా వాదించారు. ఆ సభ ఆంధ్రరాష్ట్ర వాంఛను అంగీకరించింది.

స్వాతంత్ర పోరాటంలో ఆంధ్రుల పాత్ర

• 1930 జనవరి 1 న కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్రం తన ఆశయమని లాహోరులో ప్రకటించింది. ఆ స్వాతంత్రంకై పోరాటం సాగించింది. ఆంధ్రులూ ముందడుగు వేసి ప్రస్థానం స్థాపించి వేలకొలది పాల్గొన్నారు. 1930 లో సైమన్ కమీషను తమ నివేదికను ప్రకటించింది. అందులో ఆంధ్రరాష్ట్ర ఆందోళన తీవ్ర రాజకీయ సమస్యగా నున్నదని చెప్పింది. తమను ఆహ్వానించలేదని రాష్ట్ర విభజన త్రోసివేసింది. 1930 ఆగష్టులో మద్రాసు ప్రభుత్వం పార్లమెంటుకు రాజకీయ సంస్కరణలపై తమ అభిప్రాయం చెప్పుతూ ఆంధ్రరాష్ట్ర విభజనను వ్యతిరేకించింది.

> **వావిలాల గోపాలకృష్ణయ్య**
> (ఆంధ్రమహాసభ స్థాయిసంఘ సభ్యుడు)

1930 లో లండన్ ప్రథమరౌండు టేబిల్ సభజరిగింది. ఒరిస్సా సింధురాష్ట్రాల విభజన చర్చించారు. అందుకై ఉపసంఘాలను నియమించారు. ఒరిస్సా సరిహద్దు సంఘాన్ని కూడా వేశారు. 1933 లో గాంధి - ఇర్విన్ ఒడంబడిక జరిగింది. కాంగ్రెస్ రౌండు టేబిల్ సభకు వెళ్ళుట అంగీకరించింది, గాంధీజీని ప్రతినిధిగా పంపింది. లండన్ వెళ్ళుచున్న గాంధీజీకి ఆంధ్ర నాయకులు తమ ఆంధ్రరాష్ట్ర వాంఛను తెలిపి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి తోడ్పడమని కోరిరి. రెండవ రౌండు టేబిలుసభ సభ్యులుగాఉన్న వి. వి. గిరి, బొబ్బిలిరాజాలు ఆంధ్రరాష్ట్రం కావలెనని విజ్ఞాపనలు యిచ్చిరి.

ప్రభుత్వ నిర్బంధ విధానం

1932 లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రారంభించడంతో మరల ప్రభుత్వంతో పోరాటం సాగింది. ఆంధ్రులూపాల్గొన్నారు. ఆంధ్ర భూభాగాలు ఒరిస్సాలో కలుపాలని నిశ్చయం జరిగింది. ఒరిస్సా సరిహద్దు కమిటీతో చెప్పుకుంటే, లాభంలేకపోయింది. మద్రాసు గవర్నరుకు, వైస్రాయికి, చివరకు ఇండియా కార్యదర్శి వద్దకు ఆంధ్ర వాంఛను వ్యక్తపరుస్తూ రాయబారం వెళ్ళారు. విఫలమయింది.

1933 లో బ్రిటీషుప్రభుత్వం తెల్లకాగితం ప్రకటించింది. అందులో ఆంధ్రరాష్ట్రం విషయం వదలివేయబడింది. ఆంధ్రుల వాంఛ త్రోసివేయబడింది. ఆంధ్ర భూభాగాలను ఒరిస్సాలో కలుపడం ఖాయం చేసింది. ఆంధ్రరాష్ట్రం లేకపోగా, ఆంధ్ర భూభాగాలు పరాక్రాంతం అయిపోయినవి.

బొబ్బిలిరాజా వ్యతిరేకత

బొబ్బిలిరాజా 1933 లో మద్రాసు ప్రభుత్వ ముఖ్యమంత్రి అయినారు. అంతటితో ఆంధ్రరాష్ట్రంవాంఛనీయం కాదన్నారు. దానితో ఆంధ్ర ప్రజానీకంలో మరల ఆందోళన రేగింది ఆంధ్రరాష్ట్రం వాంఛనీయం అని మద్రాసు శాసనసభలో తీర్మానం ప్యాసయింది. ఇంగ్లాండులో మరొక రౌండు టేబిల్ సభజరిగింది. అందులోనూ ఆంధ్రుల వాంఛ మన్నింపబడలేదు. అటుతర్వాత జాయింటు పార్లమెంటరీకమిటీ యేర్పడింది. భారత రాజకీయాలు తెల్లకాకితంపై నినాదాలు సాగినవి. రాజకీయ పోరాటం వెనక్కు పడింది. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ ప్రాదుర్భవించింది. భారత కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం నిషేధించింది. ఆంధ్రలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ యేర్పడి యువకులతో నడుపసాగింది. వీనిలో కలిసి కమ్యూనిస్టులు పనిచేయసాగారు. రైతుసంఘాలు, కూలీ సంఘాలు, యువజన విద్యార్థిసంఘాల ద్వారా వామపక్ష ప్రచారంసాగింది. కాంగ్రెస్ సత్యాగ్రహం ఆపివేసింది. తెల్లకాకితం తిరస్కరించింది. ప్రజాభిప్రాయం చెప్పడానికి కేంద్రశాసనసభల ఎన్నికలలో పాల్గొని ఎక్కువస్థానాలు గెల్చింది.

1935 ఇండియా చట్టం

1935 లో ఇంగ్లాండు ప్రభుత్వం జాయింటు పార్లమెంటుకమిటీ నివేదికను ప్రకటించింది. ఇందులో ఆంధ్రరాష్ట్రం తలంపేలేదు ఈ రిపోర్టు ఫలితంగా 1935 సం॥ ఇండియా యాక్టును పార్లమెంటు అంగీకరించింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం త్రోసివేశారు. నూతనరాష్ట్ర విభజనకు అవకాశం కల్పిస్తూ 290 సెక్షనులో అవకాశం యిచ్చారు. వైస్రాయి అడుగుజాడల్లో సంస్థానాలకు, రాష్ట్రాలకు ఫెడరేషన్ను గవర్నరు ఆధిపత్యంక్రింద రాష్ట్రస్వాతంత్రం యేర్పరిచారు.

1935 ఆక్టు 1936 ఏప్రిల్‌నుండి అమలు జరుగుటకు రాష్ట్రశాసనసభలకు ఎన్నికలు 1936 లో జరిగినవి. కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొంది. ఎక్కువ స్థానాలు గెలిచింది. సింధు, ఒరిస్సారాష్ట్రాలు 1936 ఏప్రిల్‌ను డి అమలుకు వచ్చినవి. 8 రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు వచ్చినవి. ఆంధ్రులు కోరేరాష్ట్రం స్వభూసమృద్ధం అని ఋజువు చేస్తూ ప్రథమంగా ఆంధ్రరాష్ట్రం పుస్తకం వెలువడింది.

శ్రీబాగ్ ఒడంబడిక

ఆంధ్రరాష్ట్రం విషయమై ఆంధ్రులలో ఆందోళన అధికం అయింది. ఆంధ్రోద్యమ రజతోత్సవం మహావైభవంగా విజయవాడలో జరిగింది. ఆంధ్రులలో ఉత్సాహం కలిగింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు కేంద్రనిర్ణయ కారణంగా వచ్చిన రాయలసీమ సర్కారుల అభిప్రాయభేదాలు పోగొట్టుకొనుటకు సమాలోచనలు జరిగినవి. ఫలితంగా శ్రీబాగ్ ఒడంబడిక జరిగింది. ఆంధ్రరాష్ట్ర అభ్యాయంలో రాయలసీమ ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత యిచ్చి నీటివసరులు పరిశ్రమలు అభివృద్ధి పరచవలెనని విశ్వకళాపరిషత్తులో రాయలసీమ కొక కేంద్రం యివ్వవలెననీ, జిల్లాలవారీ సమాన ప్రాతినిధ్యం శాసనసభలలో యివ్వవలెననీ, రాష్ట్ర కేంద్రం, హైకోర్టులలో రాయలసీమవారు కోరింది వారికివ్వవలెననీ, అంగీకరింపబడింది. దీనిని ఆంధ్రమహాసభ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘాలు ఆమోదించినవి. దీన్ని బలపరుస్తూ, 1938 లో ఆంధ్ర సౌహార్ద్రసంఘం సర్కారులలో ప్రచారం చేసింది. ఆంధ్రయువకులలోను, విద్యార్థులలోను నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఆంధ్రోత్సవాలు వివిధ ప్రాంతాలలోజరిపారు.

కాంగ్రెసు హైకమాండు తాటస్థ్యం

కలకత్తాలో అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశంలో భాషాప్రయుక్తంగా అన్ని రాష్ట్రాల విభజించవలెనని కాంగ్రెసు మంత్రులకు ఆదేశం ఇవ్వబడింది. కాంగ్రెస్ పార్టీలో 80 మంది సభ్యులు రాష్ట్ర విభజనను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టిరి. దీని ఫలితంగా మద్రాసు శాసనసభలు రెంటిలోను భాషాప్రయుక్త రాష్ట్రవిభజన జరుగవలెనని తీర్మానింపబడెను. దాన్ని అమలు జరుపుటలో ప్రభుత్వం మూకీభవించినట్లు ప్రసిద్ధిత మయ్యెను. హైకమాండు ఆంధ్రరాష్ట్ర విషయంలో తాటస్థ్యం వహించిందని ఆంధ్రులకు అనుమానం జనించెను, అందుపై 1938 అగస్టులో ఆంధ్రమహాసభ తరపున ఒక రాయబారవర్గం కాంగ్రెసు కార్యవర్గంవద్దకు వార్ధాకు రాయబారం వెళ్ళింది. స్వరాజ్యంతోనే రాష్ట్రం వస్తుందని, అందుకే కాంగ్రెస్ నిరంతరం కృషిచేస్తుందని చెప్పారు. ఈ విషయంలో ఆంధ్రమంత్రులు, తాము మంత్రివర్గంలో ఉన్నన్నాళ్ళూ తీవ్రముగు పట్టుపట్టలేక పోయిరి.

రాయలసీమ మహాసభ

విశ్వవిద్యాలయ కేంద్ర విషయంలోను, ఉద్యోగాల విషయంలోను, ఆనకట్ట విషయంలోనూ ముఖ్యంగా ఆర్థికంగా, విద్యావిషయకంగా రాయలసీమ వెనుకబడియుండుట వలన రాయలసీమ ఆర్థికాభివృద్ధి జరగనిదే ప్రయోజనంలేదని రాయలసీమలో తలంపసాగిరి. దీనిని కొందరు తమ ప్రయోజనాలకుపయోగించుకొని దలంచి వైరుధ్యాన్ని తీవ్రపరచసాగిరి. దీనిఫలితంగా రాయలసీమ మహాసభ యేర్పడింది. రాయలసీమ ఆర్థిక అభ్యున్నతి లభించిన తర్వాతనే ఆంధ్ర రాష్ట్ర సంప్రాప్తి యనే వాదాన్ని లేవదీశారు.

1939 ప్రాంతంలో ఇండియా కార్యదర్శి కౌన్సిలు సభ్యుడు కొక్కుగంటి రాఘవేంద్రరావుగారు ఆంధ్రరాష్ట్ర అర్హతను నిరూపించుచు ఒక నివేదిక తయారుచేశారు; దానిని రహస్యంగానే ఉంచారు. ఫెడరేషను అంగీకరించజాలమని, వయోజనులచే ఎన్నుకోబడిన రాజ్యాంగ పరిషత్తు ద్వారా భారత రాజ్యాంగం నిర్వచింపబడవలెనని కాంగ్రెస్ రాష్ట్ర శాసనసభలల్లో తీర్మానించింది. స్వరాజ్యం వస్తే, అందులో రాష్ట్ర పునర్విభజన జరపవచ్చునని సలహా యిచ్చింది. ఇంతలో యుద్ధం వచ్చింది. ఎందుకై యుద్ధం సాగిస్తున్నాం అంటున్నారో ఆ స్వయంనిర్ణయ

సూత్రాన్ని ఇండియాకు అన్వయించవలెనని దిగాకోరి బ్రిటిషు ప్రభుత్వం దాని నంగీకరించనందున కాంగ్రెసు మంత్రులచే రాజీనామా లిప్పించింది.

1941 లో ఆంధ్రమహాసభ తీర్మానం

ఆంధ్ర రాష్ట్రంలో సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేకోద్యమం తీవ్రంగా సాగింది. అనేక మంది దేశభక్తులు జైలుకు పోయినారు. కాంగ్రెస్ వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభించింది. 1941లో విశాఖపట్టణంలో ఆంధ్రమహాసభ జరిగింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో ప్రధాని రాజాజీ అపచారం చేశారని శ్రీ ప్రకాశంగారు ప్రకటించారు. ఏర్పడే కొత్త మంత్రివర్గంలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడకపోతే ఆంధ్ర శాసనసభ్యులంతా రాజీనామా లివ్వాలెనని తీర్మానించిరి. ఈ మహాసభ స్వయం నిర్ణయం, స్వయం పోషకం, స్వయం జీవనం తన ఆశయంగా నిబంధనలలో చేర్చింది.

కమ్యూనిస్టుపార్టీ దృక్పధం

ఇండియాకు 1942లో చైనా నుండి చెంగ్‌కేషేకు వచ్చి వెళ్ళాడు. ఇండియా స్వతంత్ర సమస్య ముందుకు వచ్చింది. ఏప్రిల్‌లో క్రిప్సు దిగాడు. ఢిల్లీలో సమాలోచనలు జరిగినవి. సర్ విజయా క్రిప్సుకు ఆంధ్రుల రాష్ట్ర వాంఛను నివేదించాడు. అది ఒక గడ్డు సమస్య కాదన్నాడు క్రిప్సు. చివరకు రాష్ట్రాలకు విడిపోయేహక్కు (కొన్ని షరతులతో) బ్రిటను సర్వాధికారాలతో ఇండియా యూనియన్ ఉండాలని సూచన చేశాడు. భారతరాజకీయపార్టీలు దాని అంగీకార యోగ్యం కానందున త్రోసివేశాయి. లీగు పాకిస్తాన్, కాంగ్రెస్ ఏకభారతం కావలెనని కోరింది ఈ అదనులో భారతదేశంలో భాషా సంస్కృతులతో యేర్పడ్డ వివిధ జాతులకు విడిపోయే హక్కుతో స్వయంనిర్ణయ హక్కు ఉండాలెనని కమ్యూనిస్టుపార్టీ సూచించింది. భాషా, సంస్కృతిగల ఆంధ్రజాతికి స్వయంనిర్ణయాధికారం కలిగి మనవలెనని కోరింది.

1942 ఆగస్టు 8 న విశిష్టాధికారాలతో స్వాతంత్ర ముండాలెనని, ఇండియా పెడరేషనుగా ఉండాలనని, విడిపోదలచితే విర్బధించవమని కాంగ్రెసు ప్రకటించి బ్రిటిషు ప్రభుత్వాన్ని వైదొలగమన్నది. ప్రభుత్వం జాతీయ నాయకుల్ని కట్టివేసి ప్రజలను రెచ్చగొట్టి దేశంలో సంక్షోభం కలిగించింది. నాయకులంతా జెయిళ్లలో మగ్గుతున్నారు.

రాయలసీమలో కరువు

దేశమంతటా కరువు విలయతాండవం ఆడచొచ్చింది. ఆంధ్రరాష్ట్రంలో అధికంగా వెనుకబడియున్న ప్రాంతాల్లో ముఖ్యంగా రాయలసీమలో నృత్యంసాగించింది. ప్రజాజీవితమే తారుమారయి పోయుండడం కంట్లా చూడడం తటస్థించింది. రాయలసీమ లకు కొల్లొల్యం ఆంధ్రసాంఘిక జీవితానికే ఎంత ప్రమాదమో ఆంధ్రప్రజానీకానికి అవగతం అయింది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, ఆంధ్రమహాసభ, వివిధసంఘాలు సుమారు రెండు లక్షలు కరువు నివారణకివిని వసూలు చేసినవి. ప్రభుత్వం కరువుపనులక్రింద 2½ కోట్లు వెచ్చించింది. శాశ్వత పరిష్కారం అవసరం అనిగ్రహింపవలసివచ్చింది. ప్రాజెక్టులనిర్మాణం అవసరంఅని తోచింది. తుంగభద్రాప్రాజెక్టు నిర్మాణంకన్నా కరువునివారణకు మార్గం లేదని యావదాంధ్రజాతి నిర్ణయించి ప్రభుత్వాన్ని కదలించగలిగింది. 1943,44లల్లో కరువునివారణ ప్రయత్నాలు సాగినవి. 1943 లో జిల్లారిలో జరిగిన ఆంధ్రమహాసభ రాయలసీమ ప్రాజెక్టులకు రాబున్న మంత్రివర్గం ప్రాధాన్యమివ్వాలని తీర్మానించెను.

1944 లో ఆంధ్ర జిల్లాలబడ్జటును వేరు పరచుటని, ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రిందికి

స్వరాష్ట్రం మన జన్మహక్కు

ఆంధ్రప్రాంతం ఉంటివేయ్యటని మద్రాస్ ప్రభుత్వాన్ని కోరిరి, ప్రభుత్వం ప్రత్యుత్తరం వీలులేదనెను.

1943 సంవత్సరంలో బెజవాడలో జరిగిన ముస్లింలీగు సమావేశంలో ఆంధ్రరాష్ట్ర ముస్లింలీగును యేర్పరచడంతో ఆంధ్రరాష్ట్ర అవసరాన్ని గుర్తించినది.

ఇంతలో విశాఖపట్నం జిల్లాలో కరువు దాపురించి 30 వేలమందిని బలిగొనెను. ఇదేఅదనులో కరువునివారణకు ప్రజలలో చైతన్యం ప్రజాసంఘ్యమాలువిరివిగావ్యాపించినవి. ఆంధ్రరాష్ట్రంలేనిలోటు ప్రతిసంవత్సరం లోను కన్పించసాగెను.

ఆంధ్రనాయకులు అప్పటప్పటు మొదట స్వరాజ్యం దానితర్వాతనే స్వరాష్ట్రమని ప్రసంగించసాగారు. రాయలసీమ మహాసభవారు రాష్ట్ర పునర్విభజన స్వరాజ్యం వచ్చువరకు సజీవసమస్య కాదని తీర్మానించిరి.

క్రిప్సుతో ఇండియాకు వచ్చిన కూప్‌లాండ్ బ్రిటిష్ ప్రభుత్వంవారి ఆదేశాను సారంభారతభవిష్యద్రాజ్యాంగసూచనలంటూ సామ్రాజ్య ప్లానును తయారు చేశాడు అందులో ఆంధ్రరాష్ట్ర సమస్యపైతీవ్రాందోళన జరుగుతున్నదని రాష్ట్రం అత్యవసరమని 1944 లో వ్రాశాడు.

ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ సర్వాధికారం గలిగి స్వయనిర్ణయంగా ఉండే ఆంధ్ర యూనిట్ కావాలెనని ప్రచారం చేసింది. ఆహార సమస్య కారణంగా నైజాం ఆంధ్రమహాసభ తెలంగాణలోని ప్రజానీకంలో చైతన్యం కలిగించి ఆంధ్రజాతీయ చైతన్యం ప్రబలించింది. బ్రిటిష్-నైజాం ఆంధ్రులు భాషా విషయంగాను, సాంస్కృతికంగానూ, ఒకటి అనే భావం పెంపొందింది. దీనిఫలితంగా సింగరేణి బొగ్గుగనులవద్ద 1944లో నైజాం. బ్రిటిష్‌ఆంధ్రులు ఆంధ్రగ్రంథాలయవేదికపై సమావేశమై ఆంధ్రుల సంస్కృతిని సమిష్టిగా సరిదిద్దుకొనసాగించారు.

ఆంధ్రశిల్పకళకు శిరోభూషణమైన నాగార్జునకొండ శిల్పశిలాలను పరప్రాంతాలకు తీసుకొనిపోవుటకు 1944 లో బ్రిటిష్ ప్రభుత్వం పన్నిన కుటిలవ్యూహాన్ని ఆంధ్రప్రజానీకం ఐక్యంగా ప్రతిఘటించి తమజాతి సంపదను నిల్పుకొంది

1945 లో నాయకుల విడుదల జరిగింది. సిమ్లాలో వేవెలు రాయబారం సాగించాడు. నాయకులలోని అనైక్యత మూలంగా సామ్రాజ్యవాదులే గెల్చారు. ఆ జాబితాల్లో ఆంధ్ర నాయకుని పేరు లేక పోవడంతో ఆంధ్రఆవేశం మింటి కెత్తింది ఆంధ్రులలో మరల ఆంధ్రరాష్ట్ర వాంఛ యినుమడించింది. వేవెలు ప్లాను విఫలం అవడంతో కేంద్రశాసనసభల ఎన్నికలు ప్రకటించాడు. ఇంతలో యుద్ధం ముగిసింది.

1945 లో హైదరాబాదు నైజాం, కాకినాడ బందరు రేవులను వాటికి మార్గాన్ని కలిపి బ్రిటను సహాయం కోరాడు. ఇది తెలిసికొని ఆంధ్రప్రజానీకం తీవ్రఆందోళన చేసి ఇండియాగవర్నమెంటు హామీనిపొంది బ్రిటిషు ప్రభుత్వం - నైజాం కలిసి పన్నిన కుట్రను భగ్నం చేసుకోగలిగారు.

రాష్ట్రశాసన సభలకు ఎన్నికలు జరుపుతాము. రాష్ట్రఅసెంబ్లీసభ్యులతో రాజ్యాంగ పరిషత్తు నిర్మిస్తామని వైస్రాయి, ఇండియా కార్యదర్శి బ్రిటిష్ ప్రధాని ప్రకటించారు. ఇండియా పరిస్థితులు వివేదించటానికి పార్లమెంటరీ రాయబారుల్ని ఇండియాకు పంపారు. ఆంధ్రమహాసభ ఆంధ్రుల రాష్ట్రవాంఛను తెలిపింది. ఆంధ్రరాష్ట్రం విషయంలో తెరచిన వాకిలి తట్టుతున్నారని అన్నారు. వారేమని వివేదించారో తెలియదు.

పశిడ భారత దేశానికి శ్రీ అంబాహీగారు విద్వేనిసభ్యులు మద్రాసు రాజధాని ఆంధ్రా కర్ణాటక, తమిళ, కేరళ రాష్ట్రములు కలిసిన ఫెడరేషనుగా ఉండాలని సూచించారు. నైజులోన్సిలులో 1946 ఫిబ్రవరిలో ఆంధ్రరాష్ట్ర తీర్మానం సందర్భంలో ప్రభుత్వం రాజ్యాంగపరిషత్తురాష్ట్ర విభజన నిర్ణయించాలె నన్నది. తీర్మానం నెగ్గింది. సబ్జక్ట్ కమిటీ ఆంధ్రుల రాష్ట్రవాంఛను బలపరిచింది.

1946 ఫిబ్రవరిలో గుంటూరులో ఆంధ్ర మహాసభ సమావేశమై నూతనమంత్రివర్గం ద్వారాను, రాజ్యాంగ పరిషత్తు ద్వారాను ఆంధ్రరాష్ట్రం నిర్మించనిచో రాష్ట్రం కొరకు సత్యాగ్రహం చేయతీర్మానించెను.

రాష్ట్రశాసనసభల ఎన్నికలలో కాంగ్రెస్ లీగు, కమ్యూనిస్టుపార్టీలు పాల్గొన్నవి. విశిష్టాధికారాలలో భాషాప్రయుక్త రాష్ట్రములుగల ఏక భారతదేశం తమ ఆశయమని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. పాకిస్తానే తమ ఆశయమని ముస్లింలీగు ప్రకటించింది. విశాలాంధ్రలో ప్రజాస్వామ్య పరిపాలన ధ్యేయంగల ప్రజారాజ్యం తమ ఆశయమని కమ్యూనిస్టులు ప్రకటించారు. ఎన్నికలలో కాంగ్రెసు, లీగులు అధిక సంఖ్యాకంగా గెలిచినవి.

బ్రిటిషు మంత్రుల రాయబారం

భారత రాజ్యాంగ నిర్ణయం వివిధపక్ష నాయకులతో సంప్రదించి నిర్వహిస్తామని మంత్రివర్గ రాయబారం ఇండియాకువచ్చింది. భారత రాజకీయ నాయకులలోని విచ్ఛిన్న దృక్పథాలను అవకాశంగా తీసుకొని, తమ సామ్రాజ్య సుస్థిరతకు ఉపకరించే ఒక ప్లానును మననెత్తిన రుద్దారు. ఆంధ్రరాష్ట్ర విషయం తెలియచేయటానికి అవకాశం యివ్వ నిరాకరించారు.

ఈ ప్లాను ప్రకారం ఇండియాలో-క్రింద రాష్ట్రాలు. మధ్య గ్రూపులు, గ్రూపుల ఫెడరేషనలు. పైన యూనియన్ ఉంటుంది. రాష్ట్రాలకు విశిష్టాధికారాలుండవు. రాష్ట్రాలు అంగీకరించిన శాఖలు ఫెడరేషన్‌లకుండవి, సంస్థానాధిపతులు సర్వాధికారాలుకలిగియుంటారు. యూనియన్‌కు విదేశ వ్యవహారాలు, దేశరక్షణ రవాణాలు వీటికి కావసిన ఆర్థికం ఉంటవన్నారు. వైస్రాయి వీటో, బ్రిటిష్ సైన్యాలు ఉండనే ఉన్నవి.

ఈ రాష్ట్రాలు, ఈ ఫెడరేషన్లకు, ఈ యూనియన్‌కు రాజ్యాంగ నిర్ణయం చేయుటకు మతాలననుసరించి ఏ విభజిల కొరకులవంతున ఎన్నుకోబడిన సభ్యులుగల రాజ్యాంగ పరిషత్తు నిర్మింప జరుగుతుందని దానిని రాష్ట్ర అసెంబ్లీ సభ్యులే ఎన్నుకోవలెనని సూచించారు. సంస్థానాధిపతుల తరపున నాల్గవవంతు సభ్యులు హాజరవుతారు. ఇందులో ఈ రాజ్యాంగ పరిషత్తు తయారు చేసిన రాజ్యాంగాన్ని బ్రిటిష్ పార్లమెంటు ఒప్పుకొని తీరుతుందనే హామీ యేమీలేదు. త్రోసిపారవేయవచ్చుకూడా: ఈ దారిద ప్లానును భారతదేశంపై రుద్దారు. దీనిని వామపక్షాలన్నీ ఒకేవిధంగా భగ్నంచేయాలంటున్నా కాంగ్రెస్, లీగులు అంగీకరించినవి. ఈ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు కూడా జరిగినవి.

రాజ్యాంగ నిర్మాణసభ ఎన్నికలు

మనం ఆంధ్రులం, మద్రాసు రాజధానిలో ఉన్నాం. మద్రాసు 'ఏ' గ్రూపులో ఉంది. ఈ గ్రూపునుండి రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరిగినవి. మద్రాసు రాష్ట్రంనుంచి 45 మంది సాధారణులు, 4 గురు ముస్లింలు ఎన్నుకోబడాలి. ఆంధ్ర ప్రాంతంనుండి 18 గురు ఎన్నుకొనబడవలెను. అందులో ఒక ముస్లిం. కాని 11 మంది జనరల్‌లోను, 1 ముస్లిం ఎన్నుకోబడినారు. ఆంధ్రరాష్ట్ర సమస్య ఈరాజ్యాంగ పరిషత్తులో పరిష్కరింపబడవలసియుండి. ఈదానిస ప్లానును భగ్నం చేయడం మనవిధి. అందులో జరిగే చర్చలలో కాంగ్రెస్ అంగీకరించిన భాషాప్రయుక్త రాష్ట్రవిభజనను ఏర్పాటు చేయవలసి యుంది.

స్వరాష్ట్రం మన జన్మహక్కు

ఆంధ్రరాష్ట్ర ఆందోళన ఎన్నోదినాలనుండి చేస్తున్నాం. భాషను, సంస్కృతిని, చరిత్రను బట్టి జాతులు నిర్ణయింపబడుతవి. ఆంధ్రజాతికి స్వరాష్ట్రం జన్మహక్కు. ఈనాడు కేరళ కాంగ్రెస్ సంఘం కేరళరాష్ట్ర విభజనను కోరుతూ తీర్మానించింది. తమిళరాష్ట్రం విభజింపబడవలెనని తమిళనాడు రాష్ట్ర కాంగ్రెసు సంఘం 1939 లో తీర్మానించింది. తమిళ మహాసభ 1943 లో తీర్మానించింది. కర్ణాటకులు ఎన్నోదినాలుగా ఐక్యకర్ణాటక రాష్ట్రంకై తీవ్రాందోళన చేస్తున్నారు. అంతేకాక మహారాష్ట్రంకూడా ప్రత్యేకించవలెనని మహారాష్ట్ర కాంగ్రెస్ సంఘం ఈ నెలలో తీర్మానించింది. "ఏ" గ్రూపులో భాష. సంస్కృతి. చరిత్ర గలిగిన ఆంధ్ర. కన్నడ, తమిళ మహారాష్ట్ర కేరళ జాతులు స్వయంవర్ధనంలేనందున స్వయం వ్యక్తిత్వం ప్రకటించు అవకాశం లభించనందున అణిగి తమ సంస్కృతిని, జాతీయతను తమ సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానిక జీవితాలను పెంపొందించుకొనలేక పోతున్నవి.

పరపాలనతో పోరుటకు జాతి జాగృతి వహించవలసియుంది. అందు భాషాప్రయుక్త రాష్ట్రాలు సాధనములు. ఆయా రాష్ట్రములలో భాష, విజ్ఞానం, విద్య, పరిశ్రమలు, ప్రజా ఉద్యమములు, నీటివసరులు, అభివృద్ధి పొందుటకు స్వీయరాష్ట్రం అవసరం. ఈనాటి అదనును ఉపయోగించుకొని ఇతరరాష్ట్రీయ జాతీయసోదరుల పరస్పర సహకార సంపత్తులతో ఆంధ్రులు తమచిరకాలవాంఛను తీర్చుకొనవలసియున్నది.

ఇందుకు దోహదంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులు ఈ నెల 28 వ తేదీ ఆదివారం ఆంధ్రరాష్ట్రోత్సవదినంగా ప్రకటించటం ముదావహం. రాజకీయభేదాలు కాని, వర్గభేదాలు కాని, ప్రాంతీయ భావతమ్యాలుగాని లేకుండా ఆంధ్రప్రజానీకం సర్వే సర్వత్ర ఈ దినమున ఆంధ్రోత్సవాలు జరపాలె. ముక్కోటి ఆంధ్రుల స్వరాష్ట్రం వాంఛను తెలియజేయాలి. ఆంధ్రరాష్ట్ర ప్రజానీకాన్ని ఏవిధంగా ప్రజాస్వామ్యానికి సమపుటుంపో ప్రజలకు తెలియజేయాలి. ఆంధ్ర భూభాగంలో రామపాదసాగరం, బలపల్లి, మాచ్‌ఖండ్, సంగమేశ్వరం, పెన్నాప్రాజెక్టులను ఆచరణలోకి తేవలెనుకు ఆంధ్రరాష్ట్రమే ఆధారం. దేశభాషలందు తెనుగులెస్సయని వినుతిగన్న తెనుగు మధురమును పన్నె చిన్నెలతో పెంపొందింప జేయవలె నవీన ఆంధ్రభాష మన ప్రభుత్వ భాష కావాలె. ఆంధ్ర ప్రజానీకం స్వయంసమృద్ధ జీవనం గడుపవలెనంటే ఆంధ్ర భూభాగములో నున్న ఖనిజ సంపత్తి నంతటిని వెలయించి వస్తుసంతతి నలరారచేసి తిండిలేని ఆంధ్రుడు, గుడ్డలేని ఆంధ్రుడు, ఇల్లులేని ఆంధ్రుడు లేకుండా విశాలాంధ్రలో ప్రజారాజ్యం నిర్మించాలి. అందుకే దీనిను ప్రాతిపదికగా తీసికొందాం. ఆంధ్రప్రభలగట్టి ఆంధ్రదేశము దశదిశలు చాటుదాం. ఆంధ్ర రాష్ట్ర దినోత్సవం మహోత్సవంగా జరుపుదాం ఆంధ్రవీరుల గాధలు చాటండి. ఆంధ్రగీతాలు ఆలాపించండి. 3 కోట్ల ఆంధ్రుల వాంఛను ప్రకటించుదాం.

"తెలుగువారం మాదు తీయనగ తెల్లావె
తెలుగుజండా గగన గగనాల నెగురావె"
"చేయెత్తి జైగొట్టు తెలుగోడా,
గతమెంతొ ఘనకీర్తి గలవాడా !"

మునిసిపల్ కార్మికుల రాష్ట్రవ్యాప్తసమ్మె : ఆగస్టు 9

కార్మికుల కనీస కోర్కెలు

ఆంధ్రదేశంలోని మునిసిపల్, పంచాయతీబోర్డు పనివారలం ఆగస్టు 9 వ తేదీ నుండి సమ్మె చేయడానికి నిశ్చయించుకొని ఆయా అధికారులకు నెలలో జులై వ్యవధి నిచ్చుచూ సమ్మెనోటీసు జారీచేశాం. మొత్తం 45 బ్రాంచి సంఘాలు సమ్మె నోటీసులు యిచ్చాయి.

యీ నోటీసులు జారీ చేసేటప్పుడుకూడా ప్రజలయెడల మా బాధ్యతను దృష్టియందుంచుకొనే సమ్మె లేకుండా పరిష్కారం చేయడానికని నెలరోజుల వ్యవధినిచ్చాం. మా కష్టాలను నెరవేర్చవలసినదిగా గత 5 సంవత్సరాల నుండి ఆందోళన చేస్తూవచ్చాం. కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడిన తరువాత మా రాష్ట్ర సంఘాధ్యక్షులు, స్థానిక సంస్థల శాఖ మంత్రిని కలుసుకొని మా కోర్కెలను పరిష్కారం చేయవలసినదిగా కోరారు. కాని, స్థానిక శాఖ మంత్రి మా కోర్కెలను నెరవేర్చ నిరాకరించారు. మంత్రిపుంగవులు కూడా మా యిక్కట్టులను యీ దేర్చ నిరాకరించిన విదప, వేరే గత్యంతరం లేకపోవడమువల్ల సమ్మెనోటీసు ఇవ్వాల్సివచ్చింది.

ప్రతినిత్యం మేము సేవచేస్తున్న ప్రజానీకానికే మా కష్టాలను విన్నవించుకొని మా కోర్కెలను బలపర్చవలసినదిగా కోరుతున్నాము.

జీతాలు

మా జీతాలు 9 రు. మొదలుకొని 12 రు. మించి వుండవు. పంచాయితీ బోర్డులలో ఇంకా తక్కువగా వున్నాయి. కాకినాడ లాంటి పెద్ద మునిసిపాలిటీలో నెలకు 4 రు. నుండి 6 రు. వరకు ఇచ్చి పనిచేయించుకుంటున్నారు. ఇంతకంటె హీనమైన జీతాలు ఏ పరిశ్రమ కార్మికునికిలేవు. యీ తక్కువ జీతాలు హెచ్చు చేయాలని కోరుతూ అనేక విజ్ఞప్తులు పంపుకున్నాం. కాని, మా మొర అరణ్యరోదనం అయిపోయింది. ఈ జీతాలు 20 సం॥ రాల క్రితం నిర్ణయింపబడ్డాయి. యిప్పటివరకు వీటిని హెచ్చించి మా కార్మికుల జీవన పరిమాణాన్ని పెంచకపోవడం కడు శోచనీయం. యుద్ధంవచ్చిన తరువాత ధరలు విపరీతంగా పెరిగాయని లోకమంత అంగీకరించింది. కాని మా జీవితాల విలువ మాత్రం పడిపోయింది.

జీవిత ప్రమాణం 1939 లో 100 వుంటే యీ రోజున 280 వరకు వున్నది. యికమా సంపాదన చూడండి. 1939 లో 12 రు. జీతం. ఈరోజున అదనంగా 16 రు. కరువు భత్యం యిచ్చారు. 1936 నాటి ధరల ప్రకారము మానవుడు తన కుటుంబంతో జీవించాలంటే కనీసం 40 రు. లు సంపాదన వుండాలి. ప్రభుత్వ నియమిత రిపోర్టుల ప్రకారమే కనీసం 45 లు. కరువుభత్యము పొంద గలిగితేనేగాని 1939 నాటి జీవిత ప్రమాణాన్ని నిలబెట్టుకొనుటకు చాలదు. కాని, యీ రోజున మేము 40 రు. జీతము 45 రు. కరువుభత్యం కోరుటలేదు. మేము కోరేది 30 రు. నుండి 45 రు. వరకు మాత్రమే.

(1) శానిటరీ యింజనీరింగు శాఖలలో పనివారు, స్వీపర్లు, డ్రయిన్ కూలీలు, బండ్ల డ్రయివర్లు, రోడ్ల కూలీలు, జవానులు, పార్కు, లైటింగువర్కర్లు, క్లీనర్లు మొదలగు వారందరకు 30-0-0 నుండి 1-0-0 చొప్పున ఇంక్రిమెంటుతో 45-0-0 వరకు—

(2) శానిటరీ మేస్త్రీలు టర్నిక్లర్కుల్సు — 35 రూ నుండి 1-8-0 చొప్పున ఇంక్రిమెంటుతో 50 రూ.

(3) వాటరు, ఎలక్ట్రికల్ ఫిట్టర్లు, లైన్‌మన్‌లకు లారీ డ్రయివర్లకు — 45-0-0 నుండి 2-0-0 — 60-0-0

(4) లోయర్ డివిజన్ గుమాస్తాలకు బిల్లుకలెక్టర్లకు — 60-0-0 నుండి 2-0-0 80 రూ॥ వరకు—

అప్పర్ డివిజన్ వారికి — 80 రూ॥ 3-0-0 120 రూ॥ వరకు

(5) నైట్ సాయిల్‌లారీలమీద, డ్రెంచింగ్ పెట్ట డ్రయిన్ల, స్కావెంజింగు పని చేయువారికి — 3-0-0 ఎక్స్ట్రా జీతం.

ఈ రకంగా జీతాలు ఏర్పాటుచేసి అమలు పర్చాలని కోరుతున్నాం.

కరువు భత్యం

(1) ప్రస్తుతం 16-0-0 కరువు భత్యం యిస్తున్నారు. యిదినిర్ణయించిన నాటికంటే వస్తువుల ధరలు నేడు అధికంగా పెరిగాయి. కాబట్టి కరువు భత్యం 21-0-0 వరకు హెచ్చించాలని కోరుతున్నాం.

(2) లోగడ కరువు భత్యం శానిటరీ డిపార్టుమెంటు వర్కర్సుకు మాత్రమే యిచ్చారు, మిగతా అన్ని డిపార్టుమెంట్లు వారికికూడా యివ్వాలని కోరుతున్నాం.

అదనంస్టాపు:— అన్ని పట్టణాలలోను తగినంతస్టాపులేదు, గత 5 సం॥ రాలలో పట్టణాలలో పెరిగిన జనాభాను బట్టి స్టాపు ఏ మాత్రం పెరగలేదు. స్టాఫ్ విషయంలో 1942 లో మద్రాసు గవర్నమెంటు ప్రకటించిన 1729 నెం. జి. ఓ. ప్రకారం 40 దొడ్ల విభజించి, కాలువలు, రోడ్లపనివారిని పెంచాలని కోరుతున్నాం.

గ్రాట్యుటీ :— దాదాపు పనివారి జీవితమంతా మునిసిపాలటీల లోనే గడిపినా గ్రాట్యుటీ అనేదిలేదు, యిందువల్ల చాలా మంది వర్కర్సు అనాధులయి అడుక్కొంటున్నారు, కాబట్టి సంవత్సరానికి 1 నెల గ్రాట్యుటీ పద్ధతిఏర్పర్చి 5 సంవత్సరాలు సర్వీసు వున్నవారందరకు అమలు జరిపించాలని కోరుతున్నాం.

యిండ్లవసతులు:— పనివారికి యిండ్లవసతులులేక అనారోగ్యమైన ప్రదేశాలలో నివసిస్తున్నారు. వెంటనే యిండ్లు కట్టించుటకు ప్లానులువేసి, అప్పటివరకు ప్రతినెల యింటి అద్దెక్రింద రు 3-0-0 యివ్వాలని కోరుతున్నాం.

సెలవులు:— (1) అన్ని పండగలకు పూర్తిరోజు సెలవు యివ్వాలి. ఆరకంగా యివ్వడానికి వీలులేనిచో ఆరోజు జీతం యివ్వాలి. (2) వారానికి 1 రోజు అన్ని డిపార్టుమెంటు వర్కర్సుకు పూర్తిరోజు సెలవు యివ్వాలి. (3) ప్రస్తుతం మినిస్టీరియల్ స్టాపుక్రింద పరిగణింటబడే వారందరికీ యిన్ ఫీరియల్ సర్వీసు క్రింద తీసుకొని 1940-41 జి. ఓ. ప్రకారం అన్ని సెలవలు అమలు పర్చాలని కోరుతున్నాం.

ప్రావిడెంటు ఫండుపద్ధతి యీలు ప్రకారం అమలుపర్చాలి. మందుల సౌకర్యం విద్యాసౌకర్యాలు కలిగించాలి. అన్ని డిపార్టుమెంట్లు వర్కర్సును పర్మనెంటు చేయాలి. యిప్పటివరకు డిస్‌మిస్, సస్పెండ్లలో వున్న వారందరిని వెంటనే పనిలోనికి తీసుకొవాలి. వారసత్వం, సీనియారిటీ పద్ధతులను అమలులో పెట్టాలి, మనుష్యులతో నైట్‌సాయిల్ ఇండ్లను లాగించడం మాన్పించాలి. రాష్ట్ర సంఘాన్ని ఎట్టి షరతులు లేకుండా గుర్తించాలి.

ప్రజలకు విజ్ఞప్తి

నేటివరకు శక్తివంచన లేకుండా ప్రజాసేవ చేస్తూ వచ్చాం. పట్టణ పారిశుద్ధతను కాపాడుటకు మా శాయశక్తులా కృషిచేశాం. పనివారల సంఖ్య తక్కువ వున్నప్పటికీ కూడా సరకుచేయకుండా మా ఆరోగ్యాలను కూడ ఒడ్డి ప్రజలను సేవించాం.

మా రాష్ట్ర సంఘం యేర్పడిన 1941 సం నుండి మా కోర్కెలను ప్రభుత్వాధికారులకు తెలియచేస్తూ వచ్చాం. మా ఆందోళన ఫలితంగా ప్రభుత్వం మున్సిపాలిటీలకు పనివారల జీతాలను యెక్కువ చేసేందుకు అనుమతి యిచ్చింది, అంతకు పూర్వము వీరికి 12-0-0 కంటె యెక్కువ జీతాలు ఇవ్వకూడదనే గవర్నమెంటువుత్తరువు వుండేది. ప్రభుత్వం అనుమతించినప్పటికీ యీ స్థానిక సంస్థలు మా జీవితావసర విషయాలలో జోక్యం కలుగ చేసుకోలేదు.

మా విన్నపాలన్నీ బుట్టదాఖలైనాయి. ఈ 5, 6 సంవత్సరాలలోను అనేక తడవలు యీ అధికారులు మమ్ములను సమ్మెకు రెచ్చగొట్టారు. కాని మేమే ఓపికలో పనులుచేశాం.

కాంగ్రెస్ మంత్రివర్గమైనా పాత పంధాను మార్చలేదు, ఇంత తక్కువ జీతాలతో యెలా జీవించుతారనే విషయాన్ని యోచన చేయుటలేదు. తాము అధికారంలోనికి వచ్చి యెక్కువకాలం కాలేదని సాకు చూపుతున్నారు. కాని, 1937 లో కాంగ్రెసు మంత్రివర్గాలు యేర్పడినాయి. 2½ సంవత్సరాలు అధికారంలో వున్నా, మా 4 రు. జీతాల విషయం వారు ఆలోచించలేదు. నెల్లూరులాంటి మున్సిపాలిటీలలో మనుష్యులచేత పాకీఇండ్లు, మురికినీరు ఇండ్లులాగించుట మాన్పించలేదు. ఆరోజులలో మంత్రివర్గాలే కాక మున్సిపాలిటీలుకూడ కాంగ్రెస్ పెత్తనంక్రిందనే వున్నాయి. కాని మాగతిని యెవరూ యోచన చేయలేదు. 1946 లో కూడ మాపరిస్థితులు 1937 లో మాదిరిగా వున్నప్పటికి టైము లేదనే కుంటిసాకు చూపుతున్నారు. కాని మంత్రులజీతాలు, శాసనసభసభ్యుల జీతాలు యెక్కువచేసుకునే అందుకు కాలం అడ్డం పడలేదు. రు 500 లు జీతాలు. రు 75-0-0 జీతాలు చాలవని పెంపుచేసుకున్నారు. రు 10-0-0 లు జీతగాండ్ర విషయంలో ఆలోచింపటం, టైములేదనటం కడు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఈలా సాకులుచెప్పి మా జీవిత సమస్యల పరిష్కారాన్ని త్రోసిపుచ్చ ప్రయత్నించరాదు.

మేము కాంగ్రెస్ మంత్రివర్గాలకు మా అత్యవసర కోర్కెలను వెంటనే నెరవేర్చవలెనని విన్నవించుకుంటున్నాం.

అగస్టు 9 వ తేదీన సమ్మె ప్రారంభమైతే అందుకు కారణం స్థానిక సంస్థల పాలనాధికారులు, కాంగ్రెస్ మంత్రివర్గం.

ప్రజానీకానికి మామనవి: మా కోర్కెలు అతిన్యాయమయినవి. అవి నెరవేర్చుకునేందుకు సమ్మె తప్పదన్నట్లు అగుపించుచున్నది. ప్రజానీకం కదిలి మా కోర్కెలను నెరవేర్చాలని, అధికారుల పైనను, మంత్రివర్గం పైనను ఒత్తిడి తీసుకొనిరావాలి. మా సమ్మె జయప్రదమయ్యేందుకు మాకు విరాళాలు యివ్వాలని ప్రార్థించుచున్నాం. అంతేగాక సమ్మెను భగ్నంచేసేందుకు అధికారుల కుటిల ప్రవర్తనను యెదుర్కొని మా కోర్కెలను అతిత్వరగా నెరవేరేటట్లు చేయవలెనని విన్నవించుకుంటున్నాము.

సోదర పనివారలకు

అగస్టు 9 మన పరీక్షాదినం. సమాజంలో కృంగి కృశించి అడుగ్రొక్కబడినవారం మనం. మనలో నూటికి నూరుపాళ్లు ఐకమత్యం అవసరం. ఈ ఐకమత్యంతో అతిశ్రీఘ్రకాలంలోనే మన కోర్కెలను సాధించుకొన గల్గుతాం. అందువల్ల పనివారంతా అగస్టు 9 వ తేదీన సమ్మె ప్రారంభించాలి.

పనివారంతా అగస్టు 9 సమ్మెచేయాలి. ప్రజలంతా సమ్మెను బలపరచాలి.

సమ్మె కమిటీ
రాష్ట్ర మున్సిపల్, లోకల్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్

సమ్మె పిలుపు

కోగంటి గోపాలకృష్ణయ్య

*

[చేట్రాయి సామిదేవుడా' మాదిరి]

సమ్మె నీకాయుధమ్మురా
కార్మికా
సంఘబలము చూప రమ్మురా
అర్థమైన కట్లనెత్త
దొడ్డి దొడ్డి తిరుగుతూ
పెంపులేని చాకిరీని
చేసి చేసి కుళ్ళుతావు

కష్టపడుచు కాపురంబునూ
కార్మికా
గడపుటం కెన్నినాళ్లురా
సరుకులేవి దొరకవాయె
ధరలు పెరిగి వెన్నువిరిగి
గోరుచుట్టుపై రోకటి
పోటాయె నీ బ్రతుకు ॥సమ్మె॥

జనసంఖ్య రోజురోజుకూ
పెరిగినా
పనివాళ్ల సంఖ్య పెరగదాయె
రోత బ్రతుకు తప్పదాయె
జీతాలు పెంచరాయె
కూడులేక గుడ్డలేక
మాడి చచ్చు చున్నారు ॥సమ్మె॥

ఉండ కొంప లేకపోయెరా
కార్మికా
దండబూతు లధికమాయెరా
అధికార్ల దుండగాలు
హద్దుమీరిపోయాయి
పనిముట్లు బట్టలడుగ
కన్నెర్ర చేస్తారు ॥సమ్మె॥

విన్నపాలు కష్టజీవుల
కార్మికా
తలరుకలసి పోరువారలు
రాష్ట్ర మున్సిపల్ వారు
సమ్మె పిలుపు పిచ్చినారు
సమ్మె శౌమ్మ దాగస్టు
సంఘబలము చూపెట్టు ॥సమ్మె॥

హైద్రాబాద్ సంస్కరణల గుట్టు

హైద్రాబాదు ప్రభుత్వం 1939 లో ప్రకటించిన రాజ్యాంగ సంస్కరణలను, స్వల్పమైన కొన్ని సవరణలతో అమలుజరుప బోతున్నట్లు ప్రకటించింది. శాసన సభ ఎన్నికలు అక్టోబరు మొదటివారములో జరుగనున్నవి.

1939 సంస్కరణలను రాష్ట్రములోని అన్ని ప్రజా సంఘాలవారు నిరాకరించారు. ఇప్పటి సంస్కరణలు ఏవిధంగా బూటకమైనవో ఇప్పటి వ్యాసమునందు స్పష్టంగా వివరించుటకు ప్రయత్నిస్తాము.

హైద్రాబాదు ప్రజలేమి కోరుచున్నారు?

హైద్రాబాదు ప్రజలు అమానుషమైన జమీందారీ, జాగీర్దారీ దోపిడీ విధానము క్రింద, అతి ఘోరమైన నిరంకుశ పరిపాలనా విధానము క్రింద, ఆర్థికంగా, రాజకీయంగా, వైజ్ఞానికంగా, నైతికంగా క్రుంగి కృశించిపోతున్నారు. వారు కోరుచున్నదేమంటే, నేడు హైద్రాబాదునందుండే సాంఘిక నిర్మాణ వ్యవస్థ పూర్తిగా పోవాలి. జమీందారీ, జాగీర్దారీ దోపిడీ విధానమూ, నిరంకుశ పరిపాలనావిధానము పోయి, ప్రజలకు సౌఖ్యకరమగు జీవిత విధానాన్ని కల్పించు విధానము రావాలి. అట్టి విధానానికై ప్రజలు అధికారము కోరుచున్నారు. నేడు అమలు జరుపబడనున్న రాజ్యాంగ సంస్కరణలు హైద్రాబాదు పరిస్థితులయందేమైన మార్పుదెస్తుందా? వానియందు ప్రజలకేమైన అధికారమీయబడిందా? అను దృక్పథంతో ఈ సంస్కరణలను ఆలోచించాలి.

శాసనసభ – దాని నిర్మాణము

శాసనసభ యీక్రిందివిధంగా ఉంటుంది–

(1) 132 మంది సభ్యులలో 76 గురు ఎన్నుకోబడుతారు. 56 గురు నియమింపబడుతారు. వీరిలో 10 మంది దాబెహాకూమతు (కార్యనిర్వాహకవర్గం) సభ్యులు. ముగ్గురు సర్ఫెఖాసు సభ్యులు (రాజుగారి జాగీర్లు.)

(1) దాబెహాకూమతు సభ్యులు 10మంది, సర్ఫెఖాసు ముగ్గురు. పోగా మిగత 119 సభ్యులలో 58 ముస్లింలు, 58 హిందువులు, 2 క్రైస్తవులు, 1 పార్సీ ఉంటారు.

(2) ఎన్నుకోబడు 76 గురు సభ్యులలో వ్యవసాయంతో సంబంధమున్నవారు 32 పట్టణములలోని ఇంటి యజమానులు, ఇంకొన్నవలాల యజమానులు.

అద్దెకున్నవారు	20
సంస్థాన ప్రభువులు, జాగీర్దార్లు	4
మాష్దార్లు (దేశ్ముఖులు - దేశ్పాండేలు మొదలగువారు)	2
సాహుకార్లు	2
బ్యాంకు యజమాన్లు	2
కర్మాగారాల యజమానులు	2
కార్మికులు	4
వకీళ్ళు (లాయర్లు)	2
డాక్టర్లు	2
గ్రాడ్యుయేట్లు	2
స్థానిక సంస్థల ప్రతినిధులు	2
మొత్తం	76

నియమింపబడిన సభ్యులలో (10 మంది దాబెహాకూమత్ సభ్యులు ముగ్గురు సర్ఫెఖాసు సభ్యులుగాక) 6 గురు పెద్దజాగీర్ల ప్రతినిధులుంటారు. మిగతా 38 నియమింపబడిన సభ్యులలో కనీసము సగముమంది సభ్యులు అనధికారులు. వీరిలో స్త్రీలకు, సహకార

సామాన్యప్రజకు వోట్లులేవు

తక్కువమంది ముస్లింలకు హెచ్చుప్రాతినిధ్యం

శాసనసభ అధికారాలు నామమాత్రమే

ఉద్యమానికి పత్రికా రచయితలకు, విశ్వవిద్యాలయానికి నిపుణులకు, లింగాయతులకు క్రైస్తవులకు నిమ్నకులాలకు, పార్సీలకు ప్రాతినిధ్య ముంటుంది. మిగతా సగము మంది అధికారు లుంటారు.

ఆర్థిక ప్రయోజనాలను బట్టి నియోజక వర్గాలు

రైతు, కూలీలకు అన్యాయము

శాసన సభకు ఎన్నుకోబడు సభ్యులు, ఆర్థిక ప్రయోజనాలను బట్టి ఏర్పరుపబడిన నియోజక వర్గాలచే ఎన్నుకోబడతారు. ఇది ప్రాంతీయ ప్రాతినిధ్యము వల్ల ఒక వ్యక్తి యొక్క ఆర్థిక ప్రయోజనాలకు నిజమైన ప్రాతినిధ్యం కలుగదనియు, ప్రతినిధులు ఆర్థిక ప్రయోజనాల పునాదిమీద ఎన్నుకోబడినప్పుడు శాసనసభలో చేయబడే చట్టాలు ప్రజల వాస్తవిక పరిస్థితులకు ఎక్కువ దగ్గరగా ఉంటాయనియు, భాష జాతి, మత వైరుధ్యాలు ఎక్కువగానున్న హైద్రాబాదుసంస్థానములో

రావి నారాయణరెడ్డి

అవి అంతరించడానికి, ఈవిధానము తోడ్పడుతుందనియు, ప్రభుత్వము కారణాలుచూపింది

ఇదంతా పట్టి బూటకము - ఎప్పుడూలేని ఈనూతన ఎన్నికవిధానమును ప్రవేశపెట్టడానికి అసలు కారణాలు వేరేవున్నాయి. ప్రాంతీయ నియోజకవర్గాలద్వారా ఎన్నికలు జరిగినచో, జాగీర్దార్లు జమీందార్లు, దేశముఖులు, సాహుకార్లు మొదలగుదోపిడివర్గానికి చెందిన అభ్యర్థులు ఎన్నికలలో గెలువలేరు. నేడు ప్రపంచములో అన్ని దేశాల్లోనూ జరిగే ఎన్నికలలో ఇది స్పష్టమగుచున్నది. గావున వీరికి ఎక్కువగా ప్రాతినిధ్యమిచ్చుటకే నూతన పద్ధతొకటి ప్రవేశపెట్టి, బూటకమైన వాదనలతో దీన్ని సమర్థించ జూచుచున్నారు

పై నుదహరింప బడిన శాసనసభ్యుల సంఖ్య దీనినే నిరూపించుచున్నది. రైతు కూలీలకు తక్కువ ప్రాతినిధ్యం — దోపిడీ వర్గాల కెక్కువ ప్రాతినిధ్యము, ఇవ్వబడుచున్నది.

శాసనసభలోని 132 గురు సభ్యులలో రైతు కూలీల ప్రతినిధులు 30 మంది మాత్రమే (వీరిలోకూడా, నలుగురు కార్మిక ప్రతినిధుల్ని మినహాయిస్తే, పేదరైతులకు, వ్యవసాయ కూలీలకు అసలు ప్రాతినిధ్యమే లేదు. రు 100 కంటె ఎక్కువ భూమి పన్ను చెల్లించే రైతులకే వోటింగుహక్కు ఇవ్వబడింది.) అంటే జనసంఖ్యలో నూటికి 95 కంటే ఎక్కువగా ఉండు రైతుకూలీలకు అతిస్వల్పమైన ప్రాతినిధ్యం ఇచ్చారు. జనసంఖ్యలో నూటికి 5 గూడాలేని జాగీర్దార్లకు, జమీందార్లకు, సాహుకార్లకు మధ్య తరగతి మేధావులకు నూటికి 73 వరకు ప్రాతినిధ్యం ఇవ్వబడింది. సభ్యులను నియమించు పద్ధతిగూడా, ఈ విధానానికి, ఆర్థిక ప్రయోజనాల ఎన్నిక పద్ధతికి బాగుగా తోడ్పడుతుంది.

హిందువులకు అన్యాయము

ఒకవైపు భాష, మత వైరుధ్యాలు రూపుమాపుటకై ఆర్థిక ప్రయోజనాల నియోజకవర్గాలు ఏర్పరుపబడ్డాయని చెప్పుచు రెండోవైపు జనసంఖ్యలో నూటికి 85 మంది వున్న హిందువులకు నూటికి ఏబది కంటె గూడా తక్కువ ప్రాతినిధ్యమిచ్చి, నూటికి 12 గురు గల ముస్లిములకు నూటికి ఏబది కంటె ఎక్కువ ప్రాతినిధ్య మిచ్చి, మత వైషమ్యాలను అధికం చేయుమార్గము ప్రభుత్వ మవలంబించింది. సర్ఫెఖాసు దాబెహాకూమతు సభ్యులు 13 గురు గాక, మిగతా 119 సభ్యులలో 58గురు ముస్లింలు 58 హిందువులు, 2 క్రైస్తవులు, 1 పార్సీ ఉందురని, ప్రభుత్వ ప్రకటన చెప్పుతున్నది. ముగ్గురు సర్ఫెఖాసు సభ్యులు ముస్లిములే ఉంటారు. 10 మంది దాబెహాకూమతు సభ్యుల సంఖ్యలో ఎక్కువ ముస్లింలె ఉంటారనునది నిర్వివాదాంశము.

త్రివేటు బిల్లులు ఏదైన ఒక మతమునకు చెందినట్టి ముఖ్యమగు తీర్మానము, పైబడు ఓటింగుయందు పాల్గొను అధికారము తప్ప మిగతా అన్ని విషయాలలో వీరికి ఇతర శాసనసభ్యుల అధికారాలే ఉంటాయి.

పై 58 మంది ముస్లింలు, దాబెహాకూమతులో సర్ఫెఖాసు ముస్లింసభ్యుల సంఖ్యతో కలిసి ముస్లింలకు నూటికి 60 కంటె ఎక్కువ ప్రాతినిధ్యము లభించుచున్నది. ముస్లిం అభివృద్ధి నిరోధక నాయకుల హైద్రాబాదు రాజకీయాలలో ప్రవేశపెట్టిన "మేము పాలకజాతి వారము" అను మతతత్వ సిద్ధాంతాన్ని ప్రభుత్వం అంగీకరించిందన్న మాట. ప్రభుత్వము హిందువులకు, ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుందని చేసిన ప్రకటన వట్టి బూటకం. ఒకవైపు ప్రకటిస్తూ, రెండోవైపు దొడ్డిదారిని ముస్లింలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఇచ్చింది.

దీనిచే హైద్రాబాదు యందు నూతన స్వరూపమున మత ద్వేషాలు చెలరేగే అవకాశ మున్నది. ప్రజాస్వామిక సూత్రాలకిది పూర్తిగా విరుద్ధము.

సమిష్టి నియోజక వర్గాలు

హిందువులకు, మహమ్మదీయులకు వేరువేరు నియోజకవర్గాలుండవు. కాని ఎన్నుకోబడిన సభ్యుడు తన మతస్థులలో పోలు అయిన వోట్లలో నూటికి 51 ఓట్లు తెచ్చుకోవాలి. తమ మతమునకు చెందిన వోట్లలో నూటికి 51 వచ్చినచో అతడు ఇతర మతముల వారి వోట్లు అక్కరలేకుండానే ఎన్నుకొనబడుతాడనియు. ఒకరి కంటె ఎక్కువ మంది అభ్యర్థులు ఒకే మతమునకు చెందినవారుండి, ఎవరికీ నూటికి 51 వోట్లు తమ మతమువారివి రాక తక్కువ వచ్చినప్పుడే, ఇతర మతములవారి వోట్లు లెక్కింపబడతవనియు. ప్రభుత్వ ప్రకటన తెలుపుచున్నది. నేటి వాతావరణము దృష్టియందుంచుకొని పరిశీలించినచో, ఇది నామమాత్రమైన సమిష్టి నియోజకవర్గ పద్ధతియేగాని, ఆచరణయందుమాత్రం ప్రత్యేక నియోజక పద్ధతిగానే పరిణమించును.

వోటింగు అధికారము

ప్రభుత్వ ప్రకటన ననుసరించి, సామాన్య ప్రజలకు సంబంధించిన వోటింగు అధికారాలీవిధంగా ఉన్నాయి.

(1) వ్యవసాయదారుల నియోజకవర్గములో 100 రూపాయలు శిస్తు, లేక భూమి శిస్తు చెల్లించే వ్యవసాయదారునికి.

(2) హైద్రాబాదు, సికింద్రాబాదు పట్టణాలలో నెలకు రు. 5 అద్దె వచ్చే ఇల్లు లేక భూమిగలిగిన యజమానికి ఇతర పట్టణాలలో రు. 6/- అద్దె చెల్లించే అద్దెదారునికి.

(3) నెలకు 15 జీతముగల స్త్రీ కార్మికులు, నెలకు రు 20 జీతముగల పురుష కార్మికులకు.

(1) పై వివరాలవలన వ్యవసాయదారులలో పెద్ద జమీందార్లకు, షరీకులు పట్వారీలకు, ధనిక రైతులకు. వీరివంటి భూములు కౌలుకిచ్చి వీరిమాదిరి వ్యవసాయం చేయించలేని కౌలుదార్లకు వోటింగు అధికారమీయబడింది. వీరిచేఎన్నుకోబడినఅభ్యర్థులు గూడా అభివృద్ధినిరోధకులేఅయి ఉంటారని వేరే చెప్పవలసినవసరములేదు. మధ్యతరగతి, పేదరైతులకు ఓటింగు అధికారములేదు. వ్యవసాయకూలీలు, చేతివృత్తిపారిశ్రామికులు, గౌండ్లు, వడ్ల మొదలయిన గ్రామ పారిశ్రామికుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యమే గుర్తించబడలేదు. వీరికి వోటింగు అధికారమంతకుముందేలేదు. గ్రామ ప్రజలలో నూటికి ఒకరికి గూడా వోటింగు అధికారం ఈయబడలేదని చెప్పిన అతిశయోక్తి గాజాలదు.

(2) పట్టణాలలో ఓటింగు అధికారము కొంతవరకు విశాలంగా ఉన్నప్పటికి పట్టణాలలోమంది ఎన్నుకొంటె 20 మంది ప్రతినిధుల నియోజక వర్గాలలో రాష్ట్రమునందుండె పట్టణాలన్నియు తెప్పబడుతాయనే గ్యారంటీలేదు. 20 మంది ప్రతినిధులు ఏడెనిమిది పట్టణాల నుండి ఎన్నుకోబడు ఏర్పాట్లు జరుగవచ్చును. అట్టి ఏర్పాటు జరుగుచున్న వార్త లిదివరకు వచ్చాయి గూడా. పట్టణాలకిచ్చినదానికంటె పల్లెటూళ్ళకు అతిసంకుచితంగా ఈయబడినఓటింగు అధికారము ముఖ్యంగా గమనింపదగినది.

(3) రాష్ట్రములో కార్మికులకుండు జీతాలు తక్కువ. కార్మికులకు లభించే ఎన్నివేరే ఇతరవిధములైన భత్యాలు ఓటింగు అధికారమిచ్చుటయందు లెక్కింపబడవు. అందుచే అత్యధికసంఖ్యాకులగు కార్మికులకు ఓటింగు అధికారము లేకుండా పోతుందన్నమాట.

మొత్తముపై రాష్ట్రప్రజలలో నూటికి ఇద్దరికైనా ఓటింగు అధికారము లభించునాయను విషయం సందేహాస్పదమైనది.

శాసనసభ అధికారాలు నామమాత్రమే

శాసనసభకునిజమైనఅధికారాలు యేమీ లేవు. దాబెహాకూమతు శాసనసభకు బాధ్యత వహించదు దాబెహాకూమతు సభ్యులను నియమించు అధికారము, తీసివేయు అధికారము నిజాం ప్రభుత్వంకే ఉన్నది. ఎన్నుకోబడిన శాసనసభ్యుల నిద్దరిని మంత్రులుగా నియమించుతామని వాగ్దానము చేయబడినది. వీరుగూడా శాసనసభకు బాధ్యత వహించనవసరములేదు. మంచివారినే నియమింతవలయునను నిర్బంధము లేదు. ఎన్నుకోబడిన వారిలో అభివృద్ధి నిరోధకులేమీ తక్కువ సంఖ్యలో నుండరు. అట్టివారెవరో ఇద్దరు మంత్రులుగా నియమింప బడవచ్చును.

(మిగతా 11వ పేజీలో)

హత్యలకు అమానుష హింసలకు పుట్టినిల్లు

నైజాంలో దుష్పరిపాలన

కడవెండిలో జరిగిన ఖూనీ పుట్టుపూర్వోత్తరాలు

వట్టికోట ఆళ్వారుస్వామి

1946 వ జూలై 4 వ తేదీనాడు జనగాం తాలూకాలోని గ్రామమగు కడవెండిలో ఆంధ్రమహాసభ కార్యకర్తలపై జనగాందేశముఖు విసునూరి రామచంద్రారెడ్డి రౌడీలు తుపాకులుపేల్చిన కారణంగా ఒకరు మరణించారనీ, 7 గురు గాయాలకు గురిఅయ్యారనీ "ప్రజాశక్తి" పాఠకులెరెగుదురు ఈక్రింది వ్యాసం దాని సంగ్రహచరిత్ర.

★

ఆకునూరులో పోలీసులు స్త్రీలను చెరచుట మొదలగు అమానుష చర్యలను బట్టబయలు చేస్తూ ఆంధ్రమహాసభాధ్యక్షులు శ్రీరావి నారాయణరెడ్డిగారుచేసిన ప్రకటనపై ప్రభుత్వము అరెస్టు చేయనున్నదను పత్రికవార్తతో ప్రజావ్యతిరేకులు చంకలు కొట్టడం ప్రారంభించారు. అరెస్టు అయినానే పిదంతులు లేవదీశారు, రౌడీలు నీచంగా ప్రచారము మొదలు పెట్టారు. కడవెండి దొరసాని తొత్తులగు స్త్రీలద్వారా అవినీతి పద్ధతిన తిట్టించడం ప్రారంభమైంది.

కడవెండి ఆంధ్రమహాసభ కార్యకర్తలు 29.9.55 వ నాడు జరిపిన ప్రచారంలోని అంతరార్థమును, శ్రీనారాయణరెడ్డిగారు అరెస్టుకాలేదని, ఒకవేళ ముందు అయినను ప్రజలు తమశక్తితో విడిపించుకోవాలని. నిరంకుశ ప్రభుత్వాన్ని స్థానిక రౌడీలను దోపిడీదారులను ఎదుర్కోవాలని ప్రజల్లో ప్రచారము ప్రారంభించారు. ఈసంద్భమున కిష్టయనే ఏజంటు ఒకచోట శ్రీనారాయణరెడ్డిగారిని నీచంగాతిట్ట నారంభించాడు. అదే విధంగా, ప్రజావ్యతిరేకి అయిన కోట చంద్రయ్య భార్య నర్సమ్మ ప్రచారము చేస్తున్న ప్రజలపై మన్నుపోసి, శ్రీనారాయణరెడ్డిగారిని నీచంగా బూతులు తిట్టడం ప్రారంభించింది. త్రోవకడ్డంగా నిలుచుంది. మన్నుపోస్తున్న కోట నర్సమ్మను ప్రక్కకు నెట్టి ప్రజలు ముందుకు వెళ్ళిపోయినారు.

ఈ సంఘటనను నేరంగా చేయుటకై 29–9–55 వ. గురువారం సాయంత్రం విసునూరు అమీను జమేదారుతోసహా కడవెండికివచ్చి దొరసాని యింట్లో మకాము వేశాడు. తెల్లవారి 30.9.55 వ. శుక్రవారం ఉదయం విసూ్నరు పోలీసు మొహర్రిర్ కత్తులు, తుపాకులు లాఠీలతో 40 మంది దేశముఖు రౌడీలతోవచ్చి దొరసాని గడీలో జనచేశాడు. తర్వాత ఆంధ్రమహాసభ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీ ఎల్లమరెడ్డి మోహన్ రెడ్డిగారిని పిలిపించి తే గ్రామ చావిడిలోకైతే వస్తానుగాని, దొరసాని గడిలోకి రానని, అక్కడ ఆయుధాలతో రౌడీలున్నారని సమాధానమిచ్చాడు. తుదకు మధ్యాహ్నం చావిడిలో మోహన్ రెడ్డిగారు అమీనును కలిశాడు!

కడవెండి కాల్పుల అనంతరం 7 కేసులు

దేవరుప్పల, జూలై 20

కడవెండి కాల్పులు జరిగిన తర్వాత, పోలీసులు ఆంధ్రమహాసభ కార్య కర్తలపై 7 కేసులు పెట్టారు. ముద్దాయిలు

1. సి. యాదగిరిరావు (జనగామ తాలూకా ఆంధ్రమహాసభ అధ్యక్షులు)
2. కె. రామచంద్రారెడ్డి (జనగామ తాలూకా ఆంధ్రమహాసభ కార్యదర్శి)
3. మద్ది రామిరెడ్డి (దేవరుప్పం గ్రామ కమిటీ కార్యదర్శి)
4. కృష్ణమూర్తి (పట్టా సంఘ అగ్రనేత)
5. కడవెండి గ్రామ కమిటీ అధ్యక్షుడు
6. .. .. కార్యదర్శి
7. మరి యిద్దరు కార్యకర్తలు.

పైవారు రామవరం పోలీసు పటేలు ఇంటిని తగులబెట్టారని, నేరం మోపబడింది.

రాజీనామా యిచ్చిన పోలీసుపటేలుపై కేసు

జనగామ, జూలై 19

ఆకునూరులో పోలీసులు జరిపిన అమానుష చర్యలను గర్హిస్తూ ఆ గ్రామ పటేల్ (మునసబు) శ్రీ సీతల్ ప్రసాద్ తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చిన విషయం "ప్రజాశక్తి" పాఠకులకు తెలుసు. ఆయనను పోలీసులు జనగామాలో అరెస్టు చేశారు. వెంటనే జామీనుపై విడుదల చేశారు. కేసు విచారణ వ. 27.11.55 వ తేదీని ప్రారంభమవుతుంది.

'ప్రజాశక్తి'పై నిషేధం రద్దుకావాలి

"ప్రజాశక్తి"పత్రికను నిషేధిస్తూ హైద్రాబాద్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తరువు తూటింట్ల ఆంధ్రమహాసభ గ్రామ కమిటీ ఖండించింది. సూర్యాపేట పట్టణ కమిటీ కార్యదర్శి బి. ధర్మలింగంగారు ప్రభుత్వ ఉత్తరువు నిరసిస్తూ ఒక ప్రకటన చేస్తున్నారు.

దేశముఖు దుర్మార్గాలకు పోలీసుల ప్రోత్సాహం

దేశముఖు ఏజంటు బుచ్చిరామయ్య ఇంటిపై అల్లరిచేశారని, 16 మంది ఆంధ్రమహాసభ కార్యకర్తలపై నేరముమోపి, అక్కడ ఆ సమయమునవున్న 10 మందిని అరెస్టుచేసి ఒక్కొక్కరిని వందరూపాయల జామీనుపై విడుదల చేశాడు. పంజునామా (పంచాయితీ) జరపడంగాని, సాక్ష్యాలు తీసుకోవడంగాని జరుగలేదు. రౌడీలు ఆయుధాలతోవచ్చి దొరసాని యింట్లో ఉండటానికి కారణమడుగగా, విసూ్నరి రామచంద్రారెడ్డి హైదరాబాదునుండి రానున్నాడని, వచ్చారని పోలీసు అమీన్, మొహర్రిర్ సమాధానం చెప్పారు. తర్వాత విసూ్నరుకు వెళ్ళారు. రౌడీలు మాత్రం కడవెండిలోనే ఆగిపోయారు

అటుతర్వాత రౌడీలు బాగా త్రాగి దొరసాని గడీ ముందరవేయున్న జంపాల లచ్చుమ్మ (మంగలి) యింటిపై రాళ్ళువేయ ప్రారంభించారు. ఈమె ముగ్గురు కొడుకులు ఆంధ్రమహాసభకార్యకర్తలు. లచ్చుమ్మ కేకలువేస్తూ తనకు న్యాయము కలిగించాలని ఆంధ్రమహాసభ ఆఫీసుకువెళ్ళి మొరపెట్టుకున్నది. సంగతేమిటో కనుక్కుందామని లచ్చుమ్మ యింటికి కొందరు వెళ్ళి, రాళ్ళు పడిన స్థలములోచేరి రాళ్ళను చూస్తుండగా తుపాకులు పేల్చబడినవి. వెంటనే దొడ్డి కొమరయ్య (కుర్మ గొర్లకాపరి) పొట్టనుండి తుపాకిగుండు దూరి పేగులు బయటకువెళ్ళి నేలకొరిగాడు. ఇతడు యింటికి చేర్చబడిన తరువాత తెల్లవారుచుండగా మరణించాడు. ఈ కొమరయ్య అన్న మల్లయ్యకు రెండు కాళ్ళపై బలమయిన గాయాలు ఏర్పడి కూర్చోవలేని స్థితి కలిగింది. బండారు అయిలయ్య ఎడమకాలి గుత్తివద్ద బలమయిన గాయం తగిలింది. రేశపల్లి కొండయ్యకు మడుటిపయి, కుడిభుజమునయి దెబ్బలు తగిలినవి. రేశపల్లి లక్ష్మీనరసింహాకు కాలుకు, పదమటింటి మల్లయ్య ఎడమ కన్నుకు, సురిగెల్లి నరసయ్యగజ్జల్లో దెబ్బలు తగిలినవి. కొరిగల్ల సాయిలు కుడికన్ను కమిలిపోయింది.

రౌడీల ఈ తుపాకి దెబ్బలకు, కార్యకర్తలు, ప్రజలు "ఆంధ్ర మహాసభకుజై" రావి నారాయణరెడ్డిగారికిజై" అని నినాదలిస్తూ రౌడీల వైపు పరుగెత్త గానే రౌడీలు దొరసాని గడీలోచొచ్చి తలుపులు వేసుకున్నారు. ప్రజలు గాయపడిన వారిని భుజాలమీద వేసికొని, ప్రజలకు చూపిస్తూ "ప్రజాప్రభుత్వం కావాలె" "రౌడీల చర్యలు అంతరించాలె" "జమీందారీ విధానం నశించాలి" "ఆంధ్రమహాసభకుజై" అను నినాదాలతో ఎవరియిండ్లకు వారు చేరుకున్నారు.

అదనపు రౌడీజులాలను పంపేరు

మరుపటిరోజు శనివారంనాడు, ఈ దురాగతాలను పోలీసు నాజంకు తెలుప బడినవి. దొరసానియింట్లో దాగుకొనియున్న రౌడీలను పోలీసులు వచ్చేవరకు చూస్తుండాలని ప్రజలు కావలాకాచారు. ఈ సంగతి తెలిసి రౌడీలను విడిపించుకొనిపోవుటకై విసూ్నరి రామచంద్రారెడ్డి రెండోకొడుకు 40 మంది రౌడీలతో కత్తులు, తుపాకులతో వస్తున్నాడని తెలిసి ఫర్లాంగు దూరము వరకు వెళ్ళి, ఆ రౌడీలు గ్రామములో అడుగు పెట్టకుండా ప్రజలు చేయగలిగారు.

కడివెండిలో జరిగిన హత్య మొదలగు వార్తలువిని, తమ సోదర ప్రజలకు కలిగిన అన్యాయముయెడ సానుభూతి ప్రకటించుటకును, ఆపదలనుండి తప్పించుటలో తమ సర్వశక్తుల సహాయము చేయుటకును చుట్టు పల్లగల సుమారు పదిగ్రామాలనుండి స్త్రీ పురుషులు కదలి వచ్చారు.

ఉదయం తరిమివేయబడిన రౌడీలు ఇంకా తను పట్టుదలను మానుకోలేదు. కడవెండికి మూడుమైళ్ళ దూరములోనున్న వానకొండయ్యా గుట్టల్లో మజిలీవేసి, తమ శక్తిని అధికంగా చేసికొని తిరిగి గ్రామముపై దాడి చేయాలని ఆలోచనలు చేస్తున్నట్లు ప్రజలకు తెలిసింది. ఇంతవరకు పోలీసుల రక్షణలేదు. శవము పడివున్నది. గాయములతో బాధపడుతున్నారు. ప్రజల్లో ఉద్రేకము మించిపోతున్నది. ముఖ్యముగా తమకు తామే రక్షకులమని, ప్రభుత్వము తమకొరకు లేదని, ఎట్టి పరిస్థితులలోనైనా తమ గ్రామాన్ని, తమ పిల్లలను, తమ స్త్రీలను, తమ గౌరవాన్ని నిలుపుకోవడానికి ఎట్టి త్యాగాలకైనా వెనుదీయమని దృఢ నిశ్చయముతో ప్రజలు వున్నారు.

మళ్ళీ తుపాకి కాల్పులు

తరవాత సాయంత్రం అమీన్ పంచనామా (పంచాయితీ) చేశాడు. "శవానికి తుపాకి దెబ్బ లున్న"వని పంచనామాలో వ్రాయబడినది. తుపాకి దెబ్బలకు గురియైన అందరి నుండి వాఙ్మూలము తీసికొని, హత్యా ప్రదేశాన్ని చూచి, నెత్తురు మట్టిని తద్రపరచి, అమీన్ తనవెంటకు చేసుకున్నాడు. హంతకులు దొరసాని ఇంట్లో వున్నారని, అరెస్టు చేయమని ప్రజలు కోరితే "సాక్ష్యము పూర్తి అయిన తర్వాత అరెస్టుచేస్తామని" సమాధాన మిచ్చాడు.

ఇది ఇట్లుండగా, సాయం సమయమున తిరిగియట తుపాకిదెబ్బల చప్పుడు వినబడింది. ఊళ్ళో అమీను, పోలీసులు వున్నారు. తమ ఇష్టము వచ్చినట్లు ఆటలాడవచ్చునని రౌడీలు గ్రామముపైకి వచ్చే పన్నాహంలో నున్నారని ప్రజలకు తెలిసింది. పోలీసు అమీన్ గుట్టల్లో ఎవరు లేరని బొంకపోకాడు. ప్రజలు ముందడుగువేసి, తమ గ్రామములో అడుగు పెట్టకుండా తరిమి వచ్చారు. ఈ హడావుడిలో దొరసాని ఇంట్లో, వున్న హంతకులు బ్రతుకు జీవుడాయని బయట పడ్డారు.

ఆదివారమునాడుదయం శవము, గాయపడినవాండ్లు జనగామ దవాఖానాకు పంపబడినప్పుడు ప్రజలంతా ఊరేగింపుగా బయలుదేరారు. నిరంకుశత్వాన్నెదుర్కొనుటలో బలిఅయిన కొమరయ్యకు జోహారులర్పించారు. తుపాకి దెబ్బలకు వెనుతీయమని కొమరయ్యను ఆదర్శముగా తీసుకొని అతడు చూపిన మార్గాన్ని అనుసరిస్తామని ప్రజలు ప్రతిజ్ఞ తీసుకున్నారు:

పోలీసుల నాటకం

ఇదేరోజు ఉదయం 10 గంటలవరకు 64 మంది రిజర్వు పోలీసులతో మదద్గారు మొహతెమీం, ఆలేరు ముంతెజం 10 మంది జవాన్లతో కడవెండికి చేరుకున్నారు. ప్రజలు వీధుల్లో గుమిగూడి వుండగానే పై పోలీసు సిబ్బంది వచ్చింది. ఇంత హఠాత్తుగా వచ్చినప్పటికి ప్రజలు చెదరనందుకు మదద్గారు మొహతెమీంకు ఒడలుమండింది. లారీలో మన్న రిజర్వు పోలీసును బయటికి దింపి పరేడు చేయించారు. ప్రజలు కదలలేదు, ఇక లాభం లేదనుకున్నారు. "మీరిట్లా గుమిగూడ కూడదు, తప్పు, అక్రమము అని" ధర్మబోధచేసి తన బసకు చేరుకున్నాడు.

దొంగ కేసులకు సన్నాహాలు

పోలీసు మదద్గారు వచ్చిన ఫలితమేమిటి?

(1) రోజు 80,85 సేర్ల బియ్యం దానికి తగిన సామాను చిటీల ద్వారా తెప్పించుకొనబడుచున్నది.

(2) ఈయన బస చేసి ఉండడం వలన పాఠశాల ఆగిపోయింది.

(3) వెట్టివాండ్లకేలాంటి ప్రతిఫలము లేకుండానే పని తీసికొనబడుచున్నది.

(4) హత్యానేరములో విచారణ సాక్ష్యులకన్న. ఆంధ్రమహాసభ కార్యకర్తలపై దొంగనేరాలుమోపి నిర్బంధించాలని ఎత్తులు వేయబడుచున్నవి.

(5) కార్యకర్తలు ప్రజలమంది బలవంతముగా డబ్బు వసూలు చేశారని సీతారామపురమునుండి ఒక ఫిర్యాదు పుట్టించారు.

(6) దేవరుప్పుల మహమ్మదీయుని 6 బస్తాల వేరుశనగపప్పు, 3 బస్తాల జొన్నలు తీసుకొని బండిని మాయము చేసినట్లు కేసు స్థిరము చేయబడుచున్నది.

(మిగతా 8 వ పేజీలో)

సంస్థానాధీశులతో రాజీ; ప్రజా ఉద్యమాలను మంటగలపడం

సంస్థాన ప్రజామండలి స్టాండింగ్ కమిటీ తీర్మానాల సారాంశం

అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశం జరిగినవెనువెంటనే, జూలై 9-10 తేదీలలో బొంబాయి నగరంలో అఖిలభారత సంస్థాన ప్రజామండలి స్టాండింగ్ కమిటీ సమావేశం అయింది. ఇదీ కాంగ్రెసు కమిటీ సమావేశం మాదిరిగానే చాలా ప్రధానమైన సమావేశం. పండిట్ జవహర్లాల్ నెహ్రూ దీనికి అధ్యక్షత వహించారు.

ప్రెసిడెంటు నెహ్రూ, కార్యదర్శులు శ్రీ జయనారాయణ వ్యాస్, బల్వంతరాయ్ మెహతా లిద్దరుగాక, ప్రత్యేకాహ్వానాలపై చాలమందివచ్చారు. శ్రీ కె. టి. భాష్యం (మైసూరు), టి.ఎమ్. వర్గీస్ (ట్రావెన్కూరు) వి. ఎల్. ఢుధ్గర్ (భావనగర్), డా॥ పట్టాభి సీతారామయ్య (ఆంధ్ర), స్వామీ రామానందతీర్థ (హైద్రాబాద్) నాగలింగప్ప (మైసూరు) జనీగులామ్ మొహమ్మద్, జి. ఎమ్. సాదిక్ శ్యామలాల్ కౌల్ (కాశ్మీర్), ఖాన్ అబ్దుల్ సమద్ఖాన్ (బెలూచిస్తాన్), రావి నారాయణరెడ్డి (ఆంధ్రమహాసభ అధ్యక్షులు-హైద్రాబాదు), కవలంతరావాల్, వైద్యనాదమహోదయ (సెంట్రల్ ఇండియా) గారలు. మరి కొందరూ సమావేశానికి హాజరయారు.

రాజపుటానా సెంట్రల్ ఇండియాలలో కార్మికుల పోరాటాలూ, ప్రజల పోరాటాలూ ప్రతిదినమూ తీవ్రం అవుతూన్నదశలో, ఈ సమావేశం జరిగింది.

సమావేశం ఒకమూల జరుగుతూండగా రెంకోవేపున బికనేర్, పాటియాలా, బరోడాలలో తుపాకులు యధేచ్ఛగా కాల్చబడ్డాయి. నిరాయుధులయిన ప్రజలు ఎందరో మరణించారు

సంస్థాన ప్రజలు తమరక్తంతో భారత సంస్థాన ప్రజావుద్యమాల చరిత్రకు నూతనాధ్యాయాలను చేరుస్తూన్నారు.

కాని, స్టాండింగ్కమిటీ ఈ ప్రజావుద్యమాల్ని నడిపి, పెంపొందించే కోణంలో నిర్ణయాలు చేయలేదు. ప్రజాఉద్యమాలను ధ్వంసంచేసేటందుకూ సంస్థానాధీశులతో రాజీకి ఎత్తులువేసింది.

రాజ్యాంగ నిర్మాణసభకు సంస్థాన ప్రజల ప్రాతినిధ్యాన్నిగురించి చాలా ముఖ్యమైన తీర్మానాలు చేయబడ్డాయి. ఒక ఉపసంఘాన్ని నియమించి, రాబోయే రాజ్యాంగచట్టపు మార్పులలో సంస్థాన ప్రజల తరఫున అవసరమైన విషయాలు సేకరించి, చిత్తు సూచనలను తయారు చెయ్యమని తీర్మానించారు.

"అఖిలభారత ఫెడరల్ యూనియనులో సంస్థానాలు చేరడంవల్ల వచ్చే సమస్యలను సమాలోచన చేయడం సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వాల నిర్మాణానికీ, ప్రాథమికహక్కులకీ సంబంధించిన సమస్యలను ఆలోచించడమూ" ఈ కమిటీ యొక్క కర్తవ్యం.

"రాజ్యాంగ నిర్మాణసభ విషయమై చేస్తూన్న ప్రయత్నాలలో సంస్థాన ప్రజలను అటు బ్రిటిష్ ప్రభుత్వమూ, ఇటు సంస్థానాధీశులూ కూడా మరచిపోతూన్నారు. ఈ విషయమై స్టాండింగ్కమిటీ చాలాఅసంతృప్తి చెందింది" అంటూ ఒక తీర్మానం చేయబడింది.

ఆ తీర్మానంలోనే "సంస్థాన ప్రజల అభిప్రాయం తెలుసుకోనిదే, చేసిన నిర్ణయాన్ని దేనినీ అంగీకరించ" మని గట్టిగా చెప్పేరు.

రాజ్యాంగసభకు ప్రాతినిధ్యం

కాని అఖిలభారత రాజ్యాంగ నిర్మాణసభకి సంస్థాన ప్రజల ప్రాతినిధ్యం విషయంలో స్పష్టమైన కోరికను వెలిబుచ్చలేదు. "సంస్థానాలనుంచి వచ్చే ప్రతినిధులు ప్రజలచే ఎన్నుకోబడిన వారుగా వుండాలి" అని మాత్రమే చెప్పేరు.

జనరల్ కౌన్సిలు ఆమధ్య ఢిల్లీలో సమావేశం అయినప్పుడు నిరంకుశ ప్రభువులతో రాజీపడేందుకు వీలుగావుండేటట్లు ఒక తీర్మానం చేసింది. ఆ తీర్మానం ద్వారా ఈ నాడు సంస్థానాలలోవున్న శాసనసభలకు ఎన్నుకోబడ్డవారినుంచే రాజ్యాంగ సభకు సంస్థాన ప్రతినిధుల నెన్నుకోవచ్చునని అంగీకరించింది. (సంస్థానాలలో శాసన సభకు ప్రతినిధుల నెన్నుకొనే వోటు హక్కు చాలా పరిమితం.)

ఈ విషయాన్నే ప్రస్తుత సమావేశంలో ఒక అస్పష్టమైన తీర్మానం రూపంలో మళ్లీ చెప్పడంలో అర్థం, ఇంకా దిగి వస్తామని సూచించడమే కాదూ?

ఈ సమావేశంలో ఒక తీర్మానం కాశ్మీర్ మీదా, మరొకటి బికనేర్ మీదా చేశారు.

పండిట్ నెహ్రూ విషయంలో సంస్థానాధికారులు చేసిన నిర్బంధ చర్యలు, సంస్థానంలో అమలు జరిగిన నిరంకుశ విధానము, తీర్మానములో వివరించబడ్డాయి. చిట్టచివర "తమఅధ్యక్షుని విషయంలో కాశ్మీర ప్రభుత్వం ప్రవర్తించిన విధానాన్ని" ఇంకా సంస్థానంలో నిర్బంధవిధానం సాగించబడుతూ వుండడాన్నీ అసహ్యించుకుంటున్నామన్నారు.

పండిట్ నెహ్రూ వచ్చినప్పుడు అరెస్టు అయిన శ్రీ ద్వారకనాథ కచ్రూకి అభినందనాలు తెలిపింది కమిటీ. "కాశ్మీరంలోకి మా అధ్యక్షుడుగాని, మరి ఎవ్వరైనాగాని, ప్రవేశించకుండా నిషేధించడం అన్యాయం. అటువంటి పనులు సహించం" అని ప్రకటించారు.

"షేక్ అబ్దుల్లా విడుదల కానంతవరకూ కాశ్మీరంలో శాంతి అనేది వుండదు" అని కూడా చెప్పారు.

కాని, ఇకముందు కార్యక్రమం వేసుకుని దాన్ని సాగించడానికి కమిటీ యిష్టపడలేదు. "కాంగ్రెసు వర్కింగుకమిటీ కాశ్మీర వ్యవహారాన్ని స్వయంగా తీసుకుంది కనుక ఈ అతిప్రధాన సమస్యను "కాంగ్రెసు వర్కింగు కమిటీకే" వదిలిపెడ్తేరు. కాంగ్రెసు వర్కింగు కమిటీ ఆ విషయాలలో బాగా అనుభవంగలది. ప్రజలయొక్క దేశం యొక్క గౌరవ స్వాతంత్ర్యాలకై ఎప్పుడూ పోరాడుతూంది." కనుక ఆ విషయమై బెంగపెట్టుకో నక్కరలేదన్నారు.

కాశ్మీర్లో రాజీప్రయత్నాలు

దీని తర్వాత "సమస్యలన్నీ వేగంగా గౌరవానికి భంగం లేకుండా" పరిష్కరించబడతాయని కమిటీ ఆశించింది.

డోగ్రా రాజవంశపు "భయంకర దౌర్జన్యాల"పైనా, దారుణ నిర్బంధవిధానంమీదా "అంతిమ నిర్ణయానికి రాకుండా" కమిటీ నిలిచిపోయింది. కాశ్మీర ప్రజల ప్రతిఘటనను కొంచెమైనా ప్రశంసించలేదు. పైగా కేవలం "స్వతంత్రంగా విచారణ" చేయమంది. వీటన్నింటికీ అర్థం ఏమిటి: రాజీకి ప్రయత్నించడమే:

ఈమధ్యనే జరిగిన బికనీర్ కాల్పులమీద తీర్మానంచేస్తూ రాజపుటానా ప్రాంతీయ ప్రజామండలి కార్యదర్శినీ, అధ్యక్షునీ "బికనీర్ వెళ్ళి, సంగతులన్నీ విచారించి రిపోర్టు నివ్వమ"ని నియమించారు. "సంస్థానపు అధికారులు ఈ పనిని చెయ్యడానికి అవసరమైన సౌకర్యాలన్నీ చేస్తార"ని విశ్వసిస్తున్నామన్నారు.

సంస్థానాలలో కార్మిక పోరాటాల విషయమై ప్రజామండలి దృక్పథాన్ని తెలుపుతూ ఒక తీర్మానం చేయబడింది. ఇది చాలా ముఖ్యమైన తీర్మానాలలో ఒకటి. సంస్థాన కార్మికులు లిప్పటిప్పుడే కళ్ళు తెరిచారు. పోరాటాలలో అధికంగా పాల్గొంటున్నారు. వీటన్నింటినీ "తాత్కాలికమైన వుద్రేకంలో" వచ్చాయంటూ తక్కువచేస్తూ, ఇవి "కార్మికోద్యమాన్ని బలహీన పరుస్తాయనీ, వారిలో ఐక్యతను భంగపరుస్తాయనీ" కమిటీ విమర్శించింది.

కార్మికవర్గానికి విరుద్ధంగా ప్రజామండలి తీసుకున్న దృక్పథం తీర్మానంలోనే స్పష్టపడిపోయింది. ప్రజామండలి యొక్క అనుబంధ సంస్థలన్నీ 'హిందుస్థాన్ మజ్దూర్ సేవక సంఘంవారి సలహాలతో" కార్మికులలో పనిచెయ్యమని సలహా ఇచ్చింది.

సేవక సంఘానికి చెందిన రావాల్, వైద్యనాథ మహోదయ (సెంట్రల్ ఇండియా) గార్లిద్దరూ సమ్మె విఘ్నంసకులుగా పని చేశారనీ, వట్టి సంస్కరణ వాదులనీ ఇదివరకే అపకీర్తిపాలయి వున్నారు. వారిద్దరూ ఇచ్చిన రిపోర్టు నాధారం చేసుకుని, ఇందూరు, ఉజ్జయినీ లలో కార్మికుల ఆదరం పొందిన యూనియన్లనీ, వారి నాయకుల్ని దౌర్జన్యపరులని నిందించి ఖండించింది.

వారి రిపోర్టులోని నిందారోపణల్ని విడిగా విచారించవలసి వుందనికూడా వారు తలచలేదు.

దక్షిణాఫ్రికామీద ఒకటీ, మైసూరులో ఆహార పరిస్థితిమీద ఒకటీ కలాట్ సంస్థానాన్ని భారతదేశాన్నుంచి వేరుచేయడానికై బ్రిటిష్వారు చేస్తూన్న కుట్రను వ్యతిరేకిస్తూ మరొకటీ తీర్మానాలు చేశారు.

ఈ మధ్యనే హైద్రాబాద్ ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్మీద నిషేధాన్ని రద్దుచేసింది. అక్కడ సంస్థాన ప్రజల సంస్థను ఏవిధంగా నిర్మించాలో స్టాండింగ్ కమిటీ చర్చించింది.

ఇప్పుడు సంస్థానంలోవున్న సంస్థలన్నీ కాంగ్రెసులో లీనం అయిపొమ్మని వారు కోరారు. ఈ విషయమయి పనిచేసేటందుకు జయనారాయణ వ్యాస్, వర్గీస్గార్లను ఒక ఉపసంఘంగా నియమించారు.

తర్వాత స్టాండింగుకమిటీ రావి నారాయణ రెడ్డిగారిని పిలిచింది. (హైద్రాబాద్ ప్రజా సంస్థలలోకెల్లా పెద్దదయిన ఆంధ్ర మహాసభకి ఈయన అధ్యక్షులు. కమ్యూనిస్టు. ఈ సంస్థలో లక్షమంది సభ్యులున్నారు.) హైద్రాబాద్ విషయంలో ఆయన అభిప్రాయం అడిగేరు.

అన్నీ విని కమిటీ యిచ్చిన నిర్ణయం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆంధ్రమహాసభలోవున్న కమ్యూనిస్టులంతా ఇటు ఆంధ్ర మహాసభ నుంచో, అటు కమ్యూనిస్టుపార్టీ నుంచో రాజీనామా నివ్వాలట. అల్లా చెయ్యకపోతే మహాసభనుంచి సభ్యత్వం తొలగిస్తారట.

వీరి పంథా ప్రజాతంత్రానికి ప్రజా పోరాటానికి వ్యతిరేకం

సమావేశం యొక్క కార్యక్రమం అంతా బహు పెడసరంగా జరిగిపోయింది. అతి ప్రధాన సమస్యలమీద కూడా చర్చలు జరగలేదు సభ్యులలో ఒకరు రిపోర్టు ఇవ్వడం, అధ్యక్షులు ఉన్నపాటున తీర్మానం వ్రాయించెయ్యడం, అది ఏకగ్రీవంగా ఆమోదించబడిపోవడం - ఇదీ జరిగిన పద్ధతి.

అఖిల భారత సంస్థాన ప్రజా మండలి ప్రజా పోరాటాల విషయంలో తీసుకుంటూవున్న వ్యతిరేక దృక్పథానికి ఢుధ్గర్ (భావనగర్) స్వామి రామానందతీర్థ (హైద్రాబాద్) గార్లు ఒకమాదు అభ్యంతరంచెప్పారు దానితో పండిట్ నెహ్రూ "మీ పోరాటం కెవ్వరు అర్థం వస్తున్నారు?" అని దబాయించి నోరు కట్టేసారు.

ఢిల్లీలో జరిగిన జనరల్ కౌన్సిలు మీటింగులో సర్దార్ పటేల్ ఇచ్చిన ఉపన్యాసాన్ని స్వామిజీ జ్ఞప్తికి తెచ్చారు. "ఈ ఘటనలు జరగక పూర్వం చెప్పినదానికి ఆయన వంటావెందుకు?" అని డా॥ పట్టాభి సీతారామయ్యగారు షర్దివేశారు.

డా॥ పట్టాభిగారు చెప్పిన ఘటనలేవో స్పష్టంగాలేవు. కాని ఒక్కటి మాత్రము తేలిపోయింది. కాంగ్రెసు నాయకులు ప్రజామండలి నాయకులుకూడా సంస్థానాధీశులతో రాజీ బేరాలు సాగించేందుకు బాట వరిచేసుకుంటున్నారనీ, వారికి పోరాటాలు ఇష్టములేదనీ, అటికి పోరాటాన్ని లేపే శక్తులు కూడా సహించజాలరనీ స్పష్టపడిపోయింది.

పండిట్ నెహ్రూకీ, సంస్థానాధీశులకీ, నడుమ ఉత్తరప్రత్యుత్తరాలు నడుస్తూన్నట్లు రాజ్యాంగసభలో సంస్థాన ప్రజల ప్రాతినిధ్యం విషయమై వారు ఏదో ఒకవిధమైన "అంగీకారానికి" రాగల సూచనలున్నట్లు తెలుస్తూంది.

రమేశ సిన్హా

(7 వ పేజీ తరువాత)

(7) వినునూరి రామచంద్రారెడ్డి పెద్ద గుమాస్తా అనుముల రాంరెడ్డిని కొట్టారని. వినునూరి మొహర్రిర్పు సాక్ష్యాలు సేకరించబడి, ముఖ్య కార్యకర్తలపై నేరము స్థిరము చేయబడుచున్నది.

(8) వ్యవసాయము సాగించకుండాచేస్తున్నారని దువ్వం తాలుక్దారు రప్పించబడినాడు.

(9) సోమవారంనాడు కడవెండికి చేరుకున్న సర్కిల్ ఇన్స్పెక్టరు హిందూ, ముస్లిం విభేదాలు కల్పించ ప్రయత్నము చేస్తున్నారు.

(10) పోలీసు జవానులు వ్యక్తిగతంగా ప్రజలకు మరుగు మాటలుచెప్పి, ప్రజా ఉద్యమములో చీలికలు తెచ్చి విడివిడిగా దెబ్బతీయాలని ప్రయత్నములు చేస్తున్నారు.

సోమవారంనాడు 25 మంది రిజర్వు పోలీసులు, అశేరుమంతులు, 10 మంది కానిస్టేబిళ్ళు వాపసుచేయబడినారు. పోలీసు మొహతెమిం, వినునూరి రామచంద్రారెడ్డి కడవెండికి రాగలరని. వారు వచ్చినతర్వాత అమలులో పెట్టడానికి ప్లానులు సిద్ధము చేయబడుచున్నవని తెలిసింది.

హంతకులను నిర్బంధించుటకై ఎట్టిశ్రద్ధ తీసుకొనబడుటలేదు. హంతకులు స్వేచ్ఛగ తిరుగుచున్నారు. కొందరు కడవెండివచ్చి పోలీసులతో కలిసిమాట్లాడివెళ్ళిపోతున్నారు ఇది నేటి పరిస్థితి.

సంస్థానాధీశుల్ని సంతృప్తిపరచే విధానం దేశాని కరిష్టదాయకం

ప్రజాఉద్యమాలకు ఇది యుగసంధి

బ్రిటిష్ ప్రతిపాదనలను కాంగ్రెస్ అంగీకరించిన అంశంపై, పండిత నెహ్రూ విశేషులం సభలో అధికారయుతంగా వ్యాఖ్యానించారు.

వెంటనే అందుకు వ్యతిరేకంగా జిన్నా ఇలా ఒక ప్రకటన చేశారు.

"నెహ్రూ వ్యాఖ్యానం, బ్రిటిష్ ప్రణాళిక మూల సూత్రాలకే విరుద్ధం, ఆ ప్రణాళికను అంగీకరించిన, పార్టీల షరతులకు ప్రధానాంశాలకు ఆయన వ్యాఖ్యానం వ్యతిరిక్తమైనది."

బొంబాయిలో 26.27 తేదీలలో సమావేశం కానున్న ముస్లింలీగు కౌన్సిలు సమాలోచించి తగిన చర్య తీసుకుంటుందనికూడ జిన్నా బెదిరించారు. (జులై 13 ప్రకటన)

సంస్థానాధిపతుల భయం

సంస్థానాధిపతులు కూడ ఆందోళన చెందారు. భోపాలులో నరేంద్రమండలి అధ్యక్షుడు సంస్థాన మంత్రుల సభ నొకదానిని సమావేశపరిచారు. "బ్రిటిష్ ప్రతిపాదనలకు విరుద్ధంగా చేయబడే ప్రకటనలు విషమ పరిస్థితికి దారితీస్తాయి" అని ఆ సమావేశం భావించింది. (అ. ప్రె 15-7)

ఈ క్లిష్టపరిస్థితిని తప్పించు కొనేందుకు, బ్రిటిష్ ప్రభుత్వ మొక ఎత్తువేసింది. కన్సర్వేటివ్ సభ్యులతో ఒక ఒడంబడిక కు వచ్చింది. భారతదేశంపై పార్లమెంటులో జరగనున్న చర్చ కేవలం నామకఃమాత్రమే ఉండేట్లు ఏర్పరుచుకున్నారు. బ్రిటిష్ రాయబారులు భారతస్వాతంత్ర్యానికి పునాది వెయ్యడంలో చారిత్రక విజయం సంపాదించారని తరాతరి చెప్పడానికే ఆ చర్చను ఉపయోగించుకోవాలని బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించింది.

ఇలా అయితే సందేహాస్పదంగా ఉన్న అంశాలను స్పష్టపరుస్తూ ప్రకటన చేయవలసిన అవసరం తప్పుతుంది. సామ్రాజ్యవాదుల మే 16 ప్రణాళికను అమలుజరపడానికి, కన్సర్వేటివ్లు లేబర్ ప్రభుత్వము ఎలా చేతులు గలుపుతున్నారో గమనించదగిన విషయం.

పండిత నెహ్రూ ప్రకటనలు, జిన్నా బెదరింపులు పెరుగుతున్నా తమ ప్రణాళికను అమలుజరపగలమన్న ధీమా బ్రిటిష్ ప్రభుత్వాని కున్నట్లు కనిపిస్తుంది

మాటలు - చేతలు

భారత దేశంలోని పెట్టుబడి దారీ జమీందారీ వర్గాలకు ప్రతిబింబ ప్రాయమైన, సామ్రాజ్య వాదులతో రాజీపడాలనే విధానం, నెహ్రూ జిన్నాల ప్రకటనల వెనుక కనిపిస్తూనేఉంది. అందువల్లనే బ్రిటిష్ ప్రభుత్వానికి తన ప్రణాళికను అమలుజరపగలమనే ధీమాకలిగింది.

భారత రాజ్యాంగ నిర్మాణ సభను సర్వస్వతంత్రంగా చేయాలని నెహ్రూ అంటున్నాడు. "బ్రిటిష్ ప్రభుత్వం జమీందారీ వర్గాలను శాశ్వతంగా ఉంచాలనుకుంటే తీవ్రంగా కాంగ్రెస్ విరోధిస్తుంది"అంటాడు.

కాని, రాజ్యాంగసభకు నిల్చిన కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను చూచినట్లయితే, ఆయన ప్రకటనలోని బూటకం బయట పడుతుంది.

నెహ్రూ తీవ్రపదజాలానికి వ్యతిరేకమైన కాంగ్రెస్ నాయకత్వపు పంథా, సంస్థానాలనుగూర్చి కాంగ్రెస్ దృక్పథంలో మరింత స్పష్టంగాకనిపిస్తుంది

అఖిలభారత సంస్థాన ప్రజల మహాసభ స్థాయిసంఘంచేసిన నిర్ణయాలగూర్చి మరొకచోట (పక్కపేజీ) ప్రచురించాము. ఆసభకు నెహ్రూయే అధ్యక్షత వహించాడు.

సంస్థానాధిపతులను సంతృప్తిపరచడం. అన్నిసంస్థానాల్లోను బ్రహ్మాండంగా విజృంభిస్తున్న ప్రజాఉద్యమాలను విచ్ఛిన్నం చేయడం, ఆసభానిర్ణయాలకు మూలమాత్రంగా కనబడుతుంది.

రాజ్యాంగసభకు సంస్థానాధిపతులే ప్రతినిధులను నియమిస్తే కాంగ్రెస్ ఏంతమాత్రం అందుకంగీకరించదని నెహ్రూ అంటున్నారు కాని, అటువంటప్పుడు బ్రిటిష్ ఇండియాలోవలెనే సంస్థాన ప్రతినిధులు ఎన్నుకోబడాలని కాంగ్రెస్ కాని, సంస్థాన ప్రజామహాసభ గాని ఖచ్చితంగా కోరడంలేదు.

అంతేకాక సంస్థానాధిపతులకు అనుకూలంగా సంస్థాన ప్రజామహాసభ తన వాంఛను తగ్గించుకుంటూవచ్చింది.

సంస్థానంలోని ప్రతినిధి సంస్థలకు వయోజన ఓటింగుతో ఎన్నికలు జరగాలని 1939 సంస్థాన ప్రజామహాసభ తీర్మానించింది.

ఉదయపూర సమావేశంలో (1945 డిసెంబరు) 1935 ఇండియా చట్టంలో ఉన్నంతమటుకు ఓటింగుహక్కు కావాలని తమకోరికను తగ్గించుకొని తీర్మానించారు. వయోజన ఓటింగుహక్కు ఆచరణసాధ్యం కాదని భావించారు!

ఢిల్లీలో జరిగినస్థాయిసంఘసమావేశంలో అంతకన్న దిగిపోయారు. అత్యల్పమైన వోటింగు హక్కుతో ఎన్నుకోబడిన ఇప్పటి సంస్థాన శాసనసభలనుంచి, రాజ్యాంగసభకు ప్రతినిధులను ఎన్నుకోవచ్చునని తీర్మానించారు.

సంస్థానాధిపతుల ప్రణాళిక

అంతటోనైనా ఆగలేదు. అలా అందరు సంస్థాన ప్రతినిధులూ ఎన్నుకోబడాలి అన్న అంశం తీర్మానంలో స్పష్టీకరించనేలేదు. ఈ అంశాన్ని బుద్ధిపూర్వకంగా, రాజీరాయబారాలకు వీలుగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే అలా వదిలివేశారు.

జి. అధికారి

ఇప్పటి శాసనసభలనుండి సగంమంది ఎన్నుకోబడాలని, మిగత సగం మందిని తామే నియమించాలని, సంస్థానాధిపతులు సూచించినట్లు తెలియవస్తున్నది.

ఈ ప్రతిపాదనను, కాంగ్రెసు నాయకులు అంగీకరించేందుకు సిద్ధపడుతున్నట్లున్నది.

ఈ ప్రకారం ప్రతినిధుల నియామకం జరిగేట్లయితే, సంస్థాన ప్రజలకు సగం ప్రాతినిధ్యం లభించదు. ఇప్పుడున్న సంస్థాన శాసనసభలకు ఓటింగుహక్కు అత్యల్పంగా ఉంది. కాబట్టి ఆ సభలకు కావలసినంతమంది జోహుకుం వాలాలు ఎన్నుకోబడ్డారు.

నిరంకుశపాలన

సంస్థానాలలో నిరంకుశపాలనను నిర్మూలించాలన్న ప్రధానాంశం విషయంలోకూడా కాంగ్రెసు నాయకులు సంస్థాన ప్రజా మహాసభ కూడ అలాంటి రాజీపంథానే అనుసరిస్తున్నారు.

రాజు కేవలం నామమాత్రుడుగా ఉండి, సర్వహక్కులు ప్రజలకే ఉండాలని ఉపన్యాసాలలోను, ప్రకటనలలోను కాంగ్రెసు నాయకులు అంటారు. కాని, వయోజనుల ఓటింగు హక్కుపై ఎన్నుకోబడిన సంస్థాన ప్రజాపరిషత్తుతో ప్రతి సంస్థాన రాజ్యాంగ చట్టమూ నిర్మింపబడాలని, అందులో రాజుండాలా లేదా అన్న విషయం కూడ ఆ సభే నిర్ణయించాలని వీరెన్నడూ స్పష్టపరచడానికి పూనుకోలేదు.

దాద్యతాయుత ప్రభుత్వం తమ ఆదర్శమని అస్పష్టంగా నిర్వచించారు. "క్విట్ కాశ్మీర్" ఉద్యమంలోలాగా, కాశ్మీర శ్రీశ్రీ ప్రజానాయకులు రాజుల నిరంకుశ ప్రభుత్వానికి ఎదురొడ్డి సవాలుచేయడం జరిగితే ఈ నాయకులు కొప్పడుతూ చిన్నభిన్నంచేయడానికే ప్రయత్నిస్తున్నారు.

కమ్యూనిస్టు వ్యతిరేకత

సంస్థానాలలో ఉధృతమవుతున్న ప్రజా ఉద్యమాలను, నిరంకుశ ప్రభువులపట్ల సంధి టితవర్ధనం మానివేసి, అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ ఉద్యమ విజృంభణలో అత్యంత ప్రాముఖ్యం వహిస్తున్నారు కమ్యూనిస్టులు. సంస్థానాలలో రైతు కూలీ పోరాటాలకు నాయకత్వం వహించి, ప్రజామండలి పోరాటకష్టంలో ప్రథమశ్రేణిలో ఉన్న కమ్యూనిస్టులపై అపనిందలు మోపి, పదవులలో ఉండరాదని సంస్థలనుండి వెలివేస్తున్నారు.

ఇలా సంస్థాన ప్రజా ఉద్యమాలను నిషేధించడం, కమ్యూనిస్టులను వేరుపరచడం లాంటి విధానం. అటుకు సంస్థానాధిపతులు ప్రసాదిస్తున్న "నూతన సంస్కరణ"ల బూటకానికి సంస్థాన ప్రజలు తలవంచే స్థితికే దారితీస్తుంది.

ఈ సంస్కరణలన్నీ ఒకే మాదిరివే, అసెంబ్లీలలో సగంమంది నామినేటెడ్ సభ్యులు: అత్యల్పమైన ఓటింగు హక్కు: తొలగించడానికి వీలులేని ప్రభుత్వ కార్యవర్గం: బడ్జెట్ పై సర్వాధికారంలేకపోవడం ఈ అంశాలు అన్ని నూతన సంస్కరణల్లోనూ ఉంటున్నవి.

వీనికి అంగీకరిస్తే, నిరంకుశ ప్రభుత్వానికి అంగీకరించడమే అవుతుంది.

సంస్థానాల్లో నూతన చైతన్యం

నూతన యావద్భారత మహోద్యమ ప్రారంభ సమయంలో, 1938,39 కన్నా విశాలమూ మహత్తరమూ అయిన ఉద్యమం సంస్థానాలలో బయలుదేరుతుంది. అందుకు కాశ్మీరు ఉద్యమం నాందీమాత్రమే. అటో ఇటో తేల్చుకోవలసిన సమయమిది.

బ్రిటిష్ సార్వభౌమాధికారాలు అంతరించబోతాయని బ్రిటిష్ ప్రతిపాదనల్లో ఉన్నందువల్ల సంస్థానాధిపతులు కాంగ్రెసులో రాజీపడేందుకు సిద్ధంగా ఉంటారన్న పిచ్చి భ్రాంతితో కాంగ్రెసు నాయకులు తమ విధానాన్ని ఏర్పరుచుకుంటున్నారు.

సంస్థానాధిపతులను తృప్తిపరచి, రాజ్యాంగ నిర్మాణసభలో లీగుకు వ్యతిరేకంగా తమతో వారిని కూడగట్టుకొని రావలెనని కాంగ్రెస్ ఆశపడుతున్నది.

యదార్థ పరిస్థితులు అందుకు పరమ విరుద్ధంగా ఉన్నవి. కాంగ్రెస్ లీగు విభేదాలకు తోడు సంస్థానాధీశులు బ్రిటిష్వారు తమ ప్రణాళికను రుద్దడానికి చక్కటి సాధనాలుగా ఉపయోగపడుతారు.

సార్వభౌమాధికారాలు రద్దుపరుస్తామనడం కేవలం వంచించడానికే. 'స్వతంత్ర' సంస్థానాధిపతులు, బ్రిటిష్ ప్రభుత్వానికి వంచమాంగదళంగా పనిచేసేందుకు యూనియన్ ప్రభుత్వంలో కీలకస్థానా న్నిత్తై 'స్వతంత్ర' భారత ప్రభుత్వంతో రాయబారాలు సాగిస్తారు. ఆ స్థానంవారికి చిక్కకపోతే. యూనియన్లో చేరకపోయేందుకు వారికి హక్కుంది. భారతదేశంలో బ్రిటిష్ పరిపాలిత 'అల్స్టర్'రాజ్యాలుగానే సంస్థానాలుండిపోతాయి.

బ్రిటిష్ ఆఖరు పట్టు

ఎలాగైనా భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పెత్తనానికి సంస్థా

(మిగతా 10 వ పేజీలో)

జాగీర్దారుకు పోలీసుల అండ

ఖమ్మం, జూలై 22

మానుకోట తాలూకా ఆంధ్ర మహాసభ అధ్యక్షులు గండి మల్లికార్జునరావుగారు ఇలా వ్రాస్తున్నారు.

ఖమ్మం తాలూకాలో, తెల్లారుపల్లి ప్రజలు జాగీర్దారు దౌర్జన్యాలను ఎదుర్కొంటూ తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాడుతున్నారు.

ఈ జాగీర్దారుకు ప్రభుత్వ పోలీసులఅండ పూర్తిగా ఉన్నందున, జాగీర్దారులో హింసాకాండ మితిమీరుతోంది. ఈ మధ్య గ్రామంలో 6 గురు రిజర్వు పోలీసులు ఉంచబడ్డారు. ఫ. 2-10-1355 ఫసలీ తేదీన ఒక రైతు అనాదినుంచి తన భుక్తంలో ఉన్న భూమిని సేద్యం చేసుకోడానికి వెళ్తాంటే, జాగీర్దారు మనుష్యులు భూమిమీద దాడి చేశారు. అక్కడున్న రిజర్వు పోలీసులు వారికి సహాయంగా వచ్చి, రైతును చెడగొట్టారు. ఫ. 6-10-1355 న రైతులు తమ సొంత పొలంలో పశువుల్ని మేపుకొంటూంటే, రిజర్వు పోలీసులు రైఫిళ్ళతో వచ్చి, కాపర్లను కొట్టి. పశువుల్ని బందెల దొడ్డికి తోలుకువెళ్ళారు.

మరొక రోజున రిజర్వు పోలీసులు తప్పత్రాగి, ఇద్దరు గ్రామస్థుల్ని అడ్డగించి, "మీరు జాగీర్దారుకు వ్యతిరేకమా?" అంటూ తిట్టి కొట్టారు. మరొక రోజున పొలాలకు వెళ్లే పశువుల్ని అడ్డగించి, మద్దెలపల్లి, తల్లంపాడు గ్రామాల బందెలదొడ్డిలో పెట్టారు. కాపర్లకు రైఫిల్లు చూపి భయపెట్టారు. ఇది యేమి అన్యాయమని అడిగితే మా అధికారి (అసిస్టెంటు డి. ఎస్. పి.) చెప్పినాడని బదులుచెప్పారు.

రైతులు ఒకసారి అసిస్టెంటు డి.ఎస్.పి. సమక్షంలో జాగీర్దారుకు పన్నులు చెల్లిస్తున్నారు. ఉద్యోగస్థులు తప్పుడు రశీదులిస్తూంటే, అసిస్టెంటు డి. ఎస్. పి. జాగీర్దారు మనుష్యుల్ని మందలించడానికి బదులు రైతుల్ని మందలించాడు:

"రశీదు లెట్లా యిస్తేనేం? నేను ఉన్నానుగదా శిస్తులు కట్టండి" అని దబాయించాడు.

రిజర్వు పోలీసుల అక్రమాలను అరికట్టవలసిందని కోరుతూ, రైతులు అసిస్టెంటు ఎస్. పి. కి వ్రాతమూలకంగా అర్జీపెట్టు కున్నారు. దానిపై ఆయన "మీరు జాగీర్దారుతో రాజీపడండి:"అని సెలవిచ్చాడు.

వెంటనే ప్రభుత్వం యీ రిజర్వుపోలీసులను తొలగించి ప్రజల్లో శాంతిభద్రతలను స్థాపించడం అవసరం.

లలితకళలద్వారా ప్రజాతంత్ర శక్తుల్ని బలపర్చాలి

ఫ్రెంచి విజ్ఞానవేత్తల మహాసభలో ప్రముఖుల ప్రసంగాలు

ఫ్రెంచి వార్తాపత్రికలన్నింటికి ఇటీవల 'అటంబాంబు పిచ్చి' మహా జాస్తీగా పట్టుకుంది. పత్రికా రచయితల దృష్టిలో 'అటంబాంబు' ముందు తదితర విషయాలన్నీ అతి హీనంగా కనిపించాయి. గోరంతలు కొండంతలు చేసి, దాన్ని తెగ పొగిడారు. సృష్టినంతా అది ఒక్కసారి తల్లక్రిందులు చేస్తుందని భావించారు. కాని మొన్న పసిఫిక్‌లో జరిగిన అటంబాంబు ప్రయోగంతో వారి కలలన్నీ కల్లలయ్యాయి. అందులో లోకాతీతమైన శక్తి ఎక్కడా గోచరించలేదు. అయినా, కొత్తగా కనిపెట్టిన ఈ పరమాణుశక్తి ఎంతో మహత్తరమైనదనే విషయం అందరు అంగీకరించినదే. ఇటువంటి అమూల్యశక్తిని ప్రపంచ శ్రేయస్సుకోసం కాకుండా ప్రపంచ వినాశం కోసమే ఉపయోగించడం ప్రజలందరికి అందుబాటులో లేకుండా కొద్దిమంది దురహంకార పూరితులైన స్వార్థపరులు తమ గుప్పిటలోనే అట్టిపెట్టుకోవడం - ఫ్రెంచి మేధావులందరికి ఆగ్రహకారణం అయింది.

నాజీ ఆక్రమణలో ఫ్రెంచి విద్యావంతులు

నాజీఆక్రమణలో ఫ్రెంచి విద్యావంతులు అనేక కష్టనష్టాలకు గురిఅయ్యారు. ఫాసిస్టు రాక్షసుల పాదఘాతాల క్రింద పడి, నలిగిపోతూఉన్నా, ఫ్రెంచి విద్వాంసులు, చిత్రకారులు, కవులు, గాయకులు, తమ ధైర్యస్థైర్యాల్ని కోల్పోలేదు. తమ కర్తవ్యాన్ని విస్మరించలేదు. మాతృదేశ స్వాతంత్ర్య సంపాదనార్థం తమ ప్రాణాల్నికూడా తృణప్రాయంగాఎంచి, నాజీసైన్యాన్నిఎదిరించారు. మూలమూలలకు, పల్లెపల్లెలకు వెళ్లి ప్రతి ఒక్కరి హృదయంలో స్వాతంత్ర్యాగ్ని రగుల్కొల్పారు. దేశభక్తిని రేకెత్తించారు. కలంతో, కత్తితో, రణరంగంలో వీరవిహారం చేశారు. దేశంకోసం అనేకమంది తమ రక్తాన్ని ధారపోశారు. తుదకు నాజీమూకల్ని తరిమికొట్టారు. మాతృదేశాన్ని రక్షించుకున్నారు. తిరిగి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించుకోగలిగారు.

ఈ నాటివిషమ పరిస్థితి

మళ్ళీఈనాడు ప్రజా విద్రోహశక్తులు విజృంభిస్తున్నాయి. మారణయంత్రాల రణగొణధ్వని దారుణంగా వినపడుతూఉంది. ఇలాటి విషమ పరిస్థితుల్లో అలాంటి ఉత్తమ సాంప్రదాయాలు కలిగిన ఫ్రెంచి విద్యాధికులు ఊరికే చేతులు ముడుచుక్కూర్చుంటారా? ప్రజాద్రోహుల ఆటల్ని అరికట్టవలసిందని శాంతి ప్రియులైన ప్రపంచ ప్రజలందరికి ఎలుగెత్తి చాటుతున్నారు. అభ్యుదయ శక్తులన్నింటినీ కలిపి ఒక బలవత్తరమైన సంయుక్త సంఘటనను నిర్మిస్తున్నారు.

అటంబాంబును గురించి ప్యారిస్ పత్రికలు చిత్రవిచిత్రాలైన కథలెన్నో అల్లి పేజీలకు పేజీలు నలుపు చేశాయి. కాని ప్లెయిల్ హాల్లో జరిగిన ఫ్రెంచి విద్యాధికుల సమావేశాన్ని గురించి వివరాలు ఇవ్వడానికి మాత్రం వాటికి చేతపోయింది. ఈ మహాసభ జరుగుతూండగా చూచినవారికే ఈ చారిత్రాత్మక సమావేశంయొక్క ప్రాముఖ్యత బోధపడుతుంది.

ఈ మహాసభ ఫ్రెంచి విద్యావంతుల సంఘ యాజమాన్యాన జరిగింది. నాజీ ఆక్రమణ సమయంలో ఈ సంఘం నిర్మింపబడి రహస్యంగా పనిచేసింది. దీని శాఖలు త్వరలోనే దేశమంతటా వ్యాపించాయి.

వివిధ మతాలకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పండిత శ్రేష్ఠులు విజ్ఞానవేత్తలు చిత్రకారులు, ఉపాధ్యాయులు, నటకులు, గాయకులు అందరు ఈసంఘంలో అంగంగా ఉన్నారు. ఫ్రెంచి రాజకీయాల్లో ఈసంఘం ఒక బలవత్తరమైన శక్తిగా పరిణమించింది.

సుప్రసిద్ధ రచయిత జార్జిడుహామెల్, పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్ డైరక్టరు కేథలిక్ ట్రిపోల్, ఫ్రెంచిజాతీయ రచనా మండలి కార్యదర్శి లూయీ అరగాన్ (జగత్ప్రసిద్ధ సర్రియలిస్టు (ప్రస్తుతం కమ్యూనిస్టు) విఖ్యాత నటకుడు లాంకిన్, సుప్రసిద్ధ సైంటిస్టు ఫ్రెడరిక్ జోలియో క్యూరీ మొదలైన ప్రముఖులందరు ఈ సంఘంలో సభ్యులయ్యారు. ఫ్రెంచి మేధావంతుల్లో ఐక్యతను సాధించడం, లలితకళల్లో నూతన వికాసం తీసుకురావడం, దేశమంతటా శాంతిసౌఖ్యాల్ని చిరస్థాయిగానెలకొల్పడం, కొత్త కొత్త స్వరూపాలు ధరిస్తూన్న ఫాసిజాన్ని సమూలంగా నిర్మూలించడం - ఈసంఘ ఆశయాలు.

ఈసమావేశానికి హాజరయిన ప్రతినిధులందరు వివిధరాజకీయ పక్షాలకు చెందినప్పటికి పై సిద్ధాంతాల్ని ఏకగ్రీవంగా అంగీకరించారు. ఫ్రాన్సు చరిత్రలో ఇది ఒక అపూర్వ ఘట్టం.

పరమాణుశక్తిని ప్రజోపయోగం కోసం ఉపయోగించి ప్రపంచమంతటా శాంతిని నెలకొల్పాలని విజ్ఞానవేత్తలు సూచించారు.

ఈ సమావేశంలో ప్రొఫెసర్ లాంగ్విన్ ఇలా చెప్పారు.

"పరమాణుశక్తిని రహస్యంగా అమెరికా తనగుప్పెటలోనే అట్టిపెట్టుకోవడం ప్రపంచ శాంతికే ప్రమాదకరమనీ, పరమాణుశక్తి రహస్యాన్ని ప్రతిదేశానికి తెలియజేయాలి అని అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ సైంటిస్టు ఇచ్చిన సూచనను మనం పూర్తిగా బలపరచాలి."

లలితకళలద్వారా ప్రజాతంత్ర శక్తులకు చేయూత

"లలితకళలద్వారా మనం ప్రజాతంత్ర శక్తులకు అన్ని విధాలా తోడ్పడాలి. ఏ స్వరూపంలో ఉన్నా, ఏ మారుపేరు పెట్టుకున్నా, ఫాసిస్టు శక్తుల్ని తీవ్రంగా ఎదిరించాలి." అని ఈ సమావేశానికి హాజరయిన నటకులు, చిత్రకారులు, కవులు, గాయకులు ఉపన్యసించారు.

జర్మనీ ఓడిపోయినా, జాతిదురహంకారం ఇంకా బ్రతికే ఉంది. ముఖ్యంగా జర్మనీ, బ్రిటన్, అమెరికా దేశాల్లో ఇది మనకు స్పష్టంగా కనపిస్తుంది. ఫ్రాన్సులోకూడా ఇంకా ఈ స్వాతిశయం పూర్తిగా నశించలేదు. ఈ జాతి దురహంకారమే ఆర్థిక పెత్తనానికి దారితీస్తుంది అనే విషయం మనం మరచిపోగూడదు అని ప్రొఫెసర్ రెనాన్ మాట్లాడారు.

యూదు వ్యతిరేకత కమ్యూనిస్టు వ్యతిరేకత, సోవియట్ వ్యతిరేకత అనే సాకులతోనే ఇదివరకు ఫాసిస్టుశక్తులు బలపడ్డాయి ఇప్పుడు మళ్ళీ అదే ఆయుధాన్ని ఉపయోగించి బలపడాలని చూస్తూఉన్నాయి. యీ విషయంలో ప్రపంచ ప్రజలందరు సావధానంగా ఉండాలి అని గాన్‌కోర్టు బహుమతి బడసిన సుప్రసిద్ధ రచయిత ఎల్సాట్రియొలెట్ మాట్లాడింది.

ప్రజాద్రోహులను క్షమించకూడదు

నాజీశక్తులతో గూడుపుఠాణీ జరిపిన వ్యక్తుల్ని క్షమించరాదనీ, ప్రజాద్రోహుల్ని క్షమించడం మహాపరాధం అని చెప్పిన ఎల్యూర్ సూక్తిని మరువగూడదని పత్రికా సంపాదకుల్లో ప్రముఖుడైన క్లాడ్ మోర్గన్ ప్రసంగించారు.

"నాజీ ఆక్రమణ సమయంలో కేథలిక్కులనుంచి కమ్యూనిస్టుల వరకు, ఉత్తమ దేశభక్తులందరూ - భుజం భుజం కలిపి పోరాడారు. అదేవిధంగా నేడుకూడా మనమందరం కలిసి అభివృద్ధి నిరోధక శక్తుల్ని ఎదిరించాలి" అని లూయీ అరగాన్ మాట్లాడుతూంటే, కరతాళ ధ్వనులు హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

ఈ సమావేశంలో వివిధ రాజకీయ పక్షాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనడంచేత, అందరూ ఒకే ఆదర్శంతో ఒకే లక్ష్యంతో, ఒకే ఉత్సాహంతో మాట్లాడకపోవడం సహజమే. ఇందుకు ప్రధాన కారణం, రానున్న మహాప్రమాదాన్ని అందరూ స్పష్టంగా గుర్తించలేకపోవడమే. అయినా ప్రధాన సిద్ధాంతాల్లో ప్రజాస్వామిక సూత్రాల్లోగానీ, ఫాసిజాన్ని ఎదుర్కోవడంలోగానీ, ప్రపంచ శాంతికోసం సర్వశక్తులు ధారపోసి పాటుపడడంలోగాని ఎవరికీ ఎటువంటి అభిప్రాయ భేదాలు లేవు.

అభ్యుదయ కాముకులైన ప్రపంచ మేధావులందరితో ఈసంఘం సన్నిహితసంబంధం ఏర్పరచుకోవాలనీ, ఈ సంవత్సరములోనే ప్రపంచ విద్యాధికుల ప్రథమ సమావేశం జరపాలనీ ఈ సభలో నిర్ణయించబడింది.

(న్యూస్ అండ్ వ్యూస్ ఫ్రం ది సోవియట్ యూనియన్ నుండి)

పుస్తకం రాయడం అంటే బిడ్డను కనడం వంటిది

— ఇల్యా ఎహరెంబర్[illegible]

ఇటీవల సుప్రసిద్ధ సోవియటు రచయితలు ఇల్యా ఎహరెంబర్గ్, కాన్‌స్టాంటిన్ సిమనోవ్, ప్రవ్దా మిలిటరీ విలేఖరి మైకేల్ గలాక్టియనోవ్ అమెరికా వెళ్ళారు. ఒక నాడు కొంతమంది అమెరికన్ రచయితలు ఎహరెంబర్గును కలుసుకొని, కొన్ని ప్రశ్నలు వేశారు.

పుస్తక రచనను గురించి ఒక ప్రశ్నకు జవాబుచెబుతూ, ఎహరెంబర్గ్ ఇలాఅన్నారు

"పుస్తక రచన బిడ్డను కనడం వంటిది. మానవ జీవితంతో పెనవేసుకున్న కృషి. అది నిర్జీవములైన అంకెలను కూడడం వంటిదికాదు. అది చైతన్యవంతమయిన ప్రాణుల ఉత్పత్తివంటిదేకాని, యంత్రాలవల్ల జరిగే వస్తూత్పత్తి వంటిదికాదు.

"టాల్‌స్టాయ్, డోస్టవ్‌స్కీ (సుప్రసిద్ధ రష్యన్ రచయితలు) వంటి వారింతవరకు సోవియటులో జన్మించలేదేమి అని ఒక మిత్రుడు నన్నడిగాడు. నేనుచెప్పినజవాబిది- బ్రహ్మాండమైన మా సోవియటు విప్లవానికి మేమింకా చాలాచేరువగానే ఉన్నాం. మొన్నటి ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం మా తలపుల్లో ఇంకా కొత్తగానే ఉంది. ఈ అనుభవాన్నంతా పూర్తిగా జీర్ణం చేసుకోవడానికి శాస్త్రరీత్యా అయినా, కొంత వ్యవధి కావాలి. ఉదాహరణకు రష్యాపై నెపోలియన్ దండయాత్ర చేసిన తరువాత 50 సంవత్సరాలకుగాని టాల్‌స్టాయ్, ఆ ఘటనలను చిత్రిస్తూ తన "వార్ అండ్ పీస్" (యుద్ధము - శాంతి) అనే నవలను రాయలేకపోయాడు.

"ఇది విని ఆ మిత్రుడు ఇలా అన్నాడు. నిజమే. కాని ఆధునిక యుగంలో కాలం మునుపటికన్నా ఎంతో వేగంగా సాగిపోతూందికదా? అనుభవాలను ఎంతో తొందరగా జీర్ణం చేసుకుంటున్నాం కదా?

"నేనతనికి యిలా జవాబు చెప్పాను— నేటి స్త్రీ తన అమ్మమ్మకాలంలో కన్నా ఎంతో వేగంగా ప్రయాణంచేయ గలుగుతూంది. రైల్లో అయితే గంటకు 70 మైళ్ళ చొప్పునా, విమానంలో గంటకు రెండు వందల మైళ్ళచొప్పునా, ప్రయాణం చేయగలదు. కాని ఒక బిడ్డను కనడానికి ఆ అమ్మమ్మ కెంతకాలం పట్టిందో, నేటి స్త్రీకీ అంతేకాలం పడుతుంది. నవ మాసాలూ తప్పకుండా కావాలి కదా?"

(అమెరికన్ డెయిలీ వర్కర్ నుండి)

(9 వ పేజీ తరువాయి)

వాదివతులు ఆఖరు ప్రాపుగా ఉంటారు. వారితో రాజీపడడం సామ్రాజ్యవాదంతో రాజీ పడడమవుతుంది. సంస్థాన ప్రజల స్వతంత్ర పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడంకాగలదు.

తొమ్మిది కోట్ల సంస్థాన ప్రజల పోరాటం కఠినతరమైనదీ, తీవ్రతరమైనదీ కాక తప్పదని కమ్యూనిస్టుపార్టీ హెచ్చరిస్తున్నది.

నిరంకుశ ప్రభుత్వ నిర్మూలనకు, ప్రజల సర్వ స్వతంత్ర హక్కుల రక్షణకు, సంపూర్ణ ప్రజాస్వామ్యపు జీవిత స్థాపనకు అనుకూలమైన కార్యక్రమాన్ని ఆధారముగా చేసుకొని సర్వ ప్రజానీక సంయుక్త ప్రతిఘటన అవసరం.

ఈ సంయుక్త ప్రతిఘటనకు పోరాటాన్ని నిర్మించడంలో సంస్థాన ప్రజామండలి, కాంగ్రెసులాంటి సంస్థానాలలోని ప్రజా సంస్థలు నిర్వహించవలసిన పాత్ర మహత్తరమైనది.

ఆ పాత్ర సరిగా నిర్వర్తించాలంటే, నేటి నాయకుల రాజీ విధానం, విచ్ఛిన్నకర పంథా పరాజితం కావాలి. అప్పుడే అది సాధ్యము కాగలదు. కార్మిక, కర్షక పోరాటాలను అభివృద్ధిపరిచే, ప్రజాస్వామ్య హక్కుల పోరాటాలలో ముందంజవేస్తూ, కర్షక కార్మికుల స్వతంత్ర వర్గ సంస్థలను నిర్మిస్తూ, ప్రజాసంస్థలద్వారా మొదలెగని కృషిచేస్తూ, ఎంతవరకు సంస్థానాలలోని కమ్యూనిస్టులు అగ్రగమించగలరో, దానిమీదనే, ఈ సంయుక్త ప్రతిఘటనకై వారు చేయగల సహాయం ఆధారపడి ఉంటుంది.

పురుషునితో స్త్రీకి సమాన హక్కులు

అవసరమని అఖిలభారత మహిళాసభ ప్రణాళిక

ఐక్యరాజ్యసమితి ప్రథమ సమావేశంలో 9 దేశాల ప్రతినిధులు నేటి సమాజంలో స్త్రీలు పడుతూఉన్న అవస్థల్ని గురించి, చర్చించారు. అన్ని దేశాలముందు ఉంచవలసిన స్త్రీల హక్కుల్నిగురించి ఆలోచించారు. భారతీయ మహిళా సంఘంవారు సమర్పించిన చిత్తు ప్రణాళిక ఈ విషయంలో వారికెంతో తోడ్పడింది.

అఖిలభారత మహిళా మహాసభాధ్యక్షురాలు హంసా మెహతా, మాజీ అధ్యక్షురాలు రాజకుమారి అమృతకౌర్, మహిళా మహాసభ తరపున ప్రకటింపబడే "రోషనీ" పత్రిక సంపాదకురాలు లక్ష్మీ మీనన్‌గార్లు కలిసి ఈచిత్తు ప్రణాళికను తయారుచేశారు. స్త్రీల ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక హక్కులకోసం అఖిలభారత మహిళా మహాసభ తీవ్రంగా కృషిచేస్తూఉంది. ప్రతి సమావేశంలోను ఈ హక్కుల్నిగురించి తీర్మానాలు జరుగుతూఉన్నాయి. ఇంతవరకువచ్చిన అనుభవాన్నిబట్టి, ఇన్నాళ్ళనుంచి చేస్తూఉన్న తీర్మానాల్నిబట్టి, మహాసభ ఏ ఆశయాలకోసం ఆందోళన చేస్తూఉందో విపులంగా తెలియజేయడం అవసరం అవుతుంది.

స్త్రీల హక్కుల్నిగురించి, స్త్రీలు నిర్వహించవలసిన కర్తవ్యాల్ని గురించి పైన చెప్పిన చిత్తు ప్రణాళికలో ఏ యే విషయాలున్నాయో సంఘసభ్యు లందరితోపాటు ప్రజలందరికి కూడా తెలియజేయడం అవసరం.

పురుషులతోపాటు సమానత

"పురుషులతోపాటు స్త్రీలకుకూడా అన్ని విషయాల్లో సమాన హక్కులుండాలి" ఇదే మొదటినుంచి సంఘంయొక్క ప్రధానాశయం. ఈ ప్రధాన సూత్రంమీదనే ఆధారపడి "పురుషులతోపాటు అన్ని విషయాల్లో సమానంగా అభివృద్ధి చెందడానికి స్త్రీలకుకూడా సమానావకాశాలు కలిగించాలనీ, అప్పుడే స్త్రీ స్వతంత్ర భారత దేశాభ్యుదయానికి, నూతన ప్రపంచ నిర్మాణానికి, అన్నివిధాల తోడ్పడగలదనీ" పై చిత్తు ప్రణాళికలో సూచింపబడింది.

న్యాయస్థానాల్లో, అధికార పదవుల్లో, వృత్తి వ్యాపారాల్లో స్త్రీలకుకూడా సమాన హక్కులు కావాలని పై ప్రణాళికలో స్పష్టముగా తెలియజేయబడింది.

భారతదేశానికి వయోజనవోటింగు కావాలనీ, పురుషులతోపాటు స్త్రీలుకూడా ఎన్నికపదవు లన్నింటికి ఎన్నుకోబడే అవకాశం కలిగించాలనీ, మహిళా మహాసభ 1932 నుంచి ఆందోళన చేస్తూనేఉంది. ఇదే విషయాన్ని మహాసభ ప్రతినిధులు రౌండు టేబుల్ కాన్ఫరెన్సు సందర్భంలోకూడా స్పష్టంగా వెల్లడిచేశారు.

ఇదేవిషయాన్ని చిత్తుప్రణాళికలో మళ్ళీ తెలియజేయబడింది. కాని, ఇందులో 18 సంవత్సరాలు వెళ్లినవారందరికీ వోటు ఉండాలి అనేదానికి బదులుగా, 21 సంవత్సరాలు వెళ్లినవారికే వోటు అని సూచించబడింది.

ప్రాథమికవిద్య

స్త్రీ విద్యనుగురించి మహాసభ మొదటినుంచి పనిచేస్తూనేఉంది. బాలబాలికలకు ఉచితంగా విద్యనేర్పాలి. దేశమంతటా ప్రాథమికవిద్యను తప్పనిసరిగా (కంపల్సరీ) చేయాలి. భారతీయ బాలబాలికలందరికి వ్యాయామానికి సంబంధించిన శిక్షణ 7 సంవత్సరాలు) కూడా ఉండాలి. సార్జెంటు స్కీమును బలపరచాలి.

ప్రణాళిక రెండవభాగంలో కార్మికస్త్రీల హక్కుల్నిగూర్చి వివరించబడింది. ఉపాధ్యాయ వర్గంతోపాటు, కార్మిక స్త్రీలకుకూడా అవసరమైన సదుపాయాలన్నీ కలిగించాలి.

చేసిన పనినిబట్టి జీతం ఇవ్వాలి. ఒకే పనికి జీతాల్లో హెచ్చుతగ్గులు ఉండగూడదు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సౌకర్యాలుండాలి. పాలు సప్లయిచేసే మిల్క్ క్యాంటీన్లు, పిల్లల్ని పెంచడానికి క్రెచెస్ ఏర్పాటుచేయాలి. పసిపిల్లల తల్లులచేత, గర్భిణీ స్త్రీలచేత కష్టమైన పనులు చేయించగూడదు.

గృహిణి హక్కులు

కార్మిక స్త్రీలహక్కుల్ని గురించి ఈ చిత్తు ప్రణాళిక మరో అడుగు ముందుకు వేసింది. పురుషుడు చేసే పనికి ఎంత ప్రాముఖ్యత వుందో, ఇండ్లలో ఇల్లాలు చేసే పనికి కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. చీకటితో లేచి మళ్లీ చీకటిపడ్డదాకా పనులన్నీ చక్కబెట్టే భార్యల శ్రేయస్సును గురించి ఇంతవరకు చాలా అశ్రద్ధ చేయబడింది. సెలవులు లేకుండా, విసుగువిరామం లేకుండా, ప్రతి రోజు పనిపాటలు చేస్తూ ఉండే గృహిణికి కుటుంబాదాయంలో ఏమాత్రమూ అధికారం లేదు. కాబట్టి కుటుంబాదాయంలో కొంత భాగం భార్యలకు కూడా చెందాలిఅనీ, ఇన్స్యూరెన్సు వగైరా సౌకర్యాలు భార్యలకి కూడా కలిగించాలనీ ఈ ప్రణాళికలో తెలియజేయబడింది.

న్యాయశాస్త్రరీత్యా పురుషులకు స్త్రీలకు సమానావకాశాలు కలిగించడంతో పాటు పరంపరాగతంగా వస్తూఉన్న కొన్ని దురాచారాల్ని కూడా అరికట్టడానికి మహిళామహాసభ మొదటినుంచి పాటుపడుతూనేవుంది. వివాహ చట్టంలోని కొత్త మార్పుల్ని చిత్తు ప్రణాళిక పూర్తిగా బలపరచింది.

వివాహ చట్టం

హిందూ న్యాయశాస్త్రంలో ప్రవేశపెట్టబోయే కొత్త మార్పుల్ని గురించి ప్రజాభిప్రాయం తెలుసుకోడానికి హిందూలా కమిటీ దేశం అంతటా పర్యటన చేస్తూఉన్న సమయంలో, మహిళామహాసభ ఎంతో వ్యతిరేకతను ఎదుర్కోవాలిసి వచ్చింది.

కరుడుగట్టిన ఛాందసులు, సనాతనులు దీన్ని వ్యతిరేకించారంటే, పెద్ద ఆశ్చర్యమేమీలేదు. కాని, దేశభక్తులు, జాతీయవాదులు అనుకునే వారుకూడా వివాహ చట్టాన్ని మార్చడానికి వీల్లేదంటూ తీవ్రంగా ఎదిరించారు. కమిటీ ముందు సాక్ష్యం ఇవ్వదలచుకున్న స్త్రీలమీద కొన్ని ప్రదేశాల్లో బడితలుకూడా ప్రయోగించారు.

ఇలాంటి కష్టాలు ఎన్ని ఎదుర్కొంటున్నా, మహాసభ ప్రతినిధులు ధైర్యంగా నిల్చి తమ కర్తవ్యాన్ని నిర్వహించారు. చిత్తుప్రణాళిక తయారుచేశారు. బహుభార్యాత్వం పనికిరాదనీ, (ఒక భార్య ఉండగా మరో పెండ్లి చేసుకోవడం) పెండ్లికి కుల, మత భేదాలు అడ్డురాగూడదనీ, వధూవరుల ఇష్టంలేకుండా బలవంతపు పెండ్లిండ్లు జరగవనీ, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో (హింసించడం, మూడు సంవత్సరాలపాటు ఒకరిని ఒకరు విడిచిపెట్టి వేరే ఉండడం, దీర్ఘవ్యాధులు, [illegible] ఉండడం) విడాకుల హక్కు ఉండాలనీ ఈ ప్రణాళిక స్పష్టం చేసింది.

కుటుంబంలో ఒకళ్ళు యజమానిగాఉండి, మిగతావాళ్ళంతా అతనికి బానిసలుగా ఉండే పద్ధతి పోవాలనీ, సమానహక్కులు గలిగిన సభ్యుల పరస్పర సహకారంతోనే నిజమైన కుటుంబం ఏర్పడుతుందనీ ప్రణాళికలో సూచింపబడింది.

స్త్రీల కర్తవ్యం

ప్రణాళికలో 'స్త్రీల కర్తవ్యాన్ని' గురించి ఉన్న చివరటి భాగం "దేశంలో ప్రమాదపరిస్థితులు ఏర్పడినప్పుడు స్త్రీలుకూడా ముందుకు రావాలి, ఉత్తమ పౌరులుగా జీవించడానికి కావలసిన శిక్షణను స్త్రీలు తమంతట తామే అలవర్చుకోవాలనీ" చాలా అస్పష్టంగా చెప్పబడి ఉంది.

మహిళామహాసభ కోర్కె ప్రధానాశయాలే ఇంతవరకు సిద్ధించలేదు. ప్రధానాశయాల కోసమే ఇంకా పోరాటం జరగవలసిఉన్న ఈ సమయంలో, ఈ అస్పష్టత సహజమే అనిపిస్తుంది.

మొత్తంమీద యీ చిత్తుప్రణాళిక మహిళా సంఘాలన్నిటికి మార్గదర్శకంగా ఉంది. స్త్రీలహక్కుల విషయంలో రాష్ట్రీయమంత్రివర్గాలకు ఇది ఎంతో తోడ్పడుతుంది. ఈ ప్రణాళికను గురించి ప్రతి మహిళాసంఘం, ప్రతిపౌరుడు శ్రద్ధగా ఆలోచించాలి. ఇందులోని ప్రధానాశయాల్ని తీవ్రంగా ప్రచారం చెయ్యాలి. ఈ ప్రణాళికలోని ప్రధాన సూత్రాలమీద ఆధారపడి సమగ్రమైననివేదికల్ని తయారుచేయాలి.

— పీపుల్స్‌ఏజ్ నుండి

హైద్రాబాదు సంస్కరణలు

(6 వ పేజీ తరువాయి

శాసనసభలో చాలామంది నామినేటు చేయబడినవారుగాఉండటము, 10039 కిమంది అయిన ప్రజాసామాన్యానికి చాలాతక్కువ ప్రాతినిధ్యం ఉండటము, 100 9 5 గురైన జాగీర్దార్లు, జమీందార్లకు, షావుకార్లకు ఎక్కువ ప్రాతినిధ్యం ఉండటం, మాట అటుంచి, అసెంబ్లీకి ఉన్న అధికారాల విషయంచూదాం. శాసనసభ ఒక అలంకారప్రాయం మాత్రమే. సర్ఫెఖాను, పాయిగాలు, మిలటరీ పోలీసు, ఇతరరాష్ట్రాలు, భారత ప్రభుత్వంతో సంస్థాన సంబంధాలు మొదలైన ముఖ్యవిషయాలనుగూర్చిశాసనసభలో నోరుఎత్తడానికి వీలులేదు. ఇట్టివిషయాలు 17.

[illegible], ప్రభుత్వోద్యోగులు, పన్నులు ప్రజాశాంతిని కాపాడుట మొదలగు 14 విషయాల్లో ప్రభుత్వం బిల్లులు ప్రవేశపెడితే, దానిమీద మాట్లాడవచ్చును. అంతే.

53 చిన్నచిన్న అప్రధాన విషయాలపై బిల్లులు, తీర్మానాలు, ప్రశ్నలు ప్రవేశపెట్టడానికి మాత్రం శాసనసభ్యులకు అవకాశమివ్వబడింది.

పై సంకుచిత హద్దులలో సైతం అసెంబ్లీ చేసిన తీర్మానాలను ప్రభుత్వం తోసివేయవచ్చును. అసెంబ్లీ అంగీకరించని విషయాలను సర్టిఫై చేయవచ్చును.

బడ్జెటు

ప్రభుత్వం బడ్జెటును ప్రవేశపెట్టుంది. శాసనసభ వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం దానిని సర్టిఫై చేయవచ్చును.

పై సంస్కరణలు వచ్చుటవలన హైద్రాబాదు రాష్ట్రపు రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితియందెట్టి మార్పు రాదు. స్వల్ప అధికారమునైనను ప్రజల చేతికివ్వబడలేదు. ఉన్న చోటనే ఉంటుంది. జాగీరుదార్లు, జమీందార్లు దేశముఖులు వారి దోపిడీవిధానం వారికి రక్షణగానున్న నిరంకుశ పరిపాలకవర్గం, ప్రజలపైనున్న పన్నులభారం ఉన్నదున్నట్టుగానే ఉంటుంది.

ఈ సంస్కరణలయందున్న ప్రజాస్వామికము నామమాత్రమైంది. ప్రజలకు ప్రాతినిధ్యములేదు. ఓటింగు అధికారము లేదు. ఈ సంస్కరణలు జిన్నాగారి సలహాపై నడిచే అభివృద్ధినిరోధక ముఠాయైన అంజుమన్ ఇత్తెహాదుల్ ముసల్మీను నాయకుల్ని సంతృప్తిపరచవచ్చునుగాని, ఏఇతర ప్రజాసంఘములు ఆంధ్ర మహారాష్ట్ర కర్ణాటక మహాసభలు, స్టేటు కాంగ్రెసు ఏవియు దీనిచే సంతృప్తిపడజాలవు.

హైద్రాబాదు రాష్ట్ర ప్రజలు సంపూర్ణ స్వాతంత్ర్యమును పొందుటకై తమ పోరాటాన్ని మరింత ఉత్సాహముతో ముందుకు తీసుకుపోతారు. వారి కింకో మార్గములేదు.

హైద్రాబాదు, జులై 23

హైద్రాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి రామానంద తీర్థగారు నైజాము సంస్కరణలపై పత్రికలకొక ప్రకటన నిచ్చారు.

"ప్రభుత్వం ప్రకటించిన సంస్కరణలు మూలసూత్రాల, సిద్ధాంతాల విషయమై వెనుకటి వానికేమీ భిన్నంకాదు. కొద్ది కొద్ది మార్పులేమన్నా జరిగినా, అవి అసలు సంస్కరణలకు నూతన రూపాన్ని ఇవ్వలేవు. నామినేటు చేయబడిన సభ్యులకంటె ఎన్నుకోబడ్డవారి సంఖ్య కొంచెం అదనంగా వున్నంతమాత్రాన శాసనసభయొక్క అధికారాలు ఎక్కువ కాజాలవు. వాదోపవాదాలకు మరింతవీలు కలుగుతుంది. వోటర్ల సంఖ్య వెనకటికంటె రెట్టింపు అవుతుంది. ఐతేనేం, సంస్థానంలో నిజానికి నూటికి ఒక్కరికి వోటుహక్కు ఏర్పడదు.

"పట్టణాలలో ఇంటి యజమానులకూ, అద్దెలవారికీ తమ ప్రతినిధుల్ని ఎన్నుకొనే హక్కు ఒకటి వెనకటిజాబితాకు చేర్చబడిందే తప్ప, వృత్తి నియోజకవర్గాల నిర్ణయంలో మార్పు చెయ్యబడలేదు. వృత్తి నియోజక వర్గాలు పోయి, వాటిస్థానే ప్రాదేశిక నియోజక వర్గాలు ఏర్పడాలని మాకోర్కె.

"ఈ సంస్కరణలలో ముఖ్యంగా కనిపించేది శాసన సభలనుంచి పంచాయితీలవరకూ హిందూ - ముస్లిముల మధ్య సమాన ప్రాతినిధ్యం. ఇది చాలా అన్యాయం. ప్రజాతంత్ర విధానానికే విరుద్ధం. (సంస్థాన ప్రజలలో నూటికి 12 మంది ముసల్మానులు)

"ఏ ప్రతినిధిఅయినా నెగ్గాలంటే అతని మతంవారి వోట్లలో అధమం నూటికి 51 ఐనా వచ్చితీరాలనేది చాలా అన్యాయమైన సిద్ధాంతం. మొదట 40 వస్తే చాలన్నది ఇప్పుడు 51 చేశారు. దీనివలన మత దురభిమానాలు పెరగడానికే హెచ్చు అవకాశాలున్నాయి.

"హైద్రాబాదు ప్రభుత్వం కాలపరిస్థితుల్ని గుర్తించి, సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచి, ప్రజలయొక్క ఆధిపత్యాన్ని గుర్తించి యుండవలసింది. ప్రస్తుత సంస్కరణలు తీసుకొచ్చేది బాధ్యతాయుత ప్రభుత్వం ఎన్నటికీ కాజాలదు."

ఇవి ప్రజల వాంఛల్ని తీర్చలేవు.

సోవియటు అభివృద్ధి

ఎడారుల్లో రైల్వే మార్గాలు

నీళ్లకు ఆగకుండా రైళ్లు వెయ్యి మైళ్లు నడుస్తాయి

దేశరక్షణలో కాని, వాణిజ్యాభివృద్ధిలో కాని, రాకపోకలలోగాని రైల్వేమార్గాలకు ఒక గొప్ప స్థానమున్నది. ప్రపంచ నాగరికతాభివృద్ధులలో ఒక దేశముయొక్క స్థానాన్ని సూచించడానికి వీటిని ఒక చిహ్నముగా పరిగణించవచ్చును. సోవియటు యూనియన్ అతి శైశవదశలోనే వివిధ దేశాల దాడుల నెదుర్కొంది. 1939, 40 లలో తూర్పున జపానుతో, పశ్చిమాన ఫిన్లండుతో యుద్ధం చేయవలసి వచ్చినది. చరిత్రలో భయంకరమైన రెండవ ప్రపంచ యుద్ధంలో దిగ్విజయ కీర్తి గడించింది. వీటన్నిటిలోను ఆ దేశపు రైల్వేలకున్న స్థానం అత్యున్నతమైంది. ఇప్పుడు సోవియటు దేశంలో రైల్వేమార్గాలు ఏ దశలోనున్నవో, ఆ దశకు రావడంలోఉన్న విశేష మేమిటో గ్రహించాలంటే ఏ దశనుండి ప్రస్తుతం ఈ దశకు వచ్చినవో, ఏ మార్గాన అభివృద్ధి చెందుతూ వచ్చినవో తెలుసుకోవడం చాల ముఖ్యం.

జారు కాలంనాడు 1914 లో రష్యాలో 38,000 మైళ్ల రైలుమార్గాలుండేవి. చాల తక్కువ వైశాల్యము కలిగిన ప్రెటనులోనే 19,181 మైళ్లుండేవి. 100 చదరపుమైళ్ళ వైశాల్యానికి అమెరికాలో 53 మైళ్ళ రైలు మార్గాలుంటే రష్యాలో సంఖ్య 12. 1913లో రష్యన్ రైలుమార్గాలమీద నడిచిన వస్తు సామగ్రి 132 మిలియను టన్నులు మాత్రమే.

రైల్వే పరిశ్రమకు కావలసిన పరికరాలకై ఎలా పరదేశాలమీద ఆధారపడవలసి ఉండేదో, అలాగే పెట్టుబడికికూడా రష్యన్ రైల్వేలు విదేశాలమీదే ఆధారపడి ఉండేవి. ఇంతటి బలహీనమైన దశలోఉన్న రాకపోకలవిధానము 1914-18 యుద్ధంలోనుతరువాత జరిగిన అంతర్యుద్ధాలతోటి కృంగి కృశించి పోయింది.

1921లో 1200 రైలుబండ్లు మట్టుకేమిగిలినవి.

4322 రైల్వే వంతెనలు నాశనమైనవి. రైలు మార్గాలు నడిపిన వస్తుసామగ్రి 39 మిలియనుటన్నులయిపోయినవి.

1918	132	మిలియనుటన్నులు.
1921	39	

1921 లో ఇంత హీనదశలో ఉన్న రష్యన్ రైల్వేలు 1913 లో ఉన్న స్థాయికి 1927 సంవత్సరంలో వచ్చివేసినవి

పంచవర్ష ప్రణాళికలు

వస్తూత్పత్తి అధికంకావచ్చు. పరిశ్రమలభివృద్ధికావచ్చు. తగిన రవాణా సౌకర్యాలు లేకపోతే స్వదేశ, విదేశ వాణిజ్యాలు కూడా అభివృద్ధి చెందలేవు. దేశముయొక్క పరిశ్రమాభివృద్ధికి రహదారి మార్గాల అభివృద్ధి వెనుకబడ్డదనిన్నీ, అలా వెనుకపడడం దేశాభివృద్ధికి నష్టదాయకమనిన్నీ, రహదారి మార్గాల అభివృద్ధికి ధనసహాయము మనుష్య సహాయమేకాక వాటిలో ఉన్న బాధ్యతారహిత విశృంఖలత్వాన్ని రూపుమాపాలని స్టాలిన్ ఉపన్యసించాడు. ప్రథమ పంచవర్ష ప్రణాళికలోనే (1928-32) 4000 మైళ్ళు రైలుమార్గాలు నిర్మింపబడ్డవి. 1933 సంవత్సరానికి పెట్టుకున్న గమ్యస్థానాలన్నీ 1932 సంవత్సరానికే, అనగా నాలుగేండ్లలో సాధ్యమైనవి.

రష్యన్ రైలుమార్గాలమీద నడిచిన వస్తువులీ క్రిందివిధంగా అభివృద్ధి పొందుతూ వచ్చాయి.

1913	132	(మిలియన్ టన్నులు)
1921	39	(")
1928	156.2	(")
1932	267.9	
1937	577 2	

1928 లోని సంఖ్య మూరమకుంటే 1937 లో ద్వితీయ పంచవర్ష ప్రణాళిక అంతంలో పరిస్థితి ఇలా ఉండేది.

బొగ్గు, రాతినిబొగ్గు	383
ముడి ఖనిజాలు	485
ఖనిజాలు	460
కలప	270.

ఈపైసంఖ్యలు రైలుమార్గాల అభివృద్ధినే కాక, ఈ కాలంలో సోవియటు దేశంలోని ఆర్థిక వాణిజ్యాభివృద్ధిని కూడా సూచిస్తున్నది.

అపారమైన అభివృద్ధి

1934 పార్టీ కాంగ్రెసులో కగనావిచ్ రైల్వే కమిసార్‌గా నియమింపబడ్డాడు. 1939 లో తిరిగి పార్టీ కాంగ్రెసుకు కగనావిచ్ ఈ క్రింది ఫలితాలను చూపగలిగాడు.

	టన్నులు, మైళ్లు	
1933	105, 900 మిలియన్లు	100 కి 218 అధికం అన్నమాట
1939	230, 700 ..	

రోజు వాగను మోయు	
బరువు అధికము	100 కి 70
బొగ్గు	100 కి 80
ఖనిజాలు	100 కి 30
ధాన్యం	100 కి 50
వెన్న పదార్థాలు	100 కి 30
నూనె పదార్థాలు	100 కి 100
గుడ్లు	100 కి 230
గుడ్డలు	100 కి 40

ఈ పైని పేర్కొనబడిన అభివృద్ధి అంతా ఎలా సాధ్యమైనదో వివరిస్తూ, కగనావిచ్ "మా దేశముయొక్క నియమబద్ధమైన ఆర్థిక విధానమువల్లను, తక్కిన దేశాలకంటే మా దేశంలో ప్రతి వాగన్‌నూ, రైలుబండిని ప్రతి అంగుళము రైలు మార్గాన్ని అతి జాగరూకతతో వాడుకోవడము వలన సాధ్యమైనది" అన్నాడు.

ఇంతేకాదు, ఈ కాలంలో మార్పుకూడా అవలంబింపబడ్డది. కొత్త రైల్వే ఇంజన్లు కనిపెట్టబడినవి. ఇవి గంటకు నూరుమైళ్ళ వేగంతో పరుగెత్తగలవు ఇటువంటి కొత్తమార్పులు ఇక్కడా అక్కడా కొన్ని చోట్ల మట్టుకే కాక, అంతటా విశేషముగా ప్రవేశ పెట్టబడ్డాయి. తక్కువ ఖర్చు అయ్యే మార్గాలు, ఎడారి ప్రదేశాలలో నీటి అవసరం ఎక్కువ అక్కరలేని ఇంజన్లు ఇంకాఎన్నో అభివృద్ధికరమైనవి ప్రవేశపెట్టబడ్డాయి.

తృతీయ పంచవర్ష ప్రణాళిక

ఈ అభివృద్ధితో సంతృప్తిచెంది ఊరుకోక తృతీయ పంచవర్ష ప్రణాళికలో ఇంకను విశాలాభివృద్ధి ఉద్దేశింపబడినది. వస్తూత్పత్తి 82% ఎక్కువ కావాలని ఆశించడం వల్ల దీనికి తగినట్టుగా రైలుమార్గాలమీద నడిచే వస్తు భారంలో 100 కి 50 అధికంగమ్యంగా పెట్టుకోవడమే కాక రోడ్లు, జల, రహదారి వసతులలోకూడా అభివృద్ధిలక్ష్యంగా పెట్టుకోబడింది. రైలు, రోడ్డు, నీటి, రహదారులలో, వాటిలో వాటికి పోటీలేక, ఆర్థికాభివృద్ధిలో ఒక్కొక్కటి ఒక ప్రత్యేక నియమిత స్థానం గలిగి ప్రజాభ్యుదయానికి తోడ్పడుతుండేవి. నీటిమార్గాలు, రోడ్లు, రైల్వేమార్గాల మీదనున్న భారాన్నితగ్గించి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడేవి.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో 1860 మైళ్ళ కొత్త రైలుమార్గాలు నిర్మింపబడితే మూడవ ప్రణాళికలో 6800 మైళ్ళు క్రొత్తవిన్నీ, 5000 మైళ్ళు (డబుల్ లైన్లు) నిర్మించడానికి పూనుకున్నారు. 8000 కొత్త రవాణ ఇంజన్లను, 4200 ప్రయాణీకుల బండ్లను, 20 వేల వాగన్లనుకూడా నిర్మించడానికి ప్లాను వేశారు.

అనవసర వ్యయాలు తగ్గింపబడ్డాయి

ప్రాంతీయముగైన సహజ సంపదలను గుర్తిస్తూ దేశం మొత్తంమీద పరిశ్రమాభివృద్ధికున్న ప్రణాళిక ననుసర్యంగా రైల్వే అభివృద్ధికూడ నియమితమైంది. శాస్త్రజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, అనవసర కాల వ్యయాన్ని తగ్గించి ఉత్పత్తికి తోడ్పడేటట్టు చూసింది. సోవియటుప్రభుత్వం, ఉదాహరణకు దక్షిణ రైల్వేనుంచి గోర్కీ రైల్వేకి కలప వెళుతుంది. కాని గోర్కీ రైల్వేనుంచి దక్షిణరైల్వేకి కలపకూడా పంపబడుతుండేది. ఇటువంటివన్నీ రైల్వే అధికారులకు తెలియచేసి అనవసర ధన కాల వ్యయాన్ని తగ్గించడంలో తోడ్పడమని, ప్రజలకు, కార్మికులకు మంచి ప్రోత్సాహముండేది.

రైల్వే మైళ్ళ సంఖ్యలో అభివృద్ధి ఇలా గుండేది.

1913	36, 300	1936	52, 700
1929	47, 700	1941	64, 000
1932	50, 733		

ఎడారుల్లో

వెడల్పయిన నదులమీద వంతెనలు లేకపోవడం రైల్వే అభివృద్ధికి గొప్ప అటంకంగా ఉండేది. వోల్గానదిమీద, యారోస్లావ్, సరటాల్, గోర్కీ దగ్గర, ఓల్గానదిమీద గోర్కీ వద్ద ... నదిమీద రాస్తావ్ వద్ద యూరల్ మీద, యూరల్‌స్క్ వద్ద పెద్ద పెద్ద వంతెనలు, ఈ కాలంలో నిర్మింపబడ్డవి.

రష్యాలో ఎడారి ప్రదేశాలనేకంగా ఉన్నవి. ఈ ఎడారుల్లో ఇంజన్లకు నీరు దొరకడం చాల కష్టం. అందువలన ఒక్కసారి నీరు తీసికొని 1000 మైళ్ళవరకు మళ్ళీ నీటి అవసరం లేకుండా ఎడారి మార్గాల్లో పరుగెత్తే కండెన్సర్ ఇంజన్లు విశేష ఉపయోగంలోకి వచ్చాయి.

విద్యుచ్ఛక్తి రైల్వేలు

రైలు మార్గాలపైన విద్యుచ్ఛక్తి మొట్ట మొదట 1926 లో ప్రవేశపెట్టబడినది. పారిశ్రామిక ప్రదేశాల్లోను ఖనిజసంపత్తు విశేషంగా ఉన్న ప్రదేశాల్లోను విద్యుచ్ఛక్తి యొక్క ఉపయోగంవల్ల మామూలు ఆవిరి యంత్రం ఉపయోగిస్తే వచ్చే చిక్కులెన్నో తొలగింపబడి పరిశ్రమాభివృద్ధికి ఆటంకాలు లేకుండా పోయినవి. కస్బాస్, యూరల్స్ మరి యితర ప్రాంతాల్లో 1150 మైళ్ళు విద్యుచ్ఛక్తి రైల్వేలు నిర్మించడం తృతీయ పంచవర్ష ప్రణాళికలో లక్ష్యంగా పెట్టుకోబడింది.

మాస్కో భూగర్భ రైల్వే నిర్మాణ సౌందర్యానికి ప్రపంచ ఖ్యాతిపొందినది. ప్రయాణీకుల సౌకర్యాలను చూడటంలో సోవియటు కార్మికులెంతో శ్రద్ధ చూపేవారు. స్త్రీలకు శిశువులకు రైలుస్టేషనులో సౌకర్యాలు చేసినందుకు సెవెర్నీ స్టేషను కార్మికులకు 15000 రూబుల్సు సోవియటు ప్రభుత్వం బహుమతి యిచ్చింది. ఆ ధనాన్ని తిరిగి ప్రజాసౌకర్యార్థమే వినియోగించాలని నిర్ణయానికి వచ్చారు ఆస్టేషను కార్మికులు.

యుద్ధకాలంలో రైల్వేలు

1939-40 ప్రాంతాల్లో దూరప్రాచ్యంలో జపానుతో యుద్ధాలు తరువాత ఫిన్లండుతోటి యుద్ధాలు సోవియటు రైల్వేలు దేశరక్షణలో వెనుదీయవని రుజువుచేశాయి. ద్వితీయ ప్రపంచ యుద్ధంలో సోవియటు రైల్వేలు దేశరక్షణలో వహించిన పాత్ర అమోఘమైనది. కీవ్, ఖార్కోవ్ పట్టణాల్లోనుంచి లక్షలాది ప్రజావాహినిని, యుద్ధరంగపు వెనుకకు తీసికొని పోవటం, పరిశ్రమలను పరిశ్రమలనే ఒక చోటినుంచి యింకోచోటికి మార్చటం, రణరంగంలోని సైనికులకు లెక్కలేనంత ఆయుధసామగ్రిని తదితరావసరాలను తీసికొనిపోవడంలో సోవియటు రైల్వేలు, రైల్వే కార్మికులు చూపిన స్వార్థత్యాగము, కార్యదీక్ష అమోఘము, శ్లాఘనీయము, ఇంతవరకు ప్రపంచచరిత్రలో సాటిలేనిది. ప్రతిరోజూ ప్రతి కార్మికుడు ఎక్కువకాలం పనిచేసి అధికోత్పత్తిని, దేశరక్షణ నిధికి కొన్ని కోట్ల రూబుల్సు అర్పించారు. ఈ క్లిష్ట సమయంలో స్త్రీలు నిర్వహించిన పాత్రకూడా చరిత్రలో సాటిలేనిది. ఇంతటి స్వార్థత్యాగం చూపిన సోవియటు రైల్వే కార్మికునికి అధికంగా రొట్టె, పత్తెరపొగాకు ఇంకా ఇతరమైన జీవితావసరాలలో రేషనుని చాల అధికంచేసి సోవియటు ప్రభుత్వం తన కార్మికునియెడల ఉన్న అభిమానాన్ని వెలిబుచ్చింది.

స్త్రీలు - సోవియటు రైల్వేలు

రైల్వేలలో పురుషు చేసేపనులను చేస్తారో అట్టి ప్రతి పని చేయడానికి స్త్రీ కూడా అర్హురాలు. సమానమైన పనికి పురుషునికి, స్త్రీకి సమానమైన వేతనాలిస్తారు. 1938 లో రైల్వే పనులను నేర్చుకొనుచున్న యువతుల సంఖ్య 16,000. ఇందులో 5000 మంది ఇంజను డ్రైవర్లు కావడానికి తర్ఫీదుపొందుతుండేవారు డ్రైవరుగా పనిచేస్తున్న ఒక స్త్రీ మాస్కో రైల్వేకు మానేజరుగా నియమింపబడ్డది. యుద్ధకాలంలో టామ్స్కు రైల్వేలో 1600 యువతులు తర్ఫీదు పొందుతుండేవారు. 1942 సంవత్సరము పూర్తి అయ్యేసరికి 25,000 మంది యువతులు అనేక శాఖలలో పనిచేస్తుండేవారు.

విప్లవకరమైన చరిత్ర

సోవియటు రైల్వే కార్మిక సంఘాలకూ ఇతర దేశాలలోని కార్మిక సంఘాలకూ ఒక గొప్ప వ్యత్యాసమున్నది. తక్కిన దేశాల్లో కార్మిక సంఘాలు ఎక్కువ జీతం కోసం, తక్కువ గంటల కోసం, మొదలైన వాటికై తమ వర్గశత్రువులతో పోరాటం సాగించడం ప్రధానకర్తవ్యం. ఇటువంటి పోరాటానికి సోవియటుదేశంలో ఆవశ్యకత లేకపోవడంవలన అక్కడి కార్మిక సంఘాల ప్రధాన కర్తవ్యాలు :

(1) ప్రజాప్రభుత్వానికి తోడ్పడి, దానిని బలవత్తరమైనదిగా చేయటం.

(2) కార్మికుల సాంఘిక నాగరిక జీవనాభివృద్ధి. అందువలన సోవియటు కార్మికుని రాజకీయ ఆర్థిక విజ్ఞానము పెంపొందించడానికి కార్మిక సంఘాలు అశేష కృషి చేస్తుంటాయి.

రైల్వేకార్మికుల దేశభక్తి

దీనివలన మనకున్న గుణపాఠం ఏమిటి? సోవియట్ రైల్వేలకున్న ప్రత్యేకత ఏమిటి? అక్కడి రైల్వేలు కొద్దిమంది డైరెక్టర్ల వ్యంతలాభంకోసం నడవవు. ప్రతి కార్మికుని దగ్గరనుంచి జనరల్ మానేజరు దాకా రైల్వేతో సంబంధంఉన్న ప్రతివ్యక్తి తమ మాతృదేశాభ్యుదయంకోసం, ప్రజాభ్యుదయానికై ప్రజాప్రభుత్వాన్ని బలపరచడంకోసం రైల్వేలను నడుపుతారు. సామ్యవాద సిద్ధాంతాధారమైన ప్రజా ప్రభుత్వ నిర్మాణంలో సోవియటురైల్వేలు ఒక ముఖ్యమైన అంగం.

[ఆధారం - కింగ్స్ ఫోర్డు రచన]

రాజ్యాంగసభకు కాంగ్రెసు లీగు లెన్నుకున్నవి ఎవరు ?

వీరు స్వాతంత్ర్యంకోసం పోరాడేవారేనా?

జులై 22 నాటికి అన్ని రాష్ట్రాలలోనూ రాజ్యాంగసభ ఎన్నికలు జరిగిపోవడమూ, 24 నాటికి ఫలితాలు వచ్చి వేయడమూ పూర్తి అయింది. నెగ్గినవారి జాబితాలలో కనిపించే ఈపేర్లు గలవారంతా ఎవరు? వారి రాజకీయాలేమిటి? అనే ఆలోచన కలగడం సహజమే.

ఎ. గ్రూపు లో

బొంబాయి, మద్రాసు, సంయుక్త రాష్ట్రాలు మధ్యరాష్ట్రాలు, బీహార్, ఒరిస్సాలనుంచి వచ్చిన ప్రతినిధులపేర్లుచూడండి. అందులో కాంగ్రెసు జాబితా ముందు వేసుకుందాం.

ఏవిధమైన పోరాటంలోనూ ఎప్పుడూ పాల్గొని మితవాదులు. పైగా, అసలు స్వతంత్ర భారతదేశం ఏలావుండాలో ఆలోచనకికూడా అందని పెద్దలెందరో దానిలో కనిపిస్తారు.

ఉదాహరణకి - ఎమ్. ఆర్. జయకర్ పేరు. (బొంబాయి) సర్. అల్లాడిగార్లపేర్లు చూడండి. వీరిలో జయకరుకిగల అర్హత ఏమన్నావుంటే ఎప్పుడూ ప్రభుత్వానికీ కాంగ్రెసుకీ మధ్య 'శాంతిదూత'గా వ్యవహరించడం మాత్రమే. సరి ఇంక రెండోవారి సర్ బిరుదు చెప్పక చెబుతూంది, ఆయన ప్రభుత్వానికి చేసిననేవ.

మద్రాసు నుంచి నెగ్గినవారిలో ఎన్. గోపాలస్వామి అయ్యంగారున్నారు. ఈయన మాజీ కాశ్మీర మంత్రి. పొలిటికల్ డిపార్టుమెంటుకి (బ్రిటిష్ ప్రభుత్వంచే నియమింపబడిన డిపార్టుమెంటు) సంస్థానాధీశులకీ అనంతమైన సేవచేశారు.

కె. ఎమ్. మున్షీ మరొకరు. పట్టి హిందూ మత దురభిమాని. అఖండ హిందూస్థాన్ కోసం కాంగ్రెసులోంచి పోయిన మనిషి.

జమీందార్లూ - వర్తకులు

వీరితో సరిపోతుందా?

తమ జీవనాన్నంతటినీ కాంగ్రెసుతోటి పోరాటంలో గడిపి, పరాయి ప్రభుత్వానికి పాదసేవ చేసిన ప్రజాపీడకులు ఎందరో కాంగ్రెసు పట్టికలలో కనుపిస్తారు. బొబ్బిలి రాజా, కుమారరాజా ముత్తయ్య చెట్టియార్ (చెట్టి నాడు కుమారరాజా) లు జస్టిస్‌పార్టీకి స్తంభాలలాంటివారు. ఈనాడు కాంగ్రెసు పేరిట రాజ్యాంగసభకి పోతున్నారు. ఆంధ్ర - తమిళనాడులలో బ్రిటిష్ భక్తులు ప్రజాపీడకులుగా ఉభయులూ కీర్తిపొందారు.

ఇల్లాంటి పెద్దలు బీహారునుంచి కూడ వచ్చారు. సర్ చంద్రశేఖర ప్రసాద్‌సింగు బీహార్‌లోని పెద్దజమీందార్లలో ఒకరు. నేషనల్ వార్‌ఫ్రంట్‌కి నాయకుడుగా పనిచేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్సు అధ్యక్షుడు రాయ బహదూర్ శ్యామనందన సాహే మరో మచ్చుతునక. ఈ మధ్యన బీహార్‌లో కాంగ్రెసు మంత్రులు ప్రవేశపెట్టిన టెనెన్సీ బిల్లుని తీవ్రంగా ఎదిరిస్తూన్నవారిలో ప్రముఖుడు ఈయన.

ప్రజా శత్రువులు, స్వాతంత్ర్యానికి విరోధులనీ లెక్కించవలసివస్తే, బీహార్ ప్రజలు ప్రప్రథమంలో వీరినిద్దరిని పేర్కొంటారు.

బి. గ్రూపు

బి, సి, గ్రూపులలో కాంగ్రెసు - లీగులు కరడు గట్టిన ప్రజావ్యతిరేకులను ఎంచుకున్నారు.

పంజాబులో తామిచ్చిన పట్టీలో చాలా ముఖ్యతని కాంగ్రెసు వాదులే చెప్పుకుంటున్న జస్టిస్ సర్ టెక్‌చంద్ రిటైర్డు హైకోర్టు జడ్జి హిందూ మహాసభ వాది. ఈయన్ని గురించి ఒక ప్రముఖ కాంగ్రెసువాది చెప్పిన మాటలు వినండి—

"బక్షీ టెంచిపేరుగల లాయరు, మహాసభ వాదైతేనేం? పంజాబులో ముసల్మానులనుంచి హిందువుల హక్కుల్ని రక్షించగల సమర్థుడు.

ఈయనకిగల అర్హత ముసల్మానులతో పేచీపడగలగడం!

ఈదృష్టితోనే పంజాబులో మరొకస్థానం యూనియనిస్టు పార్టీకి చెందిన ఒక హిందూ మత వాదికిచ్చారు. సరిహద్దు రాష్ట్రంలో మెహర్‌చంద్ ఖన్నా ఈదృష్టితోనే ఎన్నుకోబడ్డారు.

వీరిలో యూనియనిస్టు హిందువు తన యజమాని (ప్రభుత్వం) ఎలాచెప్తే అలా చేస్తాడేగాని దేశం సంగతి చూడ్డంబరగడు. ఖన్నా కాంగ్రెసు మంత్రులలో ఒకడు. ఈయనకివచ్చే ఆదాయం అంతా బ్రిటిష్ ఆర్మీ కంట్రాక్టులనుంచేనని పెషావరులో చంటిపిల్లవాడికికూడా తెలుసు.

> రమేశచంద్ర

పంజాబులో లీగు ప్రతినిధులు

బి. గ్రూపుకి లీగ్ ఏరిన వ్యక్తుల్లో అభివృద్ధి నిరోధకులుగా అగ్రగణ్యులయినవారున్నారు. అక్కడ లీగ్ జాబితానీ, కాంగ్రెసు జాబితాని పోల్చాలన్న సమస్యే అక్కర్లేదు. పంజాబులోని 16 ముస్లిం స్థానాలకీ నూరు దరఖాస్తులు వచ్చాయట. వారిలో చాలమంది పెద్దపెద్ద జమీందార్లు 3 గ్గురు ఐ. సి. యస్. ఆఫీసర్లుకూడా దరఖాస్తు పెట్టారట.

చివ్నా ఏరిన ఆనమంతా మణిపూసలు, కౌన్ ఫ్రాన్‌సిస్కోలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వంతపాడిన సర్ ఫిరోజ్‌ఖాన్ నూన్, బ్రిటిష్‌వారి పాతనేస్తం దీగం షా నవాజుల పేర్లు అన్నింటికీ తలకట్లు.

వీరేకాదు. ఉత్తరాదిలోబాగా ధనవంతుడని పేరుపడ్డ సయ్యద్ అంజాద్ అలీషాపేరు కూడా పట్టికలో చేరింది. ఇతను పెద్ద ఆర్మీ కంట్రాక్టరు.

ఈ పెద్దమనిషి మొన్నటి ఎన్నికలదాకా యూనియనిస్టుపార్టీకి కార్యదర్శి. తనపార్టీపని నీళ్ళు కారేటట్లు కినబడగానే లీగ్ టిక్కెట్టుకి పరుగెత్తివచ్చారు.

లీగ్ టిక్కట్టు ఇచ్చిందికూడా. కాని లీగ్ ప్రజాసామాన్యంలో లేపిన ఆందోళనతో అవిరిపోయి కేంద్ర పార్లమెంటరీబోర్డు ఆయనపేరు వదిలిపెట్టింది

కాని, నేడు ఆయన మళ్ళీ గొడ్డిదారిని ప్రవేశపెట్టబడ్డాడు. 'కాన్‌స్టిట్యూ'లో నిండుటు పరిచే బ్రిటిష్ సైనికాధికార్లతో ఆయనకి గల పొత్తు బాగా సాయపడుతుందని లీగ్ నాయకుల పూహ కాబోలు!

సి. గ్రూపు

బెంగాలునుంచి రాజ్యాంగ సభకి ఎన్నుకోబడ్డ వారి పేర్లు చూస్తే చాలు వారిని ఎన్నుకోవడంలోగల అంతరార్థం స్పష్టంగా కనిపించిపోతుంది,

కాంగ్రెసు పేర్లలో బర్ద్వాన్ మహారాజాధిరాజు! బెంగాల్లోకల్లా పెద్ద జమీందారు. ఏటా 50 లక్షల ఆదాయంగలవాడు. ఎప్పుడూ దేశభక్త పార్టీలకి ఎదురెత్తే ఈయన కాంగ్రెసు అభ్యర్థి!

ఈయన తర్వాత చెప్పదగ్గపేరు రాజా. ప్రసన్నదాస్ రైకేట్, నిమ్నజాతికి చెందినవాడు, పెద్ద జమీందారు. బ్రిటిష్ ప్రభుత్వ భక్తుడు. టీ తోటల యజమానులకి ప్రియ మిత్రుడు.

చిల్లాల కుడిచెయ్యి అనదగ్గ డి. పి. ఖైటాన్ ఈ పట్టీలో నున్నాడు. బెంగాల్ కరువురోజుల్లో కోట్లు గడించిన ఈయన విషయం బెంగాల్‌లో అంతా ఎరుగుదురు.

మహాసభ నాయకుడుకూడా

హిందూమహాసభా అధ్యక్షుడు డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ పేరు తీసుకోవడం బహుశా ముసల్మానులతో కుస్తీ కోసమే అయి వుంటుంది. మహాసభ పెద్దని తనవాడిని చేసుకోవాలని కాంగ్రెసు తాపత్రయపడ్డా మహాసభ పెద్దలు కాంగ్రెసుని నమ్మలేదు. మహాసభ కార్యదర్శి అశుతోష్ లాహిరీ స్వతంత్రంగా నిలబడి రాజ్యాంగసభలో దూరాలని ప్రయత్నించాడు.

కాంగ్రెసేతరుల్ని తీసుకోవడమేగాక కాంగ్రెసువారిలోకూడా బెంగాలులో ఏమాత్రమూ పలుకుబడిలేని 'పర్కా-సంఘం' గ్రూపుకి ఎక్కువ స్థానా లివ్వబడ్డాయి.

ఖాన్‌బహద్దర్లతో లీగుపట్టీ

కాంగ్రెసు పట్టికకి లీగ్‌పట్టిక అచ్చంగా నకలు, 33 గురు ముస్లిం ప్రతినిధుల్లో 7 గురు ఖాన్‌బహద్దర్లు. ఒక రిటైర్డు జిల్లాజడ్జి, ఇద్దరు పెద్ద జమీందార్లు. ఒక ప్రభుత్వ పక్షపాతియైన లాయరు, రాజభక్తుడైన కాలేజీ ప్రిన్సిపాల్ వొకరు.

కాని, అందులోవున్న కొందరు వ్యక్తుల ముందు ఖాన్‌బహద్దర్లూ, జడ్జీలూ పట్టి వెలుసులు.

అలాంటివారిలో ఇస్పహానీ ఒకరు. బెంగాల్‌కరువుతో కోటీశ్వరుడయ్యాడీయన. ఆయన 'జగమెరిగిన' వాడు.

వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోంచి తొలగిన సర్ అజీజుల్‌హక్కు మరొకడు ఆయనకి వేవెల్‌తో గల మైత్రి తోడ్పడుతుందని లీగ్ అభిప్రాయం!

ఇంచుమించు లీగ్ ప్రతినిధులందరూ అటు సుహ్రావర్దీ బండ్లో, ఇటు నాజీముద్దీన్ బండ్లో, తప్ప ప్రజాసేవకులు కానరారు. మొన్నటి ఎన్నికలలో ఓడిపోయిన ఇద్దరు లీగర్లు పట్టికలో కెక్కించబడ్డారు.

అభివృద్ధి కోరేవారి పేర్లేలేవు

అసలు బెంగాలులో లీగను నిర్మించిన అభివృద్ధికాముల పేర్లు ఏ ఒకటి రెండో తప్ప జాబితాలో కనపడవు.

ఇంక కూలీల్ని - రైతుల్ని సమర్థించేవారి పేర్లకోసం లీగ్ పట్టికలో తడుముకోపనిలేదు

"కాంగ్రెసు-లీగ్ పట్టికలుచూచేక యూరపియన్లు బాగా సంతృప్తి పడ్డారు. తమకి నష్టం కలిగించే పనిని ఈ వ్యక్తులు చెయ్యరనే విశ్వాసం వారి కేర్పడింది. అలాంటిది వచ్చినట్లయితే రెండు పక్షాలలోనూ వున్న తమ మిత్రులు కాపుకోరని ధైర్యంగా వున్నారు." అని మా ప్రత్యేక విలేఖరి ఏడిల చక్రవర్తి వ్రాస్తున్నాడు.

వీరెవరి ప్రతినిధులు

పైగా, 'మా జాబితాలలో అన్ని తరహా ప్రజల ప్రతినిధులూ వున్నార'న్ని కాంగ్రెస్ వారంటున్నారు.

నిజమే. వారి జాబితాలలో పెద్ద జమీందార్లున్నారు. కోటీశ్వరులయిన పారిశ్రామిక యజమానులున్నారు. లాయర్లున్నారు. పట్ట మితవాదులున్నారు. హిందూ మతవాదులున్నారు.

కాని, కార్మికుల మాటేమిటి? అభివృద్ధి కాములయిన మేధావి వర్గం మాటేమిటి? దేశంలో అతిస్వల్పకాలంలో బలపడ్డ అతి వాదశక్తుల మాటేమిటి? భారత కమ్యూనిస్టుల ప్రతినిధులేరీ?

వీటికి కాంగ్రెసు సమాధానం చెప్పలేదు. దేశభక్తుడైన ప్రతిభారతీయుడూ ఈ ప్రశ్నలకి సమాధానం ఆలోచించాలి.

ఇప్పటి జాబితాలలోని పేర్లు గలవారు స్వతంత్రాన్ని సాధిస్తారా? ప్రజాతంత్ర విధానానికి దోహదం ఇస్తారా? బానిసదేశాలు పరాయి ప్రభుత్వాన్ని సాగనంపి స్వతంత్ర రాజ్యాంగచట్టాన్ని నిర్మించుకునేందుకు ఆశపడతాయి, పోరాడుతాయి. ఈనాడు రాజ్యాంగ సభలోకి కాంగ్రెస్ - లీగులు పంపుతూన్న వ్యక్తులు అటువంటి పోరాటాన్ని నడుపుతారా? భారతదేశాన్ని స్వతంత్రదేశంగా ప్రకటించి బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాగనంపుతారా? బ్రిటిషు వారి ఎత్తులకి ఫలితంగాలభించిన విషఫలాలు కావా ఇవి? వీటి వలన మనమే నష్టపడిపోమూ?

ఆలోచించండి!

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్

కార్యనిర్వాహకవర్గం : జులై 28

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కార్యనిర్వాహకవర్గ సమావేశం యీ నెల 28 వ తేదీన ఉదయం 9 గంటలకు బెజవాడలో రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ ఆఫీసులో జరుగుతుంది. సభ్యులు, ఆహ్వానితులు తప్పక విచ్చేయ ప్రార్థన.

ఎజెండా :

1. గుంటూరు ట్రేడ్‌యూనియన్ నాయకుల శిక్షలు, మన కర్తవ్యం.
2. రాష్ట్రంలో సమ్మె పరిస్థితులు.
3. ఇతర విషయాలు.

పోస్టల్ సమ్మెవల్ల వుత్తరాలు అందుట దుస్సాధ్యం. కనుక ఇదే మొదటి నోటీసుగా భావించ ప్రార్థన.

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
ప్రధాన కార్యదర్శి.

జర్మనీని నాశనం చేయడం మన ఆశయంకాదు

వ్యవసాయక దేశంగా మార్చాలనడం విభజించాలనడం న్యాయంకాదు

[విదేశాంగ మంత్రులసభలో జులై 10 వ తేదీన మాలటోవ్ ఇచ్చిన పూర్తి ఉపన్యాసం ఇది. జర్మనీలో ఫాసిస్టు అవశేషశక్తులను నాశనం చేయకుండానే, జర్మనీతో 25 ఏండ్ల ఒడంబడిక కావాలని అమెరికా బ్రిటిష్ విదేశాంగ మంత్రులు వాదించుతూ వచ్చారు. తాము జర్మనీ ప్రజలను ఉద్ధరింప జూస్తున్నట్లు సోవియటు వారిని అణచివేయడానికి చూస్తున్నట్లు, వారు చిత్రించారు. జర్మన్ ప్రజలకు ఎవరు మిత్రులో ఎవరు శత్రువులో, మాలటోవ్ ఈ ఉపన్యాసందృష్టాంతం చేస్తుంది — సం.]

జర్మనీ భవిష్యత్తునుగూర్చి జర్మనీతోటి శాంతిఒడంబడికను గూర్చి చర్చించవలసిన సమయం వచ్చింది. ఇలాంటి విషయాలలో, పగతీర్చుకోవడం అనే దృష్టి మంచిదికాదని మొదటి నుండీ సోవియటు భావించుతూ వచ్చింది. జర్మనీ చేసిన దురాక్రమణ, దాని వల్ల కలిగిన ఫలితాలకు బాధ్యతను జర్మను ప్రజలచేత వప్పించుకోలేకపోయినప్పటికీ, హిట్లరు జర్మనీకీ, జర్మనీ ప్రజలకు భేదాలేదని అనడం పొరపాటు.

జర్మను సైన్యాల దురాక్రమణవల్ల సోవియటు ప్రజలు సాటిలేని బాధలను అనుభవించారు. సోవియటు నష్టాలను లెక్కించడం అసాధ్యం. జర్మనీచేసిన యుద్ధం మూలంగా యూరపు ప్రజలు - ఇంగ్లండు, అమెరికా ప్రజలే గాదు అనేక దేశాల ప్రజలు - అనేక నష్టాలను బాధలను చాలకాలం అనుభవించవలసి యుంటుంది. అందుచే జర్మనీ భవిష్యత్తును గురించి ఆందోళన పడుతున్నది ఒక్క జర్మన్ ప్రజలే కాదు. భవిష్యత్తులో జర్మనీ మరో దురాక్రమణ చేయకుండా చూడవలెనని చూస్తున్న ఇతర ప్రజలు కూడా ఆందోళన పడుతున్నారు. జర్మనీ పారిశ్రామికంగా మంచి బలమైన దేశమనీ, అందుచే ప్రపంచ ఆర్థికవిధానంలో, జర్మనీ, ముఖ్యమైన లింకు అని మనం మరచిపోరాదు. ఈ పారిశ్రామిక బలమే జర్మనీ దురాక్రమణ చేయడానికి అవసరమైన, ఆయుధ సామగ్రి ఉత్పత్తికి కారణమైనదన్న విషయం కూడా మరచిపోరాదు.

వీటిని గుర్తుపెట్టుకొని మనం నిర్ణయాలు చేయవలసి వుంటుంది.

జర్మనీని నాశనం చేయడం మన ఆశయం కాదు

ప్రపంచ ఆర్థికస్థితినీ, యూరప్ లో శాంతినీ దృష్టిలో పెట్టుకొంటే-జర్మనీని ఒక రాజ్యంగా కాకుండా నాశనం చేయడంగాని, లేదా దానిని ఒక వ్యవసాయక దేశంగా మార్చడంగాని, లేదా దాని ముఖ్య పారిశ్రామిక కేంద్రాలను నాశనం చేయడంగాని- సరియైన మార్గంకాదు.

అట్టి పద్ధతి, యూరపు ఆర్థిక విధానాన్ని దెబ్బగొడుతుంది. ప్రపంచ ఆర్థిక విధానాన్ని ఉందరవందర చేస్తుంది. జర్మనీలో విరంతరం రాజకీయ సంక్షోభాలు తలెత్తి ప్రపంచశాంతి భద్రతలకు హానికల్గించుతాయి.

ఒకవేళ మనం అలాంటి విధానాన్ని అవలంబించినా, అది నిరర్థకమైనదని హేతురహితమైనదని, చరిత్ర మనకు గుణపాఠం చెబుతుంది.

అందుచేత, మన ఆశయం జర్మనీని నాశనం చేయడంకాదు; జర్మనీని ప్రజాస్వామ్య దేశంగా, శాంతికాముక దేశంగా పరివర్తన చేయడం. అట్టిజర్మనీకి వ్యవసాయంతో పాటు పరిశ్రమలూ విదేశవ్యాపారమూ ఉంటాయి. కాని తిరిగి దురాక్రమణ చేసే దేశంగా తయారవడానికి అవసరమైన ఆర్థిక, సైనిక పీఠాలు మాత్రం ఉండనీయరాదు.

యుద్ధం జరుగుతున్న కాలంలోనే, మిత్రరాజ్యాలు తమ ఆశయం జర్మను ప్రజలను నాశనం చేయడంగాదని చెప్పాయి. రష్యాను నాశనం చేయడమే తన ఆశయం అంటూ, హిట్లరు బహిరంగంగా ప్రగల్భాలు కొడుతున్న రోజులలోనే, అవి అన్నీ వట్టి పిచ్చి కారుకూతలంటూ, స్టాలిన్ ఇలాఅన్నారు.

"రష్యాను నాశనంచేయడం ఎలా అసాధ్యమో, జర్మనీని నాశనంచేయడం కూడా అలాగే అసాధ్యం. కాని హిట్లరు రాజ్యాన్ని కూల్చివేయాలి. కూల్చితీరాలి."

జర్మనీని విభజించరాదు వ్యవసాయ దేశంగా మార్చరాదు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జర్మనీ చాల కాలం ఒక ముఖ్యస్థానాన్ని వహించుతూ వచ్చింది. జర్మనీ అతిపెద్దదిగా, ఒక రాజ్యంగా వుంటే, ప్రపంచ వర్తకంలో ముఖ్యభాగం వహిస్తుంది. ఇది ఇతర దేశాల ప్రజలకుకూడా అవసరం గావాలి. అందుచే జర్మనీని ఒక రాజ్యంగా గాకుండా నాశనంచేసినా, లేక దాని - ఒక వ్యవసాయ దేశంగా మార్చినా, లేక దాని ముఖ్య పారిశ్రామిక కేంద్రాలను నాశనంచేసినా - అది జర్మనీలో పగతీర్చుకోవాలనే అపాయకరమైన భావాలకు దారితీస్తుంది. జర్మనీలోని అభివృద్ధి నిరోధకుల వలలోపడడం అవుతుంది. యూరప్ లో శాశ్వతమైన శాంతి భద్రతకూ హాని చేకూరుతుంది.

మనకు వెనుకచూపు పనికిరాదు. మనం ముందుకు చూడాలి. పెంపొందిన వ్యవసాయమూ పరిశ్రమలూ, విదేశవర్తకమూగల్గిన

విదేశాంగ మంత్రుల సభలోని మాలటోవ్ ఉపన్యాస పూర్తిపాఠం

దేశంగా జర్మనీని మార్చాలంటే జర్మనీ శాంతికాముక ప్రజాతంత్రరాజ్యంగా తయారు చేయాలంటే; మనంమేం చెయ్యాలన్నది ఇప్పటి ప్రశ్న. వ్యవసాయం మొదలైనవి పెంపొందించినా దురాక్రమణ చేసేశక్తులకు అవకాశం లేకుండాచేయాలి. ఈ ఆశయం నెరవేరడానికి, యుద్ధంలో మనవిజయం, మంచిబలోపేతమైనసాధనాలనుకల్పించింది. ఆసాధనాలను మనం ఉపయోగించాలి.

'స్వపరిపాలన' (అటానమస్) గల రాష్ట్రాలుగా జర్మనీని విభజించి చీల్చివేయాలనడం ఈ మధ్య కొంత ఫాషన్ అయిపోయింది. జర్మనీలో ఫెడరల్ రాజ్యాంగం ఏర్పర్చాలనీ, జర్మనీ నుండి రూర్ ను విడదీయాలనీ కొందరూ సూచిస్తున్నారు. ఈ సూచనలన్నీ, జర్మనీని వ్యవసాయక దేశంగా మార్చాలనే కోరికనుండే, జర్మనీని నాశనం చేయాలనే కోరికనుండే, పుట్టాయి. రూర్ లేకుండా జర్మనీ స్వతంత్రంగాను, సజీవంగాను, ఉండజాలదు. నేనిదివరలోనే చెప్పినట్లు, మనం శాంతిభద్రతలే గనుక కోరిన పక్షంలో, జర్మనీని నాశనం చేయడం మన ఆశయం కాకూడదు.

జర్మనీ అంతటా ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయంతెలుసుకొనేందుకు వోటింగ్) పెట్టితే - అందులో జర్మనీకి ఫెడరల్ రాజ్యాంగమే కావాలని జర్మన్ ప్రజల కోరిక అని తేలితే - మాకేమీ అభ్యంతరం లేదు. - అలాగే జర్మనీ క్రింద ఉన్న ఇదివరకటి రాష్ట్రాలు కూడ, జర్మనీనుండి విడిపోతామని ప్లెబిసైట్ ద్వారా తెల్పితే. మేమూ అందుకు అభ్యంతరం చెప్పం. పశ్చిమ జర్మనీ నాక్రమించిన మిత్రరాజ్యాలు, ఎవి అక్రమ మండాలలో, జర్మనీకి ఫెడరల్ రాజ్యాంగం కావాలని చాలసార్లు ప్రచారం చేశారు. జర్మను ప్రజల - కనీసం జర్మనీలోని కొంతభాగంలోని ప్రజల - నిజమైన వాంఛగా, మిత్రరాజ్యాల వైఖరికే చాలా లేదా వుంది. జర్మను ప్రజలపైన ఇలాంటి పరిష్కార విధానాలను

(ఫెడరేషన్) ఇప్పటి ముందడుగుగా పోని యటు ప్రజల ... ఆవా పేర్లు మంచివి ... ఉంది

ఒక ప్రశ్న. ... ప్రజాస్వామిక పద్ధతులపై కోలుకొన్న తర్వాత, దానిన్యాయమైన ఆశయాలకు మనం అడ్డుపడరాదు. మరో ప్రక్క, మనం జర్మనీ దురాక్రమణ దేశంగా తిరిగి తలయెత్తకుండా చూడాలి. ఈ పవిత్ర విధిని విస్మరించడమే ప్రపంచ ప్రజలు తిరిని అపరాధం చేసినవారం అవుతాం.

జర్మనీ తిరిగి దురాక్రమణ చేయకుండా ప్రపంచాన్ని కాపాడాలంటే, జర్మనీని పూర్తిగా నిరాయుధం చేయాలి. (సైనికంగాను ఆర్థికంగాకూడా) జర్మనీలో యుద్ధ పరిశ్రమలు తలెత్తకుండా వుండేందుకుగాను, రూర్ నునాల్గుదేశాలకంట్రోల్ క్రిందవుంచాలి.

బెర్లిన్ నిర్ణయాలను అమలు పరచాలి

జర్మనీని సైనికంగాను ఆర్థికంగాను పూర్తిగా యుద్ధానికి పనికిరాకుండా చేయాలనే కార్యక్రమం ఈనాడు కొత్తగా ప్రవేశపెట్టినదికాదు. అగ్రరాజ్యాల నాయకులు బెర్లిన్ లో ఈనిర్ణయానికి వచ్చారు. ఈవిషయమై వివరంగా బెర్లిన్ లో చర్చించారు. జర్మనీ యుద్ధపరిశ్రమలకు ప్రధాన వేదిక అయిన రూర్ ను అగ్రరాజ్యాల నాల్గింటి నిశితపర్యవేక్షణ క్రింద ఉంచాలి. యుద్ధానికి పనికిరాకుండా జర్మనీని సైనికంగాను, ఆర్థికంగాను నిరాయుధం చేయడంతోనే సరిపోదు. యుద్ధనష్టపరిహారాలను గురించికూడా ఒక ప్లానువేయాలి. సోవియటు ప్రభుత్వం అనేక సార్లు కోరినప్పటికీ, యుద్ధ నష్టపరిహారాలనుగురించి ఇంతవరకు ఒక ప్లానును తయారుచేయలేదు. బెర్లిన్ సమావేశ నిర్ణయాలను ఇంకా అమలు పెట్టవలసియుంది. అగ్రరాజ్యాల కంట్రోల్ క్రింద రూర్ ను ఉంచాలని సంవత్సరం క్రితమే సోవియటు సూచించినా ఆపని ఇంకాజరగలేదు. ఇవన్నీ ఏమి తెలియజేస్తున్నాయి? భవిష్యత్ శాంతిభద్రతలకు ఇది హానికరమైన విషయమని స్పష్టంచేస్తున్నాయి. ఈ కర్తవ్యాలను నెరవేర్చకుండా వాయిదా వేయడమంటే, జర్మనీని నిరాయుధం చేయాలన్న నిర్ణయాలను త్రోసివేసే ప్రమాదం ఉన్నదన్నమాట.

జర్మనీలో యుద్ధపరిశ్రమలను గూర్చి, యుద్ధ బీజాలను గురించి సోవియటు అభిప్రాయం ఇది. జర్మనీలో శాంతియుతకార్యాలకు పనికివచ్చే పరిశ్రమలను పెంపొందించడానికి పైన చెప్పిన అభిప్రాయాలేవీ అడ్డురావు.

శాంతికాల పరిశ్రమలకు అవకాశం ఈయాలి

శాంతియుతకార్యాలకు పనికివచ్చే జర్మను పరిశ్రమలను పెంపొందించాలన్నా, జర్మనీకి ఎగుమతి దిగుమతులు చేసుకోవడానికి అవకాశం ఈయాలి. జర్మనుబొగ్గు, లోహాన్ని ఉత్పత్తి వస్తువులను ఇతర దేశాల ప్రజలు దిగుమతిచేసుకొనేందుకు అవకాశంఈయాలి. విదేశ వర్తక హక్కును జర్మనీకి ఇచ్చే పక్షంలో, అది శాంతియుతమైన కార్యాలకు గాను ఉక్కు, బొగ్గు ఉత్పత్తికీ, ఉత్పత్తివస్తువులను తయారుచేయడానికి అభ్యంతరాలను పెట్టగూడదు. అయితే వీటికి ఒక పరిమితి ఉండాలన్నమాట నిజమే. జర్మను పరిశ్రమలను ముఖ్యంగా రూర్ పరిశ్రమలను పర్యవేక్షణ చేయడానికి మిత్రరాజ్యాల కంట్రోలు వుండాలి. దీనికిదాన్ని ఏ ఒక మిత్రరాజ్యం పైన మాత్రమో ఉంచరాదు.

జర్మనీలో శాంతికాల పరిశ్రమలను అభివృద్ధి చేయడానికీ, జర్మనీ విదేశవర్తకం చేసుకోడానికీ, జర్మను పరిశ్రమలన్నీ టిమీదా మిత్రరాజ్యాల కంట్రోలు ఉండడానికి అంగీకరిస్తే - జర్మనీనంతా ఒకే ఆర్థిక కేంద్రంగా చేయాలన్న బెర్లిన్ సమావేశ నిర్ణయాన్ని-అమలు పరచడానికి వీలవుతుంది.

జర్మనీతోటి శాంతి ఒడంబడిక

జర్మనీతో శాంతి ఒడంబడిక చేసుకొనే సమస్య మరొకటి వుంది.

జర్మనీతో శాంతి ఒడంబడిక చేసుకోవాలనే సిద్ధాంతం మాకు అంగీకారమే. కాని ఇలాంటి ఒడంబడికను చేసుకొనేముందు, జర్మనీలో కేంద్రీకృత ప్రజాతంత్ర ప్రభుత్వం ఏర్పడాలి. అది, జర్మనీలో ఫాసిస్టు అవశేషాలను నాశనం చేయగలదిగాను, మిత్రరాజ్యాలకు తన విధులను నెరవేర్చగలదిగాను ఉండాలి. ముఖ్యంగా మిత్రరాజ్యాలకు యుద్ధనష్టపరిహారాలను చెల్లించుటలో, తన విధిని నెరవేర్చేదిగా ఉండాలి. భవిష్యత్ జర్మన్ ప్రభుత్వం ఏర్పడేముందు ఒక జర్మన్ కేంద్ర పరిపాలనను ఏర్పాటుచేయడానికి మా కెట్టి అభ్యంతరమూ లేదు.

కాబట్టి, నేను చెప్పేదాని సారాంశం ఏమంటే, జర్మనీతో శాంతి ఒడంబడిక చేసుకోడానికి ముందు, సంపూర్ణ జర్మన్ ప్రభుత్వాన్ని ఏర్పరిచే సమస్యను పరిష్కరించాలి. ఒక సంవత్సరం క్రితమే, బెర్లిన్ సమావేశంలో, జర్మనీకి ఒక కేంద్రీకృత పరిపాలన ఏర్పరచాలని సోవియటుకోరినప్పటికీ, ఇంత వరకు ఏమీచేయలేదు. అపుడీ సమస్యను త్రోసివేశారు. కాని భవిష్యత్ జర్మనీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవలసిన ఈ రోజులలో ఇది అత్యంత ముఖ్యమైన సమస్య. ఒకవేళ జర్మన్ ప్రభుత్వాన్ని ఏర్పరచినప్పటికీ, ఈ కొత్తజర్మన్ ప్రభుత్వం ఎలాంటిదో నమ్మదగినదో, కాదో, అనేక సంవత్సరాలు పరీక్షచేసి చూడాలి.

జర్మన్ భవిష్యత్ ప్రభుత్వం, జర్మనీలో ఫాసిస్టు అవశేషాలను నిర్మూలించే ప్రజాతంత్ర ప్రభుత్వంగా ఉండాలి. ఇంతేగాక అది మిత్రరాజ్యాలకు నిర్వర్తించవలసిన విధులను ముఖ్యంగా యుద్ధనష్టపరిహారాలను ముట్టజెప్పగలిగేదిగా ఉండాలి. ఈ కర్తవ్యాలను నెరవేర్చగల్గినశక్తిగలదనీ, చిత్తశుద్ధితోవీటిని నెరవేర్చుతుందనీ మనం సంతృప్తిపడినప్పుడే మనం జర్మనీతో శాంతిఒడంబడిక అనేవిషయాన్ని తీవ్రంగా ఆలోచించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈవిధులను పూర్తిచేయనిదే జర్మనీతో శాంతిఒడంబడికనుగూర్చి తలపెట్టరాదు. జర్మనీ ఇవినెరవేర్చనిదే, శాశ్వతమైన శాంతి భద్రతలకు హామీకావాలని కోరేదేశాలకు, మనం మనకర్తవ్యాలను నెరవేర్చామని చెప్పలేం.

జర్మను భవిష్యత్తునుగూర్చి, జర్మనీతోటి శాంతి ఒడంబడికను గూర్చిన ప్రధానసమస్యలపై సోవియటు అభిప్రాయం ఇదే.

(టాస్ వార్తా సంస్థనుండి)

శాంతికి భంగకరంగా చైనాలో అమెరికా కుట్ర

"ఏరంగి మొతలప్పుడే ప్రారంభమయాయి. చైనా శాంతిసుఖాలను భవించాలో, లేక వినాశకరమైన యుద్ధరంగంగా మారాలో అమెరికా ప్రజలు నిర్ణయించవలసి ఉంది" అని 56 మంది చైనా విజ్ఞానవేత్తలు ఇతర ప్రముఖులు అమెరికా ప్రజలకొక విజ్ఞప్తిని ప్రకటించారు.

చైనాలో అంతర్యుద్ధాన్ని విస్తరింపజేసే విధంగా అమెరికా ప్రభుత్వం కొమింటాంగు ప్రభుత్వానికి అన్నివిధాల సహాయిస్తూంది. ఈ విధానాన్ని అమెరికా మానుకొనేలా చేయడానికి చైనాలో మితవాదులు, అతివాదులు, ఉపాధ్యాయులు, పత్రికా రచయితలు జాతీయ పరిశ్రమదారులు ఒక ఉద్యమం సాగిస్తున్నారు. మదాం సన్ యట్ సెన్ దీనికి నాయకత్వం వహిస్తుంది. ఈ ఉద్యమానికి చెందిన ప్రముఖులు ప్రకటించిన విజ్ఞప్తిఇది.

రష్యా అమెరికాలకు యుద్ధం రెచ్చగొట్టుటకు కుట్ర

అమెరికా సేనలు చైనాలో ఉండడంవల్ల కలుగగల ప్రమాదాన్ని వివరిస్తూ మదాం సన్ యట్ సెన్ ఈ మధ్య ఒక ప్రకటన చేసింది.

"రష్యా అమెరికాల మధ్య యుద్ధాన్ని రెచ్చగొట్టడానికి చైనాను ఒకప్రపంచ యుద్ధరంగంగామార్చ కొమింటాంగు పార్టీలోని అభివృద్ధి నిరోధకవర్గాలు కుట్రలు పన్నుతున్నారు. ఆ యుద్ధంలో చైనా కమ్యూనిస్టులను నామరూపాలు లేకుండా నాశనం చేయగలమని వారి ఆశ ఈ ఉద్దేశంతోనే వీరు చైనాలో పెద్ద అంతర్యుద్ధాన్ని ప్రారంభిస్తున్నారు.

"చైనాలో అమెరికా సేనలుండడం వీరికి చాల ప్రోత్సాహాన్నిస్తూంది. అమెరికా, చైనా అభివృద్ధి నిరోధకవర్గాలు తమతమ ఆశయాలను సాధించుకోడానికి పోటీపడి పనిచేస్తున్నాయి. చైనా ప్రజలకు, వారి జాతీయ హక్కులకు, స్వాతంత్ర్యానికి వారి మనుగడకే ఘోరప్రమాదం వాటిల్లనుంది.

"అమెరికా కొమింటాంగు ప్రభుత్వానికి అందచేస్తూన్న ధన, మిలిటరీ సహాయాన్ని ఆపుచేయడంవల్లనే ఈ ప్రమాదం తప్పగలదు. ఈ విషయమై తగు ఆందోళన చేయవలసిందని అమెరికా ప్రజలకు విజ్ఞప్తి చేయాలి. చైనాలో సర్వపక్ష జాతీయప్రభుత్వ స్థాపనకు తోడ్పడవలసిందని విజ్ఞప్తిచేయాలి. చేయగల సాయమంతా ఆ ప్రభుత్వానికే చేయాలని కోరాలి," అని ఈమె ప్రకటించింది.

మాంచెస్టరు గార్డియన్ ఖండన

అమెరికా సేనలు చైనాలో ఉండడాన్ని ఖండిస్తూ, సుప్రసిద్ధ బ్రిటిష్ మితవాదపత్రిక 'మాంచెస్టరు గార్డియన్' ఒక సంపాదకీయంలో ఇలా రాసింది:

"యుద్ధకాలంలోనూ, ఆ తర్వాతా అమెరికావారు కొమింటాంగు ప్రభుత్వానికే పూర్తి సహాయం చేశారు. కొమింటాంగు సేనలు అమెరికావారిచేత తర్ఫీదు చేయబడ్డాయి; ఆ సేనలుపయోగిస్తున్న ఆయుధాలన్నీ అమెరికా సప్లయి చేసినవే; వాటిని ఒక చోటినుంచి మరొకచోటికి రవాణాచేస్తున్నది. అమెరికా విమానాలే.

"ఈ కొమింటాంగు ప్రభుత్వం చాల కాలంనుండి తన మనుగడకే అమెరికావారి దయపైన ఆధారపడిఉంది.

"ఇటీవల అమెరికా జోక్యంవల్ల కొమింటాంగు, కమ్యూనిస్టుపార్టీల మధ్య శాంతి కుదిరి, ప్రజాతంత్ర పునర్నిర్మాణానికి దారి తీస్తే బాగుండేది అలాంటిదేమీ జరగలేదు. ఇప్పటికి ఏభైవేలమంది పైగా అమెరికాసేనలు చైనాలో ఉంటున్నాయి. వీనివల్లఅంతర్యుద్ధం విస్తరించడం,సంక్షోభంతప్పమరోఫలితమేమీ లేదు అంటున్నారు అనేకులు ... ఉండడం ఏవిధంగానూ సమర్థనీయంకాదు.

"చివరకు కమ్యూనిస్టులు సూచిస్తున్న పద్ధతులపై చైనా పునర్నిర్మాణం తప్పదు. కమ్యూనిస్టులు తాము విముక్తి పరచిన ప్రదేశాలలో సమర్థమైన ప్రజాప్రభుత్వాలను ఈ కొద్దిరోజుల్లోనే స్థాపించగలిగారు. 20 ఏళ్ళనుంచి అధికారంలోఉన్న కొమింటాంగు పార్టీ ఇంతవరకు ఈపనిచేయలేకపోయింది."

చైనాలో అమెరికా విధానం యొక్క అంతరార్థం

చైనాలో అమెరికా ప్రభుత్వం అనుసరిస్తూన్న విధానంయొక్క అంతరార్థాన్ని బట్ట బయలుచేస్తూసోవియటుపత్రిక 'న్యూటైమ్సు' ఇలారాసింది:

"సింగ్ టావో రేవుపట్టణంలో అమెరికా ఏడవనౌకాదళం కేంద్రీకరించబడిఉంది. దీనికి చెందిన నౌకాసైనికాధిపతి కొమింటాంగుసేనలకు సహాయం చేయడానికి తాముసిద్ధంగా ఉన్నామన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికని సాకుచెప్పి ఒక అమెరికా నౌకాదళం యాంగ్ట్సినదిపై గస్తీతిరుగుతూ కొమింటాంగు మిలిటరీ చర్యలకు సాయంచేస్తూంది.

"చైనాలో అమెరికా వారనుసరిస్తూన్న ఆర్థిక, రాజకీయ విధానం ప్రపంచాధిపత్యం కోసం అమెరికా పన్నుతూన్న వ్యూహంలో ఒకభాగమే. పసిఫిక్కు యుద్ధంలో తాము నిర్వహించిన పాత్రకు ప్రతిఫలంగా చైనా ఆర్థికంగా తమగుప్పిట్లోకి రావడం న్యాయమని వీరి అభిప్రాయం.

"అమెరికావారి ఈప్లాను పూర్తిగా నెరవేరడానికి చైనా ప్రజాపక్షాలు పెద్ద ఆటంకంగా ఉన్నాయి. కాబట్టి ఈ ప్రజాపక్షాలపైకి శక్తిమానిన కొమింటాంగుపక్షానికిఅన్నివిధాల తోడ్పడాలని వారు నిశ్చయించుకొన్నారు. పెద్దఎత్తున తమ సహకారం లేనిదే కొమింటాంగు పక్షం కమ్యూనిస్టుల నెదిరించి నిలవలేదని వీరు గుర్తించారు. ఈనాడు చైనాలో అంతర్యుద్ధం తీవ్రంగా వ్యాపించడానికి ముఖ్యకారణం అమెరికావారిజోక్యమే.

"చైనాలో సుస్థిర శాంతికోసం కృషి చేస్తున్న వర్గాలన్నింటికీ అమెరికావారి ఈ చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చైనాలో శాంతి ఏర్పడాలని, ఐక్యత, ప్రజాస్వామ్యము నెలకొనాలనీ సోవియటు ప్రజలు హృదయపూర్వకంగా కోరుతున్నారు. కాబట్టి శాంతికి భంగకరంగా చైనాలో అమెరికా అనుసరిస్తూన్న విధానాన్ని సోవియటు చూస్తూ ఊరుకోజాలదు."

బర్మా ప్రజాశక్తులపై దెబ్బతీయడానికి ప్రభుత్వ పన్నాగం

థాకిన్ సో నాయకత్వం క్రింద నున్న కమ్యూనిస్టు గ్రూపుపై బర్మా ప్రభుత్వం నిషేధం విధించింది. థాకిన్ సోఆచోకి తెలిపిన వారికి పెద్ద బహుమాన మిస్తామని కూడా ప్రకటించింది. ఇతని అనుచరులు దోపిడీలు చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తూంది. పౌర సత్వ హక్కులకే ఈ నిషేధం భంగకరం. కాబట్టి, దీనిని ఖండిస్తూ మొన్న శుక్రవారం నాడు సర్వ వ్యాపిత సమ్మె, ప్రదర్శనలు జరపాలని "అంటీ ఫాసిస్టు లీగు"లో చేరి ఉన్న బర్మా కమ్యూనిస్టుపార్టీ సూచించింది. ఆ సంస్థ కార్యవర్గం ఈ సూచనను నిరాకరించింది. దానిపై బర్మా కమ్యూనిస్టుపార్టీ నాయకుడూ, అంటీ ఫాసిస్టు లీగు ప్రధాన కార్యదర్శి అయిన థాన్ టున్ కార్యదర్శి పదవికి రాజీనామా నిచ్చారు.

థాకిన్ సో బర్మా కమ్యూనిస్టుపార్టీ ముఖ్య నాయకుల్లో ఒకడుగా ఉండేవాడు. కొన్నాళ్ళ క్రిందట కొన్ని అభిప్రాయభేదాలు వచ్చి థాకిన్ సో, మరికొందరు నాయకులు పార్టీ నుంచి విడిపోయి, వేరే కమ్యూనిస్టుపార్టీని ఏర్పచారు. చీలిపోయిననాటినుంచి తిరిగి ఏకం కావడానికి సంప్రతింపులు సాగుతూనే ఉన్నాయి. చాలవరకు ఫలితం కూడా చేకూరింది. నిజానికి వీరికి కలిగిన రాజకీయ విభేదాలు ఏమంత పెద్దవికావు. అవి పూర్తిగ తొలగిపోయేజాడలు కూడా కనపడసాగాయి.

బర్మా స్వాతంత్ర్యోద్యమంలో నాయకస్థానం కమ్యూనిస్టుపార్టీది. ఈ పార్టీలో చీలికలు కలగడం బర్మా గవర్నరుకి పండగయింది. తిరిగి ఐక్యత ఏర్పడే సూచనలతనికి కంటకమయాయి. ఈ ఐక్యతకు అవకాశం లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే థాకిన్ సో పార్టీపై నిషేధం పెట్టాడు. థాన్-టున్ పార్టీ చట్టసమ్మతంగా ప్రవర్తిస్తున్నదంటూ విడిచిపెట్టారు. ఈ విధంగా వీరి మధ్య విభేదాలు తీవ్రం చేయగలుగుతామని సామ్రాజ్యవాదుల ఆశ. థాకిన్ సో పనిపట్టిన తరువాత. బర్మా కమ్యూనిస్టుపార్టీని పూర్తిగా అణచివేయాలని వారి వ్యూహం. ఆతరువాత 'అంటీ ఫాసిస్టు లీగు'ను. బర్మా స్వాతంత్ర్యోద్యమాన్ని విచ్ఛిన్నంచేయడం ఏమంత కష్టమయిన పనికాదని వారి అంచనా.

ఈ అంచనాలు తప్పని నిరూపించడానికే కమ్యూనిస్టుపార్టీ పైప్రదర్శనలను సూచించింది. కాని. అంటీ ఫాసిస్టులీగు నాయకత్వం దీని ప్రాముఖ్యతను గుర్తించక నిరాకరించింది.

పాలస్తీనా దౌర్జన్యవాదుల దురంతాలు

పాలస్తీనాలో ఇటీవల యూదులపై బ్రిటిష్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధ విధానం కొనసాగించినా, వారిదౌర్జన్య కృత్యాలు అణగిపోలేదు. యూదునాయకుల, అరబ్బు నాయకుల పంథాలు, పాలస్తీనా స్వతంత్ర ఉద్యమాన్ని పెడదారుల పట్టించుతోంది.

జులై 22 వ తేదీన జరూసలంలో, బ్రిటిష్ మిలిటరీ ప్రధానకార్యాలయమూ, పాలస్తీనా ప్రభుత్వ కార్యాలయమూ, ఉంటున్న కింగ్ డేవిడ్ హోటల్ మేడలోని అయిదు అంతస్థులను, రహస్యయూదు సైన్యంవారు బాంబులతోపేల్చి పడగొట్టారు. అధికార వార్తలననుసరించి జులై 26 వరకు. చనిపోయిన వారి సంఖ్య 76, గాయపడ్డవారు 46 గురు. మరొక ముప్పదిమందిజాడ తెలియడంలేదు.

బాంబుల ప్రేల్చినది తామేనని అంగీకరిస్తూ, రహస్య యూదుసైన్యం మరొక ప్రకటన చేశారు. బాంబులు ప్రేల్చేముందు తామొక హెచ్చరిక చేశామనీ అయినాబ్రిటిష్ అధికారులు దానిని పాటించలేదనీ, అందువల్లనే అంత జననష్టం కలిగిందనీ- యూదుసైన్యంవారు ప్రకటించారు. ముందుగా తమకెట్టి హెచ్చరిక రాలేదని ప్రభుత్వం ప్రకటించింది.

అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, బ్రిటిష్ ప్రధాని అట్లీ, ఈ దౌర్జన్యకృత్యాలను ఖండించారు. పార్లమెంటులోని యూదు సభ్యులు కూడా ఈ చర్యలను ఖండించారు. పాలస్తీనాలోని యూదు పత్రికలుసైతం దౌర్జన్య చర్యలను నిరసించాయి.

రహస్య యూదు కార్యకలాపాలకు, యూదు జాతీయ సంస్థలకూ సంబంధం వున్నదని, పాలస్తీనాప్రభుత్వం ఒకప్రకటన చేసింది.

రహస్య సంస్థలలో మితవాద సంస్థయైన 'హగానా' కు, అతివాద యూదు సైన్యానికీ కూడ సంబంధమున్నదని, ఈ రెంటితో యూదు జాతీయ సంస్థలకు సంబంధం వున్నదని ఈ ప్రకటన తెలియజేసింది, లండన్, పాలస్తీనాల మధ్య నడిచిన టెలిగ్రాముల వల్ల ఈ విషయం తెలుసుకొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. యూదునాయకులిది అబద్ధమంటూ ఖండించారు.

కింగ్ డేవిడ్ హోటల్ బాంబు ప్రేలుడు సందర్భంగా, 'పాత పట్టణం' లోని యూదులను వందలకొలది అరెస్టు చేసి పోలీసులు సోదా చేశారు. ప్రశ్నలు కురిపించారు. జులై 26 వ తేదీన 376 మంది యూదులను వివిధ ప్రాంతాలలో అరెస్టు చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో స్త్రీలు కూడా వున్నారు.

పాలస్తీనాకు మరొక ఫెడరలిస్టు స్కీము

ఆంగ్లో - అమెరికన్ పాలస్తీనా కమిటీ విచారణ రిపోర్టుపై, బ్రిటిష్ అమెరికన్ నిపుణుల చర్చ ముగిసిందనీ, వారి నిర్ణయాన్ని బ్రిటిషు ప్రభుత్వానికి తెలియజేశారనీ, ఒక బ్రిటిషు కార్యాలయోద్యోగి జులై 26 వ తేదీన లండన్ లో తెలియజేశాడు.

ఈనిర్ణయం ఇంకా ప్రకటించకపోయినా, అప్పుడే దానిస్వరూపం ఏమిటోకొంత బయటికి పొక్కింది. పాలస్తీనాకు మరొక ఫెడరలిస్టుస్కీమును రుద్దడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారు.

ఈ ప్లాను ప్రకారం పాలస్తీనా రెండుగా విభజింపబడుతుంది. ఒకటి యూదులకు రెండవది అరబ్బులకు ఈయబడుతుంది. ఆరెండు భాగాలలో రాష్ట్ర స్వపరిపాలన (అటానమీ) ఉంటుంది. ఈ రెండింటినీ కలుపుతూ కేంద్రంలో మరొక ప్రభుత్వం వుంటుంది. అది బ్రిటిషువాళ్ళ పెత్తనంక్రింద ఉంటుంది. అయితే నామకః యూదులకు అరబ్బులకు దానిలో స్థానంవుంటుంది ఈ కేంద్ర ప్రభుత్వంచేతిలో దేశరక్షణ, ఆర్థిక శాఖ, రవాణాశాఖ మొదలైన ముఖ్యశాఖలుంటాయి.

ఈ ప్రణాళికవల్ల, యూదులు అరబ్బులు 'స్వపరిపాలన' నేర్చుకొంటారట. ఈ ప్రణాళిక బాక్సాలిక మేననీ, క్రమంగా పాలస్తీనా రెండుగా విభజన అవడమో లేక బ్రిటిషు పెత్తనంలేని కేంద్రంతో ఫెడరల్ రాజ్యాంగం కావడమో, జరుగుతుందని సామ్రాజ్యవాదులంటున్నారు. అందాకా ధర్మకర్తృత్వంపేరిట ఆమిక్కడ తిష్టవేసుకొని వుంటారట.

తమ ప్రణాళికను పాలస్తీనాపై రుద్దడానికి రౌండ్ టేబిల్ మహాసభ అంటూ ఒకటి పెడుతున్నారు. అది ఆగస్టు నెలాఖరులోనో, సెప్టెంబరు మొదటివారంలోనో సమావేశమవుతుంది దీనికి అరబ్బు, యూదునాయకులను ఆహ్వానించారు.

కాని పాలస్తీనా విభజనకు అరబ్బు లంగీకరించరనేది, ముఖ్య అరబ్బునాయకుల ప్రకటనలవల్ల తెలుస్తోంది. కామన్సుసభలో కమ్యూనిస్టుసభ్యుడు గలాకర్ చెప్పినట్లు, "యూదులు అరబ్బులు సఖ్యంగా ఉండే స్వతంత్ర పాలస్తీనాను నిర్మించడమే పాలస్తీనా సమస్య పరిష్కారానికి మార్గం."

రాజ్యాంగ తతంగం



కాంగ్రెసు మంత్రివర్గానికి అగ్నిపరీక్ష

గుంటూరు కమ్యూనిస్టుల తీర్పుపై 'స్వతంత్ర' వ్యాఖ్య

గుంటూరు కేసులో తీర్పు చెప్పబడింది. హత్యానేరం మోపబడ్డ 8 గురు కమ్యూనిస్టులలో కిద్దయ్యకూ మరియొకరికీ 10 ఏళ్ల కఠినశిక్ష విధించబడింది. ఈ కేసుకిసంబంధించిన కొన్నివిషయాలమీద తప్పకుండా ఆలోచన అవసరం. ఒకసమ్మె కారణంగా ఉద్రేకంపొందిన ప్రజల దొమ్మీలో ఈహత్య చేయబడిందని చెప్తారు. ప్రభుత్వనేరారోపణ జాగ్రత్తగా కూడబలుక్కుని చేసినట్లు కనబడుతూంది. ప్రాసిక్యూషన్ కేసును నడిపించిన పోలీసు ఉద్యోగి దప్పుల సుబ్బారావు, శాసనోల్లఘనం రోజుల్లో కాంగ్రెసు వలంటీర్లనీ, నాయకుల్నీ, ఐహా క్రూరంగా హింసించిన ప్రబుద్ధుడు. మద్రాసు మాజీ స్పీకరు సాంబమూర్తిగారిని స్పృహతప్పేదాకా బాదిన కీర్తిశాలి. ఈ పట్టాలేవాలు, ప్రస్తుతం అధికారంలోవున్న కాంగ్రెసు మంత్రులు పరిస్థితుల మాహింపదానికి ఏమంతే అద్వాయిఇర్ల ప్రభుత్వ కాలంలో జరిగిన అన్యాయాల్ని సరిదిద్దుకోవడమూ, పోలీసులు కసిపెట్టి హత్యానేరాలు మోపి దీర్ఘశిక్షలు వేయించిన బాధితుల్ని విడిపించడమూ అధికారంలోకి రాగానే ప్రస్తుత మంత్రివర్గం తీసుకున్న పనులు. ఈనాడు కార్మికోద్యమంలో పనిచేస్తున్నవారూ, దొంగవర్తకులకి వ్యతిరేకంగా పనిచేస్తున్నవారూ విపరీతమైన ఇబ్బందులకి లోనుగావలసి వస్తూంది. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఈకార్యక్రమాన్నే సాగిస్తున్నారు. కార్మికోద్యమానికి శతృవులయిన ఫ్యాక్టరీ యజమానులకీ, దొంగ వర్తకాలు సాగించే వర్తకులకీ కావలసినంత డబ్బువుంది వారికున్న పలుకుబడికూడా చాలాహెచ్చు. పెద్ద వుద్యోగాలలోవున్న వారిపై తమకున్న పలుకుబడితో ఎన్ని అన్యాయాలు చేస్తూవున్నా నిగవుప్పు వాడకుండా తప్పించుకు పోగలుగుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాచేసుకుని, పోలీసు ఉద్యోగుల ఉదాసీనత బలంచేసుకుని, అధిక లాభాలు దోచుకుందుకై ప్రజల ప్రాణాలతో చెలగాటంఆడే ఈదుష్టుల్ని పట్టుకుందుకు పనిచేసే ప్రతిప్రజాసేవకుడూ ఎన్నోకష్టాల నెదుర్కోవలసివస్తూంది. ఇంక ఆ ప్రజాసేవకులు కమ్యూనిస్టులే అయితే. వారి పాట్లు చెప్పనక్కర్లేదు. రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించడానికై పోరాడుతూన్న కాంగ్రెసు వాదులు సామ్రాజ్యవాదులచేతా, వారితొత్తుల చేతా ఎన్నోహింసలు పాలయ్యారు. ఈవేళ ఆ పోరాటం ముగింపుకి రాబోతూంది. పీడనకి హింసలకీ పాలయ్యేజనం మారేరు. ఈవేళ పోరాటం మరోరంగంలో తీవ్రంఅయింది. తమజేబులు నింపుకుందుకై ప్రజలప్రాణాలు తియ్యడానికి తయారవుతూన్న సమాజశతృవులపై జరుగుతూంది. ఈ నాటి పోరాటం.

ఇంతకాలం తీవ్రపోరాటం సాగించి కాంగ్రెసు వాదులు ఈ నాడు స్వార్థ వదాలనే రొంపిలో పడిపోతున్నారు.

పైగా కమ్యూనిస్టు వ్యతిరేకత ఒకటి అలవరచుకున్నారు. ఈగుడ్డి వ్యతిరేకతతో ఈ నాడు భారతదేశపు ఆర్థిక వ్యవస్థను తలక్రిందులు చేస్తున్న సమాజ శతృవులతో చెలిమి చేసుకుంటున్నారు. ఈగుంటూరుకేసు మద్రాసులోని కాంగ్రెసు మంత్రివర్గానికి ఒక అగ్నిపరీక్ష. మన ప్రధానమంత్రి ఒకప్పుడు ఒక హత్యానేరంలో రెండోముద్దాయిగా బోను ఎక్కినవారే. అధికారంలోకి రాకపూర్వం పోలీసు వుద్యోగులచేతులలోనూ, మేజిస్ట్రేటు కోర్టులలోనూ, తాముపొందిన అనుభవాల్ని గుర్తుకు తెచ్చుకుని ప్రజాసేవకులకి న్యాయం జరిగేలాచూడాలి. ప్రస్తుత పరిస్థితులు మారకూడదనీ, లంచగొండితనం మాయకూడదనీ కోరే అధికారంలోవున్న బలవత్తర శక్తులతో ఈ ప్రజాసేవకులు ఢీకొంటూన్నది కేవల ప్రజల క్షేమంకోసమే నని మరవరాదు.

— 'స్వతంత్ర' నుంచి.

Edited, printed & Published by Katragadda Rajagopalarao at the Prajasakti Press, Moghalarajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE